మంగళవారం
13•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 49
• పేజీలు: 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in

సోమవారం కాంచీపురం అత్తివరదరాజస్వామివారి ఆలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న ఆలయ వేదపండితులు. చిత్రంలో కేసీఆర్ సతీమణి శోభ కూడా ఉన్నారు.

పెద్దన్నగా సహకరిస్తా

రాయలసీమకు గోదావరి తరలింపు అవసరం

- పట్టుదల ఉన్న సీఎం జగన్‌తో అది సాధ్యం
- రతనాలసీమగా మార్చేందుకు సహకరిస్తాం
- రెండు రాష్ట్రాల అభివృద్ధికి పనిచేస్తాం
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- నగరిలో కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం
- కుటుంబసమేతంగా కంచి అత్తివరదరాజస్వామిని దర్శించుకున్న సీఎం కేసీఆర్
- తిరుగుప్రయాణంలో ఎమ్మెల్యే రోజా ఆతిథ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి పెద్దన్నగా సహకరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. రాయలసీమ కష్టాలు తనకు తెలుసునని, గోదావరి జలాలు రాయలసీమకు రావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. పట్టుదల ఉన్న యువ నాయకుడు జగన్‌తో అది సాధ్యమేనని చెప్పారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఇద్దరం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. సోమవారం తమిళనాడు కాంచీపురంలోని అత్తివరదరాజస్వామివారిని ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబసమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలుచేశారు. ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేకవిమానంలో కుటుంబసభ్యులతో సహా బయలుదేరి తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం.. అక్కడినుంచి

మిగతా 2వ పేజీలో

సోమవారం రాత్రి విద్యుత్‌కాంతుల నడుమ నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల నుంచి దుంకుతున్న కృష్ణా జలాలు

కృష్ణమ్మ జలజాతర

ఆల్మట్టి నుంచి బంగాళాఖాతం దాకా కళకళలాడుతున్న పరీవాహక ప్రాంతం

- ఎగువనుంచి కొనసాగుతున్న వరద ఉధృతి
- కృష్ణలో తుంగభద్ర సంగమం
- అలంపూర్ బ్యాక్‌వాటర్‌లో కలిసిన రెండు లక్షల క్యూసెక్కుల వరద
- నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తివేత
- పులిచింతల నుంచి దిగువకు నీటి విడుదల

హైదరాబాద్/మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/ జోగుళాంబ గద్వాల ప్రతినిధి/ హాలియా, నమస్తే తెలంగాణ:

గత కొన్నేండ్లుగా సంక్షోభానికి వేదికగా నిలిచిన కృష్ణాబేసిన్‌లో సుదీర్ఘకాలం తర్వాత జలజాతర కనిపిస్తున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి నుంచి దిగువన పులిచింతల దాకా కృష్ణానదిపై నిర్మించిన అన్ని ప్రాజెక్టుల్లోనూ కృష్ణమ్మ సంపూర్ణంగా నిండి.. కడలి ఒడికి చేరుతున్నది. నిరుడు ఆగస్టు 28న శ్రీశైలం గేట్లు తెరుచుకోగా.. ఈ ఏడాది ఆగస్టు 12నే నాగార్జునసాగర్ గేట్లను ఎత్తివేయడం గత పదేండ్లలో మొదటిసారి కావడం విశేషం. ఎగువనుంచి కొనసాగుతున్న వరద ఉధృతిని నియంత్రించడంలో భాగంగా అధికారులు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల మీదుగా దిగువకు భారీమొత్తంలో జలాలను విడిచిపెడుతున్నారు. అలంపూర్‌వద్ద బ్యాక్‌వాటర్‌లో తుంగభద్ర కృష్ణలో సంగమించింది. ఈ క్రమంలో ప్రకాశం బరాజ్‌లో పెద్దగా నీటి నిల్వకు అవకాశం లేకపోవడంతో అక్కడి నుంచి దిగువన సముద్రంలోకి కృష్ణాజలాలను వదులుతున్నారు. ప్రతి ఏడాది లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు

మిగతా 3వ పేజీలో

కృష్ణాబేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల అవుట్‌ఫ్లోలు ఇలా..

ఆల్మట్టి	5,40,000 క్యూసెక్కులు
నారాయణపుర	5,99,000 క్యూసెక్కులు
జూరాల	8,16,957 క్యూసెక్కులు
తుంగభద్ర	1,15,133 క్యూసెక్కులు
శ్రీశైలం	8,46,796 క్యూసెక్కులు
నాగార్జునసాగర్	3,94,428 క్యూసెక్కులు
పులిచింతల	25,000 క్యూసెక్కులు

నాగార్జునసాగర్ పూర్తి స్థాయి..

నీటిమట్టం	నిల్వసామర్థ్యం
590 అడుగులు	312 టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం	ప్రస్తుత నీటి నిల్వ
568.20 అడుగులు	252.06 టీఎంసీలు

మరికొన్ని ఆఫర్లు

- అందుబాటులోకి హైస్పీడ్ బ్రాండ్‌బ్యాండ్ సేవలు
- ఇంటర్నెట్ కనీస వేగం 100 ఎంబీపీఎస్.. గరిష్ఠ వేగం 1 జీబీపీఎస్
- నెలవారీ కనిష్ఠచందా రూ.700.. గరిష్ఠం రూ.10,000
- రూ.500 చెల్లిస్తే.. అమెరికా, కెనడాలకు అపరిమిత కాలింగ్ ప్యాకేజీ
- వచ్చేఏడాది మధ్యలో జియో ఫస్ట్‌డే ఫస్ట్ షో సేవలు

జియోహో

ఇక ఫైబర్ సేవలతో రిలయన్స్ హల్‌చల్

- సెట్‌టాప్ బాక్స్, హెచ్‌డీ/4కే టీవీ ఉచితం
- సినిమా విడుదలైన రోజే టీవీలో చూసే చాన్స్
- ల్యాండ్ లైన్‌పై జీవితాంతం ఉచితకాల్స్
- రిలయన్స్ అధినేత ముకేశ్ సంచలన ప్రకటన

ఉచితంగా హెచ్‌డీ టీవీ లేదా 4కే ఎల్‌ఈడీ టీవీ ఇస్తారు.. దానికి సెట్‌టాప్ బాక్సు కూడా ఉచితమే! ల్యాండ్‌లైన్‌పై జీవితాంతం ఉచితంగానే కాల్స్ చేసుకోవచ్చు! జియో ఫస్ట్‌డే ఫస్ట్ షో ఆఫర్‌లో థియేటర్‌లో సినిమా విడుదలైన రోజే.. టీవీలో చూసే అవకాశం కల్పిస్తారు! ఇవన్నీ త్వరలో మార్కెట్‌లో పెను సంచలనాలకు దారితీయనున్న రిలయన్స్ జియోఫైబర్‌లోని అద్భుతాలు! జియోతో టెలికం మార్కెట్‌ను ఒక కుదుపు కుదిపిన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ.. ఇప్పుడు జియోహో అనిపించేలా కొత్త సంచలనానికి తెరతీస్తున్నారు. సోమవారం ముంబైలో నిర్వహించిన సంస్థ వాటాదారుల 42వ వార్షిక సమావేశంలో జియోఫైబర్ అద్భుతాలను ఆవిష్కరించారు. ఈ ఫైబర్ సేవలు వచ్చే నెల ఐదో తేదీ నుంచి వార్షిక చందాదారులకు అందుబాటులోకి తెస్తున్నట్టు ఆయన ప్రకటించారు. మార్కెట్‌లో కొమ్ములు తిరిగిన టెలికం ఆపరేటర్లు ఇప్పటికే రిలయన్స్ జియో దెబ్బకు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోగా.. తాజాగా డిష్ టీవీలు, కేబుల్ ఇంటర్నెట్, టెలివిజన్ పరిశ్రమలకు గట్టి షాకిచ్చారు ముకేశ్. అంతేగాక తమ చమురు శుద్ధి-రసాయనాల వ్యాపారంలో సౌదీ ఆరామ్కోకు 20 శాతం వాటాను, చమురు రిటైల్ వ్యాపారంలో బ్రిటిష్ పెట్రోలియంకు 49 శాతం వాటాను అమ్మేస్తున్నట్లు ముకేశ్ ఈ సందర్భంగా ప్రకటించారు. తద్వారా రూ.1.15 లక్షల కోట్లను పొందుతున్నట్లు చెప్పారు.

9

సోమవారం రాత్రి గాయత్రి పంప్‌హౌస్‌లోని నాలుగో నంబర్ మోటర్ (బాహుబలి) ఎత్తిపోసిన నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడుతున్న దృశ్యం

రేపు సీఎం కేసీఆర్ చేతులమీదుగా

బాహుబలి ప్రారంభం!

- మేఘా ఇన్‌ఫ్రా వెల్లడి
- గాయత్రి పంప్‌హౌస్‌లో 4, 5 మోటర్ల ట్రయల్ వెట్‌రన్ సక్సెస్
- గోదావరి నదిలో స్థిరంగా ప్రవాహం
- కన్నెపల్లిలో మళ్లీ మోటర్ల ప్రారంభానికి చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన.. బాహుబలిగా పిలుస్తున్న.. ఆసియాలోనే అతిపెద్ద ఎత్తిపోతల మోటర్‌ను బుధవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించే అవకాశం ఉన్నదని నిర్మాణసంస్థ మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలో అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్ అయిన గాయత్రి (ప్యాకేజీ-8, లక్ష్మీపూర్) పంప్‌హౌస్‌లో 139 మెగావాట్ల సామర్థ్యంతో ఏడు మోటర్లను అమర్చిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రాజెక్టు అధికారులు ఐదో మోటర్ ట్రయల్ వెట్‌రన్‌ను

మిగతా 3వ పేజీలో



సోమవారం బక్రీద్ సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలోని మక్కామసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	66.00	రిటైల్ లైవ్	88.00
డ్రెస్‌డ్	128.00	స్కిన్‌లెస్	145.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	328.00	రంగారెడ్డి	328.00
మెదక్	328.00	కరీంనగర్	331.00
వరంగల్	331.00	చిల్లర ధర	3.90

దక్షిణాదిలో సుప్రీం బెంచ్!

2

- డిమాండ్‌కు పెరుగుతున్న మద్దతు
- పెద్ద నగరాల్లో రీజినల్ బెంచ్‌లు ఏర్పాటుచేయాలన్న ఉపరాష్ట్రపతి
- కేంద్ర న్యాయశాఖ మంత్రికి టీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ లేఖ

ధర్మగంట

పుట్టకముందే.. భూమి కొన్నాడు!

6

- 43 ఏండ్ల వ్యక్తి.. 46 ఏండ్ల క్రితం భూకొనుగోలు
- దశాబ్దం తర్వాత వెలుగులోకి
- జగిత్యాల జిల్లా రెవెన్యూ లీలలు
- లబోదిబోమంటున్న బాధితులు

అతను పుట్టడానికి మూడేండ్ల ముందే భూమికి యజమాని అయ్యాడు. నలభై మూడేండ్ల వ్యక్తి.. నలభై ఆరేండ్ల క్రితం భూమిని కొన్నట్టు రెవెన్యూ రికార్డులు చెప్తున్నాయి. జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారుల లీలావిన్యాసమిది. పూటగడవక పొట్టకూటి కోసం ముంబైకి వెళ్లినందుకు.. వారసత్వంగా సంక్రమించిన భూమిని.. దాన్ని ఆనుకొని ఉన్న భూమిలో కొలు చేసుకొంటున్న వ్యక్తికి రెవెన్యూ అధికారులు రాసిచ్చేశారు. చిత్రమేమంటే.. ఆ వ్యక్తి వయస్సు సుమారు 43 ఏండ్లయితే.. 46 ఏండ్ల క్రితమే కొన్నట్టు రికార్డులు సృష్టించడంతో అసలు హక్కుదారు అవాక్కయ్యాడు. ఇంతటితో ఆగలేదు. అతను కొలుకు చేసుకొంటున్న భూమిలో సగం భూమిని కూడా పట్టా చేసేశారు. జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన రైతులు న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులు, వీఆర్వోల పుణ్యమా అని తమ బతుకుదెరువు పూర్తిగా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అనంతగిరి ఇకపై 'అన్నపూర్ణ'

3

- రంగనాయకసాగర్‌తోపాటు రెండు రిజర్వాయర్లకు పాతపేర్లు కొనసాగింపు
- సీఎం కేసీఆర్ నిర్ణయం ■ తొలి ఐదు నిర్మాణాలకు ఇప్పటికే ఖరారైన పేర్లు

సోమవారం తమిళనాడులోని కంచి అత్తి వరదరాజస్వామి దర్శనానికి వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఆయన సతీమణి శోభ, కుమార్తె కవిత, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే రోజా కూడా ఉన్నారు.

కంచి అత్తి వరదరాజస్వామి ఆలయంలో స్వామివారి హారతి తీసుకొంటున్న సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభ. చిత్రంలో కేసీఆర్ కుమార్తె కవిత, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే రోజా కూడా ఉన్నారు.

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కంచి అత్తి వరదరాజస్వామి జ్ఞాపికను బహూకరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే రోజా దంపతులు కూడా ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా కుటుంబసభ్యులు

పెద్దన్నగా సహకరిస్తా

మొదటిపేజీ తరువాయి...

రోడ్డుమార్గంలో కంచి వెళ్లారు. నగరి నియోజకవర్గం మీదుగా వెళ్లేటప్పుడు స్థానిక ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్కే రోజా మార్గమధ్యంలో సీఎం కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. దారిపొడవునా స్వాగతతోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పెద్దసంఖ్యలో ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలిచి.. కేసీఆర్‌ను స్వాగతించారు. కేసీఆర్‌వెంట రోజా కూడా కాంచీపురం వెళ్లారు. అత్తివరదరాజస్వామి ఆలయంలో కేసీఆర్ దంపతులను ఆలయఅధికారులు, వేదపండితులు ఘనంగా స్వాగతించారు. ప్రత్యేక పూజల అనంతరం కేసీఆర్‌ను వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. తిరుగుప్రయాణంలో నగరిలో ఎమ్మెల్యే రోజా.. సీఎం కేసీఆర్‌కు ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమకు నీటితరలింపులో తన పూర్తిసహకారం ఉంటుందని చెప్పారు. ఏపీలో క్రియాశీలకంగా, పట్టుదలతో పనిచేసే జగన్ సీఎంగా ఉన్నందున గోదావరి తరలింపు తప్పక సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం గోదావరి నుంచి వెయ్యికిపైగా టీఎంసీలు వృథాగా సముద్రంలో కలిసిపోయాయన్నారు. కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు ఇప్పటికే నిండాయని చెప్పారు. గోదావరి జలాల తరలింపుపై తాను, జగన్ ఇప్పటికే చర్చలు జరిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయం కొందరికి జీర్ణం కాకపోవచ్చని అన్నారు. ప్రజల మద్దతు, దీవెన ఉన్నంతకాలం ప్రజల ఆశయాలను నెరవేరుస్తామని, రాలయసీమను రతనాలసీమగా మారుస్తామని స్పష్టంచేశారు. 60, 70 ఏండ్ల తెలుగునేల చరిత్రలో జగన్, తాను కలిసి కొత్త చరిత్రను సృష్టించబోతున్నామని చెప్పారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి కలిసి పని చేస్తామన్నారు. అనంతరం రోడ్డుమార్గంలో రేణిగుంట చేరుకున్న సీఎం కేసీఆర్.. ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వచ్చారు. సీఎం కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కుమార్తె, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి తదితరులున్నారు. కాంచీపురం పర్యటనలో ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి కూడా ఉన్నారు. రోజా నివాసంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.. సీఎం కేసీఆర్‌ను కలిశారు. తిరుమల స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. టీటీడీలో చేపడుతున్న సంస్కరణలను వివరించారు.

దక్షిణాదిలో సుప్రీం బెంచ్!

- డిమాండ్‌కు పెరుగుతున్న మద్దతు
- పెద్ద నగరాల్లో రీజినల్ బెంచ్‌లు ఏర్పాటుచేయాలన్న ఉపరాష్ట్రపతి
- కేంద్ర న్యాయశాఖ మంత్రికి టీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సువిశాలమైన భారతదేశంలో కేవలం ఒక్క చోటే సుప్రీంకోర్టు ఉండకూడదని, వివిధ నగరాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌కు మద్దతు పెరుగుతున్నది. దూరాభారం కారణంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి సుప్రీంకోర్టులో అప్పీళ్లు తక్కువగా నమోదవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాది ప్రాంతాలవారికి అనుకూలంగా ఉండేలా ఇక్కడ సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటుచేయాలనే డిమాండ్ రోజురోజుకూ ఊపందుకుంటున్నది. ఈ డిమాండ్‌కు తాజాగా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మద్దతు తెలుపడంతోపాటు న్యాయవ్యవస్థపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాసిన 'లిజనింగ్, లెర్నింగ్ అండ్ లీడింగ్' పుస్తకాన్ని ఇటీవల చెన్నైలో ఆవిష్కరిస్తూ.. సుప్రీంకోర్టుకు రీజనల్ బెంచ్‌లు ఉండాలని పేర్కొన్నారు. కనీసం నాలుగు పెద్దనగరాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటుచేసేందుకు ఇదే సరైన సమయమని, వీటిలో ఒక బెంచ్‌ను దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పాటుచేయాలని అన్నారు. భారీగా పేరుకుపోయిన పెండింగ్ కేసులను తగ్గించేందుకు ఇదే పరిష్కార మార్గమని తెలిపారు. వివిధ రీజియన్లలో ప్రత్యేకంగా సుప్రీంకోర్టు బెంచ్‌లు ఉండాలన్న లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులకు వెంకయ్యనాయుడు మద్దతు తెలిపారు. ఎన్నికల పిటిషన్లు, క్రిమినల్ కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. చట్టసభ సభ్యుల కాలపరిమితి ముగిసేవరకు ఎన్నికల కేసులు తేలడంలేదని, దీనివల్ల పార్టీ ఫిరాయింపుల చట్టం అసలు ఉద్దేశాలు నెరవేరడం లేదని అన్నారు. సుప్రీంకోర్టులో దాదాపు 60వేల కేసులు, హైకోర్టుల్లో 44 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని తగ్గించాల్సిన అవసరం ఉన్నదని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు.

అప్పీళ్లకు, రాజ్యాంగ కేసులకు వేర్వేరు డివిజన్లు

సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. మరో కీలక ప్రతిపాదన కూడా చేశారు. సుప్రీంకోర్టులో రెండు డివిజన్లు ఉండాలని, రాజ్యాంగపరమైన కేసుల పరిష్కారానికి, అప్పీళ్ల పరిష్కారానికి వేర్వేరు డివిజన్లు అవసరమని తెలిపారు.

నేషనల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్

అమెరికా న్యాయవ్యవస్థలో అప్పీల్ కోర్టులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. రాజ్యాంగపరమైన అంశాల్లో తప్ప అప్పీళ్ల విషయంలో అక్కడి సుప్రీంకోర్టు జోక్యం చాలా తక్కువగా ఉంటుంది. ఇదే తరహాలో దేశంలోని హైకోర్టుల తీర్పులపై దాఖలయ్యే అప్పీళ్లను పరిష్కరించేందుకు నేషనల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌ను ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఉన్నది. చెన్నైకి చెందిన వీ వసంత్‌కుమార్ అనే న్యాయవాది నేషనల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌ను దేశంలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని గతంలో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. సుప్రీంకోర్టు కేవలం రాజ్యాంగపరమైన వివాదాలను మాత్రమే విచారణకు చేపట్టాలని కోరారు. 2016లో అప్పటి సీజేఐ టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీచేసింది. ఈ వాదనను అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ వ్యతిరేకించగా.. అప్పుడు అమికస్ క్యూరీగా నియమితులైన ప్రస్తుత అటర్నీ జనరల్ కేకే వేణుగోపాల్ నేషనల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఏర్పాటును సమర్థించారు.

సుప్రీం బెంచ్‌కు హైదరాబాద్ సరైన నగరం

దక్షిణాది రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని టీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఇటీవల కేంద్ర న్యాయశాఖ మంత్రికి లేఖరాశారు. సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటుకు హైదరాబాద్ సరైన నగరమని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టులో దాఖలవుతున్న అప్పీళ్లతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల నుంచి దాఖలయ్యే అప్పీళ్లు చాలా తక్కువ శాతం ఉంటున్నాయని గణాంకాలతోసహా వివరించారు. దూరం, భారీ వ్యయం కారణంగా దక్షిణాది కక్షిదారులు ఢిల్లీకి రాలేకపోతున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

పెరుగనున్న వానకాలం వరిసాగు

సాధారణ సాగు 24.11 లక్షల ఎకరాలు.. ప్రస్తుతం 7.90 లక్షల ఎకరాల్లో నాట్లు

- వారంలో మరింత పుంజుకోనున్న నాట్లు
- రాష్ట్రంలో 70 శాతానికి చేరిన పంటల సాగు
- సాగు పెరిగినా రుణాలకు సహకరించని బ్యాంకర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటం, జలాశయాలు నిండుకుండలను తలపిస్తుండటం, పంటకాల్వలకు ప్రభుత్వం నీటిని విడుదలచేయడం వల్ల వానకాలం వరిసాగు భారీగా పెరుగనున్నది. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు తాజా నీటిని విడుదలచేయడంతో నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులు వరినాట్లు వేయడానికి దుక్కులు సిద్ధంచేస్తున్నారు. వానకాలం రాష్ట్రంలో 24.11 లక్షల ఎకరాల్లో వరి సాగును చేయాల్సిఉండగా.. ఇప్పటివరకు 7.90 లక్షల విస్తీర్ణంలో (33 శాతం) నాట్లు పూర్తయ్యాయి. సాగునీటి విడుదలతో వచ్చేవారంరోజుల్లో పూర్తిస్థాయి విస్తీర్ణంలో వరినాట్లు పడుతాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 75.81 లక్షల (70 శాతం) ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి 41.96 లక్షల ఎకరాలు (97 శాతం), సాగైంది. మక్కజొన్న సాధారణ సాగువిస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 8.26 లక్షల (66 శాతం ఎకరాలు), పప్పుధాన్యాల సాగువిస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా, 8.11 లక్షల ఎకరాలు (78 శాతం) సాగయింది. ఇందులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 7.20 లక్షల ఎకరాలు కాగా 6.19 లక్షల (85 శాతం) ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ సాధారణ సాగులో 80 శాతం వేశారు.

పంట రుణ లక్ష్యం రూ.29 వేల కోట్లు.. ఇచ్చింది రూ.10 వేల కోట్లే

సాగు పనులు ముమ్మరం అయినా బ్యాంకులు రైతులకు రుణాలివ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. వానకాలం పంట రుణలక్ష్యంలో దాదాపు 34 శాతానికే పరిమితమయ్యాయి. వానకాలం పంటల రుణ లక్ష్యం రూ.29 వేల కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.10 వేల కోట్లకే పరిమితమైందని వ్యవసాయశాఖ వెల్లడించింది. బ్యాంకులు రుణాలివ్వకపోవడంతో ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు పెట్టుబడి సాయాన్ని

రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉపయోగించుకున్నారు. వాననాలంలో దాదాపు 50 లక్షల మందికిపైగా రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా, 40 లక్షల మందికి రూ.4,400 కోట్లు విడుదల చేసినట్టు వ్యవసాయశాఖ వెల్లడించింది.

ఆ విధానాన్ని మనం అమలుచేయలేమా?

గణేశ నిమజ్జనంపై అహ్మదాబాద్ విధానాన్ని అధ్యయనం చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్‌కు కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణేశ నిమజ్జనం సందర్భంగా నీరు కాలుష్యం కాకుండా చూసేందుకు అహ్మదాబాద్ (గుజరాత్)లో అనుసరిస్తున్న విధానాన్ని హైదరాబాద్‌లో అనుసరించడంపై అధ్యయనం చేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్‌కు సూచించారు. అహ్మదాబాద్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాలను సబర్మతి నదిలో వేయకుండా ఒడ్డునే వదిలివేళ్లేలా అక్కడి ప్రజల్లో చైతన్యం తీసుకురాగలిగారు. ఇదే విధానాన్ని మనం హైదరాబాద్‌లో ఎందుకు అమలుచేయలేమని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఐసెట్ కౌన్సెలింగ్ రెండ్రోజులు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో సీట్ల భర్తీకోసం నిర్వహిస్తున్న ఐసెట్-2019 కౌన్సెలింగ్ ప్రక్రియను రెండ్రోజులు పొడిగించారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ సోమవారంతో ముగియాల్సి ఉన్నది. అయితే కొన్ని యూనివర్సిటీల్లో డిగ్రీ తుది సెమిస్టర్ ఫలితాలు విడుదల ఆలస్యమయింది. ఈ ఫలితాలు మంగళవారం విడుదలయ్యే అవకాశం ఉన్నందున అందులో ఉత్తీర్ణులైన వారికి కూడా ఐసెట్ కౌన్సెలింగ్‌లో చోటు కల్పించేందుకు గడువును పొడిగించాల్సి వచ్చింది. దీంతో సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 14 వరకు కొనసాగుతుందని అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. సీట్ల కేటాయింపు ప్రక్రియను ఈ నెల 14 నుంచి 16 వరకు వాయిదా వేశామని, ఈ తేదీలకు అనుగుణంగా విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 277 ఎంబీఏ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద 21,901 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఐసెట్ కౌన్సెలింగ్ క్యాంపు ఆఫీసర్ బీ శ్రీనివాస్ తెలిపారు. అలాగే 34 ఎంసీఏ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద 1,787 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

అత్తి వరదరాజస్వామిని దర్శించుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యులు

అత్తి వరదరాజస్వామిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం కంచి అత్తివరదరాజస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు అల్లోలకు స్వాగతం పలికారు. సతీమణి విజయలక్ష్మితో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మంత్రి కుటుంబసభ్యులను వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రివెంట ఆయన కుమారుడు గౌతంరెడ్డి, కోడలు దివ్యారెడ్డి ఉన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.40 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం త్రయోదశి మధ్యాహ్నం 1.49 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఉత్తరాషాఢ, అమృతఘడియలు: రాత్రి 10.17 నుంచి 11.53 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.05 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.27 నుంచి 3.18 వరకు, వర్జ్యం: ఉదయం 11.42 నుంచి మధ్యాహ్నం 1.18 వరకు.

లోకం పోకడ

చంద్రయానం.. నిదానం

చంద్రయాన్-2 ప్రయాణ కాలం 49 రోజులు ■ రాకెట్ సామర్థ్యం, మార్గం, వ్యయమే వ్యత్యాసం

నాడు నాలుగు రోజుల్లో చంద్రుడి వద్దకు చేరిన నాసా అపోలో-11

న్యూఢిల్లీ, ఆగస్టు 12: అంతరిక్ష రంగంలో భారత కీర్తిని మరో మెట్టు ఎక్కించిన ప్రయోగం చంద్రయాన్-2. ప్రపంచం అబ్బురపడేలా తక్కువ ఖర్చుతో, అత్యాధునిక సాంకేతికతతో తయారైన ఈ వ్యోమనౌక.. నిర్దేశిత మార్గంలో చంద్రుడివైపు వడివడిగా పరుగులు పెడుతున్నది. ప్రస్తుతం భూమికి దాదాపు లక్ష కి.మీ. దూరంలో ఉన్న కక్ష్యలో తిరుగుతున్నది. మొత్తంగా 48 రోజులు ప్రయాణించిన అనంతరం చంద్రయాన్-2 జాబిల్లి మీదికి చేరుతుంది. అయితే.. 'గతంలో అమెరికా, రష్యా చంద్రుడి మీదికి వ్యోమనౌకలను, మానవ సహిత అంతరిక్ష యాత్రలను చేపట్టినప్పుడు నాలుగైదు రోజుల్లోనే అక్కడికి చేరుకున్నాయి. చంద్రయాన్-2కు మాత్రం 48 రోజులు ఎందుకు పడుతున్నది?'.. చాలా మందిలో మెదులుతున్న ప్రశ్న ఇది. దీనికి సవివర సమాధానమే ఈ కథనం.

4 నాలుగు రోజుల్లోనే..

భూమికి, చంద్రుడికి మధ్యదూరం దాదాపు 3.8 లక్షల కి.మీ. 50 ఏండ్ల కిందట మనిషి తొలిసారిగా జాబిల్లి మీద అడుగుపెట్టిన అపోలో-11 మిషన్ భూమి నుంచి బయలుదేరి చంద్రుడి మీద దిగడానికి పట్టిన సమయం నాలుగు రోజుల ఆరు గంటల 45 నిమిషాలు. అంతకుముందు రష్యా పంపిన లూనా-2 అనే వ్యోమనౌక కేవలం 34 గంటల్లో చంద్రుడి మీద ల్యాండ్ అయ్యింది. చంద్రయాన్-2 మాత్రం 48 రోజులపాటు ప్రయాణించనున్నది. ఇందుకు ప్రధాన కారణాలు.. రాకెట్ సామర్థ్యం, మార్గం, ప్రాజెక్టు వ్యయం.

అపోలో-11

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) తన అపోలో-11 మిషన్ కోసం సాట్రన్-5 అనే రాకెట్‌ను వినియోగించింది. దీని ఎత్తు 110 మీటర్లు. ఇది గంటకు 39వేల కి.మీ. వేగంతో వెళ్లగలదు. ఇది 43 టన్నుల పేలోడ్‌ను మోసుకొని వెళ్లగలదు. దీంతో ఇందులో భారీ వ్యోమనౌకతోపాటు వ్యోమగాములను చంద్రుడి మీదికి పంపవచ్చు.

రాకెట్ సామర్థ్యం

చంద్రయాన్-2

చంద్రయాన్-2ను అంతరిక్షంలోకి పంపేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్‌ను వినియోగించింది. దీని ఎత్తు 43.43 మీటర్లు. ఇది గరిష్ఠంగా నాలుగు టన్నుల పేలోడ్స్‌ను మాత్రమే మోసుకొని వెళ్లగలదు.

మార్గం

అపోలో-11



సాట్రన్-5 రాకెట్ భూమి నుంచి బయలుదేరిన తర్వాత 11 నిమిషాలకు భూ స్థిర కక్ష్యలోకి చేరుకున్నది. అక్కడ ఒకసారి భూమి చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం నేరుగా చంద్రుడి వైపు ప్రయాణించింది. రాకెట్‌లోని శక్తమంతమైన ఇంజిన్ల వల్ల భూమి ఆకర్షణ శక్తికి వ్యతిరేకంగా ప్రయాణించి చంద్రుడి సమీపానికి చేరింది. మూడో దశలో అపోలో-11 వ్యోమనౌకను చంద్రుడి స్థిర కక్ష్యలో వదిలింది. అక్కడ రెండు ప్రదక్షిణలు చేసిన అనంతరం చంద్రుడి మీద దిగింది. ఇలా నేరుగా వెళ్లడం వల్ల నాలుగు రోజుల్లోనే 3.8 లక్షల కి.మీ.లు ప్రయాణించగలిగింది. అదే సమయంలో భారీగా ఇంధనం ఖర్చయింది.



చంద్రయాన్-2

చంద్రుడి వరకు చేరే మార్గాన్ని నిర్దేశించే క్రమంలో ఇస్రో శాస్త్రవేత్తలు భూమ్యాకర్షణ శక్తి, చంద్రుడి ఆకర్షణ శక్తిని వినియోగించుకున్నారు. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ చంద్రయాన్-2ను భూ స్థిర కక్ష్యవరకు మాత్రమే చేర్చింది. అక్కడ వ్యోమనౌక భూమ్యాకర్షణ శక్తికి లోబడి కక్ష్యలో భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇలా తిరుగుతున్న సమయంలో ఒక్కసారిగా ఇంజిన్లను మండించడం ద్వారా వ్యోమనౌకను తరువాతి కక్ష్యలోకి చేరుస్తారు. ఇలా 22 రోజుల్లో ఐదుసార్లు కక్ష్యను పెంచుతారు. ఆగస్ట్ 14న వ్యోమనౌక భూకక్ష్య నుంచి తప్పించుకొని చంద్రుడి వైపు వెళ్తుంది. ఆరురోజులు ప్రయాణించి చంద్రుడి కక్ష్యలోకి చేరుతుంది. అక్కడ 13 రోజులపాటు వివిధ కక్ష్యల్లో తిరుగుతూ సెప్టెంబర్ 7న చంద్రుడి దగ్గరికి చేరుతుంది. ఈ క్రమంలో జాబిల్లికి క్రమంగా చేరువవుతుంది.

సొమ్ము వ్యయం

అపోలో-11: నాసా ఒక్కో అపోలో మిషన్‌కు సగటున అప్పట్లో 185 మిలియన్ డాలర్లు వ్యయం చేసినట్టు అంచనా. ఇది 2016లో కరెన్సీ విలువతో పోల్చితే 1.2 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం మన కరెన్సీలో దాదాపు రూ.8,500 కోట్లు. ఈ మొత్తంలో సాట్రన్-5 రాకెట్ నిర్మాణానికి నాసా సుమారు అప్పట్లో 110 మిలియన్ డార్లు (2016 కరెన్సీ విలువతో పోల్చితే 690 మి.డా) వ్యయం చేసింది. మన కరెన్సీలో ఈ విలువ దాదాపు.. రూ.4,900 కోట్లు. అంటే సగానికి పైగా రాకెట్ కోసమే వెచ్చించింది. మిగతా మొత్తాన్ని మాడ్యూల్స్ నిర్మాణం, వ్యోమగాముల శిక్షణ తదితర అవసరాల కోసం వ్యయం చేసింది.

చంద్రయాన్-2: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్ మొత్తం వ్యయం కేవలం రూ.970 కోట్లు. లేదా 138 మిలియన్ డాలర్లు. అంటే అపోలో మిషన్‌కు చేసిన వ్యయంతో పోల్చితే కేవలం 11 శాతం. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ కోసం ఇస్రో చేసిన వ్యయం రూ.375 కోట్లు. లేదా 52 మిలియన్ డాలర్లు. సాట్రన్-5 రాకెట్ వ్యయంతో పోల్చితే ఇది 0.7 శాతం మాత్రమే.

కృష్ణానది వరదలపై సీఎం కేసీఆర్ ఆరా

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ఫోన్‌లో సంభాషణ
- ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశం

నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కృష్ణా నది వరదనీటి తీవ్రతపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేకంగా ఆరాతీశారు. నాలుగైదు రోజుల నుంచి కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నారాయణపేట జిల్లాలోని కృష్ణ, మాగనూరు, మక్తల్ మండలాల్లో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురికావడంతోపాటు వేలఎకరాల్లో పంటపొలాలు నీట మునిగిన ఘటనలు మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. దీంతో సోమవారం ఉదయం సీఎం కేసీఆర్ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడి, వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతులు కల్పించాలని మంత్రిని ఆదేశించారు. భవిష్యత్తులో వరదలు సంభవించినప్పుడు గ్రామాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారాలకు ప్రతిపాదనలను సిద్ధంచేయాలని సూచించారు. వెంటనే ముంపు గ్రామాల్లో పర్యటించాలని సీఎం ఆదేశించడంతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం వరద తాకిడికి గురైన మండలాల్లో పర్యటించి, అధికారులు, స్థానికులతో పరిస్థితిని అంచనావేశారు.

అనంతగిరి ఇకపై 'అన్నపూర్ణ'

- రంగనాయకసాగర్‌తోపాటు రెండు రిజర్వాయర్లకు పాతపేర్లు కొనసాగింపు
- తొలి ఐదు నిర్మాణాలకు ఇప్పటికే ఖరారైన పేర్లు
- సీఎం కేసీఆర్ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లకు దేవతామూర్తుల పేర్లు ఖరారయ్యాయి. ఇప్పటికే పలు రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లకు దేవతల పేర్లుపెట్టిన సీఎం కేసీఆర్.. అనంతగిరి రిజర్వాయర్ పేరును కూడా మార్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అనంతగిరి రిజర్వాయర్, పంప్ హౌస్‌లకు అన్నపూర్ణ పేరును సీఎం కేసీఆర్ నిర్ణయించారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు అవే పేర్లను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే మొదటి ఐదు నిర్మాణాలకు పేర్లను ఖరారుచేసిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బరాజ్‌కు లక్ష్మీ బరాజ్‌గా, కన్నెపల్లి పంప్‌హౌస్‌కు లక్ష్మీ పంప్‌హౌస్‌గా నామకరణం చేశారు. అన్నారం బరాజ్‌కు సరస్వతి బరాజ్‌గా, సిరిపురం పంప్‌హౌస్‌కు సరస్వతి పంప్‌హౌస్‌గా, సుందిల్ల బరాజ్‌కు పార్వతి బరాజ్‌గా, గోలివాడ పంప్‌హౌస్‌కు పార్వతి పంప్‌హౌస్‌గా, నందిమేడారం రిజర్వాయర్, పంప్‌హౌస్‌కు నంది రిజర్వాయర్‌గా, లక్ష్మీపురం పంప్‌హౌస్‌కు గాయత్రి పంప్‌హౌస్‌గా నామకరణంచేశారు. ఇకనుంచి ఈ రిజర్వాయర్లన్నీ కొత్తపేర్లతోనే వాడుకలోకి వస్తాయి.

సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి దుంకుతున్న కృష్ణమ్మ

సోమవారం ఉదయం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో పాలపొంగులాంటి సుందర జల దృశ్యాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులు

అనుభవం నేర్పిన పాఠం

- శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లోతో జనం మదిలో 2009 పరిణామాలు
- సీడబ్ల్యూసీ సూచనలతో శ్రీశైలంలో సాఫీగా వరద నియంత్రణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెప్టెంబర్ 2009.. కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉరకలేసింది. శ్రీశైలం జలాశయానికి వరద లక్షల క్యూసెక్కులో పోటెత్తింది. కానీ, అప్పటి అధికారులో, నాటి సర్కారో, కారకులెవరైనా కేంద్ర జల సంఘం హెచ్చరికలను సైతం పెడచెవినపెట్టి శ్రీశైలం జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపిన తర్వాతే దిగువకు నీటిని విడుదలచేస్తామంటూ భీష్మించుకుకూర్చున్నారు. అంతే! ఎగువనుంచి ఏకంగా పది లక్షలు.. 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ముంచెత్తడంతో జలాశయం గరిష్ఠ నీటిమట్టాన్ని దాటింది. ఫలితంగా కర్నూలు పట్టణం పెను ప్రమాదంలో పడింది. అదృష్ట వశాత్తు ఎగువనుంచి వరద కాస్త తగ్గుముఖం పట్టడం, జలాశయం నుంచి పెద్దఎత్తున నీటిని దిగువకు వదలడంతో ముప్పుతప్పింది. నాటి అనుభవం పాఠాలు నేర్పింది. అందుకే ఇప్పుడు శ్రీశైలం జలాశయంలో వరద నీటి నిర్వహణ సాఫీగా సాగుతున్నది. గత తప్పిదాన్ని పునరావృతం చేయకుండా ప్రాజెక్టు అధికారులు ముందునుంచే సీడబ్ల్యూసీ సూచనలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు ఎగువ వరదను అంచనావేస్తూ జలాశయ నీటిమట్టం, అవుట్‌ఫ్లోను నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎగువనుంచి భారీ వరద వస్తున్నా ప్రతికూల పరిణామాలకు ఆస్కారం లేకుండా ఉన్నది.

ఆ సమీక్షకు అనుగుణంగానే

శ్రీశైలం విషయంలో 2009 జరిగిన పరిణామాల తర్వాత ఉన్నతస్థాయి నిపుణులు డ్యాం భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఎగువనుంచి భారీ వరద (20 లక్షల క్యూసెక్కులను ప్రామాణికంగా తీసుకొని) వస్తే ఏం చేయాలనే దానిపై సూచనలుచేశారు. 24 గంటల ముందే జలాశయానికి భారీ వరద వస్తుందనే సమాచారం ఉన్నట్లయితే వెంటనే జలాశయంలో నీటిమట్టాన్ని 876.60 అడుగుల వరకు తగ్గించాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు డిజైన్‌లో పూర్తిస్థాయి నిల్వ (ఎఫ్ఆర్ఎల్) 892 అడుగులుగా రూపొందించారు. డ్యాం పైభాగం(టాప్) స్థాయి 904 అడుగులుగా ఉంటుంది. 892 ఎఫ్ఆర్ఎల్‌లో కర్నూలు నగరం ముంపునకు గురికానుందని గుర్తించి.. శ్రీశైలం ఎఫ్ఆర్ఎల్‌ను 885 అడుగులకు కుదించారు. డ్యాంకు ఏర్పాటుచేసిన 12 రేడియల్ గేట్లను గరిష్ఠంగా 19 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జితో డిజైన్‌చేశారు. ఆధునీకరణ తర్వాత 13,55,680 క్యూసెక్కులుగా డిజైన్‌చేశారు. ఇందులో 2-11 అంటే పది గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా నీటిని వదలాల్సి ఉంటుంది. రెండు చివరల్లో ఉన్న 1-12 గేట్లను మాత్రం కేవలం అత్యవసర సమయాల్లోనే వినియోగించాల్సి ఉంటుంది. వీటి వినియోగం వల్ల డ్యాంకు రెండువైపులా ఉన్న నిర్మాణం (ఫ్లాంక్స్) కోతకు గురవుతాయి. 2009 వరకు ప్రాజెక్టు చరిత్రలో వీటినెప్పుడూ వినియోగించలేదని నిపుణుల కమిటీ నివేదికలో ఉన్నది. 2009, సెప్టెంబర్ నాలుగో తేదీన మధ్యాహ్నం 12.30 గంటలనుంచి ఒంటి గంట మధ్య శ్రీశైలం నీటిమట్టం 896.2 అడుగులుగా నమోదైంది. జలాశయం నుంచి ఏకంగా 14.80 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడం ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డు. పోతిరెడ్డిపాడు ద్వారా డిశ్చార్జి 1.10 లక్షల క్యూసెక్కులుగా ఉందని అధికారిక రికార్డుల్లోనే నమోదు చేశారని అధికారి ఒకరు తెలిపారు. ఫలితంగానే కర్నూలు నగరంపై వరద పడగ విప్పింది. అదృష్టవశాత్తు పెను ముప్పు సంభవించనప్పటికీ ప్రాజెక్టు చరిత్రలో అదో చేదు అనుభవమని అధికారులు చెప్తున్నారు. ఈస్థాయి పరిణామాల్లోనూ డ్యాంకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడం పటిష్ట నిర్మాణానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

సాగర్ 26 గేట్లు ఎత్తివేత

శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లోలు నమోదవుతుండటంతో సాగర్ ప్రాజెక్టు అధికారులు జలాశయం పూర్తిస్థాయి నిల్వకు చేరుకోక ముందే గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా దిగువకు నీటిని వదలడం ప్రారంభించారు. జలాశయ నీటిమట్టం 559 అడుగుల స్థాయిలోనే సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రాజెక్టులోని 12వ గేటును ఎత్తి నీటి విడుదల మొదలుపెట్టిన అధికారులు.. తర్వాత వరుసగా 13, 14, 15 గేట్లను ఎత్తారు. మధ్యాహ్నం సమయానికి మొత్తం 26 గేట్లను ఎత్తి 3.94 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు విడుదలచేశారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 568.20 అడుగులస్థాయిలో (పూర్తిస్థాయి 590 అడుగులు).. నీటినిల్వ 252.06 టీఎంసీలుగా (పూర్తిస్థాయి 312.05 టీఎంసీలు) ఉన్నది. ప్రాజెక్టు జలవిద్యుత్ ఉత్పాదక కేంద్రంలోని ఎనిమిది టర్బైన్ల ద్వారా 375 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తున్నారు. సాగర్ గేట్లు ఎత్తడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వారాంతపు సెలవుతో పాటు బక్రీద్ కూడా రావడంతో పెద్దఎత్తున పర్యాటకులు సాగర్‌ను సందర్శించారు. సాగర్‌ను చూసేందుకు వచ్చిన సందర్శకుల్లో ఒకరు స్నానానికి దిగి వరద ప్రవాహానికి నదిలో గల్లంతయ్యారు.

కృష్ణమ్మ జలజాతర

మొదటిపేజీ తరువాయి...

సముద్రంలో కలువడం సాధారణం. కానీ కృష్ణాజలాలు అన్ని ప్రాజెక్టులను నింపి భారీ స్థాయిలో సముద్రం ఒడికి చేరడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

బేసిన్‌లో స్థిరంగా కొనసాగుతున్న వరద

కృష్ణాబేసిన్‌లో ఎగువనుంచి వరద స్థిరంగా కొనసాగుతున్నది. నిన్నటిదాకా ఆల్మట్టి జలాశయానికి వరద మోతాదు పెరుగుతూనే ఉండగా.. సోమవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 6.41 లక్షల నుంచి 5.70 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో కర్ణాటక అధికారులు ఆల్మట్టి జలాశయంలో నీటినిల్వను 97 టీఎంసీల నుంచి 106 టీఎంసీల వరకు పెంచి.. అవుట్‌ఫ్లోను నియంత్రించారు. సోమవారం సాయంత్రం ఆల్మట్టి వద్ద అవుట్‌ఫ్లో 5.40 లక్షలుగా నమోదైంది. దిగువన నారాయణపుర జలాశయానికి సోమవారం 5.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగింది. ఈ క్రమంలో అవుట్‌ఫ్లోను కూడా అదేస్థాయిలో నిర్వహిస్తున్నారు. ఉజ్జయిని నుంచి లక్ష క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్న దరిమిలా భీమా ద్వారా వచ్చే వరద కలిసి జూరాలకు వస్తున్న వరద ఎనిమిది లక్షల పైచిలుకు కొనసాగుతుండగా అవుట్‌ఫ్లో కూడా అదేస్థాయిలో ఉన్నది. జూరాల 62 గేట్లు ఎత్తి సుమారు ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భీమా నది నుంచి వస్తున్న వరదను దృష్టిలో ఉంచుకొని వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. నారాయణపుర నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో ప్రభావం మంగళవారం రాత్రి నుంచి కనిపించే అవకాశమున్నది. ఒక వేళ ఎగువ నుంచి ఆల్మట్టికి వరద పెరిగితే జూరాల ఇన్‌ఫ్లోలో తేడా ఉండకపోవచ్చు.

శ్రీశైలానికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం

జూరాల నుంచి గత రెండురోజులుగా ఎనిమిది లక్షల పైచిలుకు అవుట్‌ఫ్లో ఉండటంతో శ్రీశైలం జలాశయానికి సోమవారం మధ్యాహ్నం వరకు ఎనిమిది లక్షల క్యూసెక్కులలోపు ఉన్న ఇన్‌ఫ్లో రాత్రయ్యేసరికి పది లక్షలకు పైగా పెరిగింది. తుంగభద్ర నుంచి మూడురోజుల కిందట విడుదలైన వరద.. సోమవారం రాత్రి శ్రీశైలం చేరుకోవడంతో జలాశయానికి ఇన్‌ఫ్లో ఏకంగా 10,29,861 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలానికి మంగళవారం వరద పరిమాణం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు జలాశయం నీటిమట్టాన్ని తగ్గించి.. వరదను నియంత్రిస్తున్నారు. పది గేట్ల ద్వారా సుమారు ఎనిమిదిన్నర లక్షల పైచిలుకు క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. దీంతో నాగార్జునసాగర్‌కు సోమవారం సాయంత్రానికి 7.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. మంగళవారం ఇది ఎనిమిదిన్నర లక్షల వరకు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

సంగమించిన తుంగభద్ర

కృష్ణా, తుంగభద్ర సంగమమయ్యాయి. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో సుంకేశుల బరాజ్ నుంచి వదిలిన 2లక్షల క్యూసెక్కుల వరద అలంపూర్ సమీపంలోని శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో కలువడంతో రెండు నదుల సంగమం జరిగింది. రెండింటి కలయికతో పెద్దఎత్తున వరదరావడంతో శ్రీశైలం ప్రాజెక్టు మహాసాగరాన్ని తలపిస్తున్నది. రెండు నదుల పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అధికారులు ఇప్పటికే అప్రమత్తంచేశారు. ఇప్పటికే పలుగ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల అధికార యంత్రాంగం వరద పరిస్థితిపై 24 గంటలపాటు అప్రమత్తంగా పనిచేస్తున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకొన్న స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న కృష్ణానదిలో ప్రయాణించి గ్రామానికి చేరుకొన్నారు. గ్రామస్తులకు ధైర్యం చెప్పి.. భరోసా కల్పించారు. తుంగభద్ర డ్యాంకు 2.51 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 25 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 1.15 లక్షల క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. సుంకేశులకు పదినెలల తర్వాత భారీగా వరదనీరు వచ్చిచేరింది. దీంతో సుంకేశుల ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి 2.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేశారు.

కొనసాగుతున్న కరంట్ ఉత్పత్తి

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 6 యూనిట్లలో 900 మెగావాట్ల కరంట్ ఉత్పత్తి చేస్తూ 38,140 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. ఇక ఏపీ పరిధిలోని కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా కరంట్ ఉత్పత్తికి 28,956 క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. వరద ఉధృతి పెరిగిన తర్వాత జూరాలలో సాంకేతిక కారణాలతో కరంట్ ఉత్పత్తిని ఆపేశారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగాపర్యాటకుల రాక

వరుసగా మూడోరోజు సెలవుదినం కావడంతో సోమవారం సైతం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద సందర్శకులు సందడిచేశారు. 42 అడుగుల మేర గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పొంగి పొర్లుతూ సాగర్ దిశగా వెళ్లే సుందర దృశ్యం చూసేందుకు పర్యాటకులు ఎంతో ఉత్సాహం చూపించారు. ఇటు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి సైతం పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. వేలాదిగా వస్తున్న వాహనాలను అదుపుచేయడం వారికి తలకు మించిన భారం అవుతున్నది. సింగిల్ రోడ్డుపై ఒకేసారి రెండు మూడు వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోతున్నది.

పులిచింతల నుంచి నీటి విడుదల

సాగర్‌నుంచి భారీఎత్తున దిగువకు వరద వస్తుండటంతో పులిచింతలలోనూ ముందుజాగ్రత్తచర్యగా కొంతనీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం గణనీయంగా పెరుగుతుండటంతో పులిచింతల నాలుగు గేట్ల ద్వారా దిగువకు 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ జలాలు ప్రకాశం బరాజ్‌కు చేరుకుంటున్నాయి. ప్రకాశం బరాజ్‌లో ఇప్పటికే 2.58 టీఎంసీల (పూర్తిస్థాయి నీటిమట్టం 3.07 టీఎంసీలు) నీటిమట్టం ఉన్నది. పులిచింతల నుంచి భారీగా వరద వచ్చే అవకాశం ఉండటంతో ముందుగానే పదివేల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బరాజ్‌నుంచి కిందకు వదులుతున్నారు.

వివిధ ప్రాజెక్టులలో సోమవారం నీటి మట్టాల వివరాలు

రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1700.62	129.72	106.98	5,70,000	5,40,000
నారాయణపుర	1615.00	1605.68	37.64	26.83	5,90,000	5,99,000
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	67,964	1,05,950
జూరాల	1045.00	1038.12	9.66	5.82	8,15,000	8,16,957
తుంగభద్ర	1633.00	1629.92	100.86	89.43	2,44,003	1,15,133
శ్రీశైలం	885.00	878.20	215.81	179.13	10,22,901	8,46,796
నాగార్జునసాగర్	590.00	568.20	312.05	252.06	8,12,650	3,94,428
సింగూరు	1717.93	1670.51	29.91	0.46	-	20
నిజాంసాగర్	1405.00	1368.34	17.80	0.14	-	10
శ్రీరాంసాగర్	1091.00	1062.30	90.31	16.35	2,960	389
లోయర్‌మానేరు	920.00	881.90	24.07	3.53	-	204
మిడ్ మానేరు	1043.31	993.60	25.873	3.55	-	83
కడెం	700.00	696.87	7.60	6.18	4,054	5,764
ఎల్లంపల్లి	485.56	484.81	20.18	19.54	5,570	5,570

శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దుంకుతున్న నీటి ప్రవాహాన్ని వీక్షించేందుకు సందర్శకులు పెద్దసంఖ్యలో వస్తుండటంతో ట్రా'ఫికర్' మొదలైంది. హైదరాబాద్ నుంచి నాలుగు గంటల ప్రయాణానికి 10-12 గంటలు పడుతున్నది. 80 కిలోమీటర్ల ముందున్న మున్ననూర్ అటవీప్రాంతం నుంచి పూర్తిగా వాహనాలు నిలిచిపోవడం 56 ఏండ్ల డ్యాం చరిత్రలో ఇదే తొలిసారి. రెండ్రోజులల్లో మూడు లక్షలకుపైగా సందర్శకులు శ్రీశైల క్షేత్రాన్ని దర్శించారు. శ్రీశైలం సిద్ధరామప్ప కాంప్లెక్స్ వద్ద సోమవారం సాయంత్రం వాహన రద్దీ ఏరియల్ వ్యూ దృశ్యం ఇదీ.

..బాహుబలి ప్రారంభం!

మొదటిపేజీ తరువాయి...

విజయవంతంగా నిర్వహించారు. మూడువేల క్యూసెక్కుల గోదావరి జలాలు గ్రావిటీ కాల్వ నుంచి మిడ్‌మానేరుకు పరుగులు తీశాయి. సోమవారం మధ్యాహ్నం ఐదో మోటర్‌ను 45 నిమిషాలపాటు ఇంజినీర్లు నడిపారు. 89.73 క్యూమెక్స్‌ల వేగంతో 85,54,589 ఘనపుటడుగుల నీటిని డెలివరీ సిస్టర్న్ ద్వారా కాల్వలోకి వదిలారు. లిఫ్ట్ అడ్వైజర్ పెంటారెడ్డి స్విచ్చాన్‌చేసి ప్రారంభించగా.. 5.7 కిలోమీటర్ల దూరంలో ఉన్న (శ్రీరాముల సమీపంలోని) వరదకాల్వ జంక్షన్ పాయింట్‌వద్ద నీటి ప్రవాహాన్ని ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీధర్ పరిశీలించారు. ఆ వెంటే నాలుగో మోటర్ వెట్‌రన్‌కు చర్యలు ప్రారంభించారు. రాత్రి 9.17 గంటలకు నాలుగో మోటర్‌ను ప్రారంభించి 11.27 గంటలవరకు నడిపించారు. ఆ మోటర్ 214 ఆర్పీఎంకు చేరుకొని 3150 క్యూసెక్కుల నీటిని 115 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్‌చేసింది. నంది (నందిమేడారం) రిజర్వాయర్ నుంచి దఫదఫాలుగా గాయత్రి పంప్‌హౌస్‌కు నీటివిడుదల కొనసాగుతున్నది. సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడుతలుగా నీటిని విడుదలచేసినట్లు ఏఈఈ పరుశురాంగౌడ్ తెలిపారు.

నాలుగో మోటర్ వెట్‌రన్‌ను వీక్షించిన సీఎం

నాలుగో మోటర్ వెట్ ట్రయల్ రన్ ప్రక్రియను ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ నుంచి సీసీ కెమెరాల ద్వారా వీక్షించారు. లిఫ్ట్ అడ్వయిజర్, ఈఎన్సీలకు అభినందనలు తెలిపి, నాలుగో మోటర్ ద్వారా వచ్చే నీటిని మధ్యమానేరుకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. ట్రయల్ రన్ సక్సెస్ కావడంతో డీఈ గోపాలకృష్ణ, ఏఈఈలు శ్రీనివాస్, సురేశ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, ప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు.

లక్ష్మి పంప్‌హౌస్‌లో మోటర్ల పునఃప్రారంభానికి చర్యలు

మరోవైపు సరస్వతి (అన్నారం) బరాజ్‌కు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఆదివారం పది గేట్లు వదిలి దిగువకు నీళ్లు వదిలిన అధికారులు సోమవారం అన్ని గేట్లను మూసివేశారు. బరాజ్‌లో సోమవారం 6.82 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని ఇంజినీర్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గడంతో లక్ష్మి పంప్‌హౌస్ (కన్నెపల్లి)లో మోటర్లను ప్రారంభించేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లుచేస్తున్నారు. కాళేశ్వరం వద్ద గోదావరి వరద సోమవారం సాయంత్రానికి 2.15 లక్షల క్యూసెక్కులుగా పారుతున్నది. లక్ష్మి బరాజ్ (మేడిగడ్డ)లో సోమవారం నీటి ప్రవాహం నిలకడగా ఉన్నది. సోమవారం బరాజ్‌కు 2.14 లక్షల క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం లక్ష్మి బరాజ్‌లో 2.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని ఇంజినీర్లు వెల్లడించారు.

సోమవారం కరీంనగర్ జిల్లా రామడుగులోని గాయత్రి పంప్‌హౌస్‌లో బాహుబలి మోటర్ వెట్ ట్రయల్‌రన్ సక్సెస్ కావడంతో విజయసంకేతం చూపుతున్న ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఇంజినీర్లు

స్థిరంగా వరద ప్రవాహం

ఎగువన మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టుకు 33 వేల క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుండటంతో ప్రాజెక్టు నెమ్మదిగా నిండుతున్నది. 102.73 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వకుగాను ప్రస్తుతం 93.76 టీఎంసీలుగా ఉన్నది. శ్రీరాంసాగర్‌కు కూడా వరద స్వల్పంగా వస్తున్నది. సోమవారం సాయంత్రం 2,960 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా జలాశయ నిల్వ 90.31 టీఎంసీలకుగాను 16.35 టీఎంసీలుగా ఉన్నది. కడెంకు నాలుగు పైచిలుకు క్యూసెక్కుల వరద వస్తుండగా... అధికారులు 5700 క్యూసెక్కులకు పైగా దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో ఎల్లంపల్లి వద్ద ఇన్‌ఫ్లో-అవుట్‌ఫ్లో 5570 క్యూసెక్కులుగా నమోదవుతున్నది. కిన్నెరసాని వద్ద రెండుగేట్లు ఎత్తి పదివేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేశారు. భద్రాద్రి పట్టణంలో గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రికి 32.9 అడుగుల మేర ఉన్నది. పేరూరు దగ్గర గోదావరి ఉధృతి స్థిరంగా కొనసాగుతున్నది. ఏడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద దిగువకు వెళ్తుండగా.. ధవళేశ్వరం వద్ద 12.33 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. అధికారులు అంతేమేర దిగువన సముద్రంలోకి వదులుతున్నారు. ఈ క్రమంలో తాజా నీటి సంవత్సరంలో ఇప్పటివరకు 1203 టీఎంసీల జలాలు సముద్రంలో కలిశాయి.

CPGET - 2019
DIRECTORATE OF ADMISSIONS
OSMANIA UNIVERSITY, HYDERABAD-7

ADMISSION NOTIFICATION
CERTIFICATE VERIFICATION & EXERCISING OPTIONS FOR WEB BASED COUNSELLING

All the provisionally qualified candidates of CPGET-2019 are hereby informed that the payment for registration fee towards certificate verification and options exercise for admissions into various PG Courses offered by **Osmania, Kakatiya, Telangana, Mahatma Gandhi, Satavahana, Palamuru and Jawaharlal Nehru Technological Universities** will commence from **13.08.2019.** The certificate verification will commence from **16.08.2019.** For details of procedure to be followed, the subject wise schedule of certificate verification, verification centers and for detailed notification visit the websites, www.ouadmissions.com; www.osmania.ac.in or http://tscpget.com.

13.08.2019
Hyderabad

Prof. N. KISHAN
Convener, CPGET-2019

ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా కుదించిన ఉదంతం దేశచరిత్రలో ఎన్నడూ జరుగలేదు. జమ్ముకశ్మీర్ ఒక మున్సిపాలిటీగా మారిపోయింది. ఇతర రాష్ట్రాలకు ఆర్టికల్ 371 కింద కొన్ని నిబంధనలున్నాయి. కేవలం జమ్ముకశ్మీర్ విషయంలోనే ఎందుకు ఇలా చేశారు? ఒకవేళ జమ్ముకశ్మీర్ హిందువులు అత్యధికంగా ఉండే రాష్ట్రమై ఉంటే బీజేపీ ఇలా చేసేది కాదు.

పి.చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి

గడిచిన 70 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఏ విషయంలో అయినా హిందు-ముస్లింల కోణంలోనే ప్రయత్నించింది. అందుకే ఆర్టికల్ 370 విషయంలోనూ చిదంబరం మత కోణంలో చూస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు అభివృద్ధికి సంబంధించిన అంశమన్నది చిదంబరం గుర్తెరుగాలి.

సంబిత్ పాత్ర, బీజేపీ అధికార ప్రతినిధి

చరిత్రలో నేడు

1784

ఈస్ట్ ఇండియా కంపెనీ యాక్ట్‌ను ఆమోదించిన బ్రిటిష్ పార్లమెంట్. భారత్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ఆరంభం.

1889

నాణెం ఉపయోగించి వినియోగించుకునే టెలిఫోన్‌ను తయారు చేసిన విలియం గ్రే.

1913

స్టెయిన్‌లెస్ స్టీల్‌ను కనుగొన్న బ్రిటిష్ శాస్త్రవేత్త హోర్లీ బ్రెడ్లీ.

కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలు కుండపోత వర్షాలతో అతలాకుతలమవుతున్నాయి. వరద బీభత్సంతో ఇప్పటికే 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అపారంగా పంట నష్టం జరిగింది. భారత వాతావరణశాఖ మరో రెండు రోజులు భారీ వర్షాలు తప్పవన్న హెచ్చరికతో జనం భయకంపితులవుతున్నారు. గతేడాది కూడా ఇదే విధంగా వరదలతో 60 మందికి పైగా చనిపోయారు. ఏటా ఇలా వరదలతో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతున్నా శాశ్వత ప్రాతిపదికన వరద నివారణకు ప్రభుత్వాలు చేస్తున్న చర్యలేవీ కనిపించటకపోవటం విడ్డూరం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

నేరస్తులు, అనుమానితులను చైనాకు అప్పగించాలన్న ఒప్పందం చేసుకున్న హాంకాంగ్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజాందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలనే ప్రజల డిమాండ్‌తో గత రెండు నెలలుగా హాంకాంగ్ అట్టుడికిపోతున్నది. సాధారణ కార్మికులు మొదలు ప్రభుత్వ ఉద్యోగుల దాకా ఆందోళనలో భాగమవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విమానాశ్రయాలను ఆందోళనకారులు ఆక్రమించారు. చైనా నుంచి హాంకాంగ్‌కు విముక్తి దక్కే దాకా విప్లవిస్తామంటున్నారు.

ది హిందూ

వేడిగాలులు, వరదలు

ఎండాకాలమంతటా వేడి గాలులలో అల్లాడిపోయిన బాధలు మరుపునకు రాకముందే ఇప్పుడు పలు రాష్ట్రాలు వరదల బారినపడి విలవిలలాడుతున్నాయి. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను వరదలు ముంచెత్తడంతో దాదాపు రెండు వందల మంది మరణించారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కేరళలోనే వంద మందికి పైగా మరణించడమో, గల్లంతవడమో జరిగింది. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో దాదాపు వంద మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో రెండున్నర లక్షల మంది, కర్ణాటకలో నాలుగు లక్షల మంది సహాయ శిబిరాలలో ఉన్నారు. సైనికదళాలు రంగంలోకి దిగి సహాయచర్యలు చేపడుతున్నాయి. పలు చోట్ల సాధారణం కన్నా అనేక రెట్లు ఎక్కువ వానలు పడటం గమనించవలసిన విషయం. కేరళలోని కొజికోడ్‌లో 21 సెంటీమీటర్ల, త్రిచూర్‌లో 19.9 సెంటీమీటర్ల వాన పడ్డది. ఈ అతివృష్టి, అనావృష్టి వలయంలో మనం చిక్కుకుపోయాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంగతి సరే సరి, మన దేశంతో సహా ప్రపంచమంతటా కొందరు పెద్దలు వాతావరణ మార్పు అనే ప్రచారం వట్టిదేనని ఇంకా వాదిస్తున్నారు. చాలా ప్రభుత్వాలు ప్రపంచానికి ముంచుకొస్తున్న ప్రమాదాన్ని పట్టించుకోవడం లేదు. కానీ ప్రతిదేశమూ వాతావరణ మార్పు ఫలితాన్ని అనుభవిస్తూనే ఉన్నది.

ఇటీవల తొలకరి ఆలస్యమై సుదీర్ఘమైన వేడి గాలులను చవి చూసిన మన దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పుడు వరద బారిన పడ్డాయి. ఈ అంచనాకు అతీతమైన వైపరీత్యాలకు వాతావరణ మార్పు కారణమని మరొకసారి వాతావరణవేత్తలు గుర్తుచేయవలసి వస్తున్నది. రుతుపవనాల గతి మారుతున్నదని, వైపరీత్యాల తీవ్రత పెరుగుతున్నదని ఇది స్పష్టంగా వాతావరణ మార్పు ఫలితమేనని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ స్పష్టంగా చెబుతున్నది. వాతావరణ మార్పునకు సంబంధించిన ప్యానెల్ (ఐపీసీసీ) గత బుధవారం నాడు 'వాతావరణ మార్పు భూమి' అనే తమ ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. ప్రకృతి వ్యవస్థ గతంలో ఏనాడూ లేనంత ఒత్తిడికి గురవుతున్న వైనాన్ని ఈ నివేదిక వెల్లడించింది. దీనివల్ల భూసారం దెబ్బతిన పంటలు పండించలేని పరిస్థితి ఎదురవుతుంది. తీవ్రమైన ఆహార సంక్షోభం పొంచి ఉన్నది. దీనిని ఏ ఒక్క చర్య ద్వారా పరిష్కరించలేము. ప్రభుత్వ విధానాలలో, ప్రజల జీవన సరళిలో భారీ మార్పులు రావలసి ఉన్నది. పునరుత్పాదక ఇంధనాలు మాత్రమే వాడాలె. వ్యవసాయరంగంలో కూడా మౌలిక మార్పులు తీసుకరావాలె. భారత్‌లో 7,500 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్నది. హిమాలయ ప్రాంతంలో చిన్నపెద్ద హిమనదులు పదివేల వరకు ఉన్నాయి. దేశవ్యాప్తంగా భిన్న భౌగోళిక ప్రాంతాలున్నాయి. అందువల్ల భారత్‌పై వాతావరణ మార్పు ప్రభావం పరిపరివిధాల ఉంటుంది. ఇప్పుడు వివిధ రాష్ట్రాలలో వరదల వల్లనైనా అప్రమత్తం కావాలె.

వాతావరణ మార్పు వల్ల అనేక ఉపద్రవాలు వచ్చి పడుతున్నాయనేది నిజమే. కానీ దానిని కారణంగా చూపి ప్రభుత్వాలు తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదు. వాతావరణ మార్పును అరికట్టడానికి ప్రాంతీయంగా తమ వంతు చర్యలు తీసుకోవాలె. మరోవైపు వైపరీత్యాలను తక్షణం ఎదుర్కొనడానికి తగిన వ్యూహాలను రచించుకొని ఆచరించాలె. ఈ చర్యలేవీ తీసుకోకుండా వాతావరణ మార్పుపైనే మొత్తం నెట్టేయడం కనిపిస్తున్నది. పరిస్థితి విషమంగా మారిందని అనుభవపూర్వకంగా తెలిసిన తరువాత కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ చర్యలను తీసుకోవడం లేదు.

వాతావరణ మార్పు వల్ల అనేక ఉపద్రవాలు వచ్చి పడుతున్నాయనేది నిజమే. కానీ దానిని కారణంగా చూపి ప్రభుత్వాలు తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదు. వాతావరణ మార్పును అరికట్టడానికి ప్రాంతీయంగా తమ వంతు చర్యలు తీసుకోవాలె. మరోవైపు వైపరీత్యాలను తక్షణం ఎదుర్కొనడానికి తగిన వ్యూహాలను రచించుకొని ఆచరించాలె. ఈ చర్యలేవీ తీసుకోకుండా వాతావరణ మార్పుపైనే మొత్తం నెట్టేయడం కనిపిస్తున్నది. పరిస్థితి విషమంగా మారిందని అనుభవపూర్వకంగా తెలిసిన తరువాత కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ చర్యలను తీసుకోవడం లేదు. గతేడాది కేరళలో వరదలు ముంచెత్తి వందలాది మంది మరణించారు. దీనికి పశ్చిమ కనుమల పరిరక్షణ చేపట్టకపోవడం కారణం. ఇప్పటికీ అడ్డగోలుగా రాతి తవ్వకాలు సాగుతున్నాయి. పర్యాటక అభివృద్ధి పేర భారీ నిర్మాణాలు సాగాయి. పశ్చిమ కనుమల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీర్ఘకాలికంగా పర్యావరణ పరిరక్షణ చర్యలతో పాటు వైపరీత్యాలను వెంటనే ఎదుర్కొనేందుకు సన్నద్ధమై ఉండటం లేదు. వరదలను ఎదుర్కొనడానికి ముందు ఏర్పాట్లు చేసుకోవడం లేదు. వరద నీరు జనావాసాలపైకి రాకుండా ఉపయోగకరంగా మార్చుకోగలుగాలె. పలు రాష్ట్రాలలో నగర పరిపాలన ఇంకా పాత పద్ధతిలోనే సాగుతున్నది. నగరాలలో కబ్జాల వల్ల వరద నీరు పోయే మార్గాలు మూసుకుపోయి ఉన్నాయి. చెత్తచెదారం అంతా నాలాలలోకి వదులుతుంటారు. నిర్మాణాలకు వాడిన ఇసుక, కంకర అన్నీ రోడ్లపై పడి ఆ తరువాత నాలాలలోకి చేరి ప్రవాహాన్ని అడ్డగిస్తాయి. వైపరీత్యాలు తప్పవని తెలిసిన తరువాత కూడా నిష్క్రియాపరత్వం తగదు. ఉత్తమ పరిపాలన అందించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు, ప్రజల సంరక్షణకు చర్యలు తీసుకోవాలె.

జనగళం

'ప్రతిజ్ఞ'ను నిలబెడుదాం

భిన్నత్వంలో ఏకత్వమనే భావనతోనే మనదేశం మనుగడ సాగించగలుగుతున్నది. గురజాడ నుంచి గరిమెళ్ళ వరకు తమతమ గేయాలతో ప్రజల్లో దేశభక్తిని, సోదరభావాన్ని పెంచడానికి దోహదం చేశారు. అందులో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన 'ప్రతిజ్ఞ' ఒకటి. దేశవ్యాప్తంగా 'భారతదేశం నా మాతృభూమి' అనే ప్రతిజ్ఞ 1965 నుంచి వివిధ భాషల్లో విద్యార్థుల చేత చదువబడుతున్నది.

ఒకవైపు ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచం ఒక కుగ్రామంగా మారినప్పటికీ మనుషుల మనసులు కుంచించుకుపోతున్నాయి. జీవన విధానంలో టెక్నాలజీ పాత్ర పెరుగడం వల్ల ఎదుటివారిపై ఆధారపడే అవసరం రోజు రోజుకూ తగ్గిపోతున్నది. ఈ క్రమంలో గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవడం కూడా తగ్గిపోయింది. బోధనలో నైతిక విలువలకు స్థానం లేకుండాపోతున్నది. మరోవైపు సాంఘిక మాధ్యమాల ద్వారా కులమతాల పేరుతో పౌరులను రెచ్చగొట్టి విభజించేశక్తులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిజ్ఞలోని పదాలకు మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉన్నది. 1916 జూన్ 10న నల్గొండ జిల్లా అన్నేపర్తి గ్రామంలో జన్మించిన పైడిమర్రి కవిగా, రచయితగా, బహుభాషా కోవిదునిగా పేరు పొందాడు. తన రచనలతో తెలుగు భాషకు వన్నెతెచ్చారు. ఖజానా శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. 1962లో విశాఖపట్నంలో జిల్లా ఖజానాధికారిగా పనిచేస్తున్న సమయంలో పైడిమర్రి ప్రతిజ్ఞ రాశారు. ఆయన మిత్రుడు తెన్నేటి విశ్వనాథం చొరవతో ప్రతిజ్ఞ పాఠ్యపుస్తకాల్లోకి వచ్చింది. కానీ పేరు మాత్రం ముద్రించబడలేదు. దేశవ్యాప్తంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చదువబడుతున్నప్పటికీ కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఆయన పేరు ముద్రితమైంది. దేశవ్యాప్తంగా ఈ పని చేయవలసి ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం 2016లో పైడిమర్రి శతజయంతిని నిర్వహించింది. పైడిమర్రి పలుభాషల్లో గ్రంథాలు, కథలు, నవలలు, నాటకాలు రచించారు. వీటిలో చాలా గ్రంథాలు అముద్రితంగానే ఉన్నాయి. పైడిమర్రి రచనలను తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించడానికి ప్రయత్నం చేయవలసిన అవసరం ఉన్నది. దేశాన్ని ప్రేమించడమంటే ఈ నేలనే కాదు, ఇక్కడ నివసించే మనుషులను కూడా ప్రేమించాలనే విషయాన్ని ప్రతిజ్ఞ తెలియజేస్తుంది. ఈ సత్యాన్ని మనం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

- యం.రాంప్రదీప్

(నేడు పైడిమర్రి వర్ధంతి)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

పర్యావరణం

రాజ్‌రెడ్డి మహాకళ

వాతావరణ మార్పుపై పోరాటం

మనం మన వాతావరణాన్ని తీవ్రంగా పరిగణించం. ప్రపంచంలో ఇప్పుడు జరుగుతున్న పర్యావరణ వినాశ చర్యలే దానికి సాక్ష్యం. గతేడాది కేరళలో ఈ విపత్తును చూశాం. ఈ ఏడాది మన దేశంలోని ఒడిశాతోపాటు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ వైపరీత్యాలు కనిపించాయి. వర్షాలు ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ వెచ్చని భూమిని తాకడానికి 45 రోజులు ఆలస్యమయ్యాయి. దానికి కారణం మనం కాదా? మన పిల్లలు, వారు వారసత్వంగా పొందే ప్రపంచం గురించి ఏమిటి?

మారిన మన జీవనశైలి, ప్రమాణాలు ప్రపంచ వాతావరణ వ్యవస్థల గందరగోళ పరిస్థితి ఒక విపత్తు ప్రభావాన్ని సృష్టిస్తున్నాయి. 4.5 బిలియన్ సంవత్సరాల వయస్సున్న భూమికి సమస్య లేదు. ఏ జీవరాశి కూడా భూమికి సమస్య కాదు. భూమి అప్పుడే అంతరించదు. కానీ భూమిపై ఉన్న కోటానుకోట్ల జీవరాశి నెమ్మదిగా నశించిపోతుంది. మానవులు సృష్టించిన అధునాతన వ్యవస్థలు తయారుచేసిన పరిస్థితులు భూమి వినాశనానికి దారితీస్తుంది. మనకు వేరే శత్రువులు అవసరం లేకుండానే మన జీవితాలను మనమే నాశనం చేసుకుంటున్నాం.

మనం మన వాతావరణాన్ని తీవ్రంగా పరిగణించం. ప్రపంచంలో ఇప్పుడు జరుగుతున్న పర్యావరణ వినాశ చర్యలే దానికి సాక్ష్యం. గతేడాది కేరళలో ఈ విపత్తును చూశాం. ఈ ఏడాది మన దేశంలోని ఒడిశాతోపాటు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ వైపరీత్యాలు కనిపించాయి. వర్షాలు ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ వెచ్చని భూమిని తాకడానికి 45 రోజులు ఆలస్యమయ్యాయి. దానికి కారణం మనం కాదా? మన పిల్లలు, వారు వారసత్వంగా పొందే ప్రపంచం గురించి ఏమిటి? 4 డిగ్రీల సెల్సియస్ మార్పులు కొన్ని లక్షణాలను సృష్టిస్తే అది మనం ఊహించనంత తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. భవిష్యత్తు తరాలపై అది భరించలేనంత ప్రకృతి విశ్వయాన్ని సృష్టిస్తే జీవజాతులన్నీ ఒక్కొక్కటిగా ఈ సమస్త భూ మండలాన్ని వీడిపోతాయి. ఇది మనం రోజూ వింటున్నాం, చూస్తున్నాం.

2020 లోపు కార్బన్ ఉద్గారాలను అరికట్టలేమని మనకు తెలుసు. మన మొత్తం నాగరికతను దెబ్బతీసే, చెదరగొట్టే శక్తి ఈ కార్బన్, మిథేన్ వినాశక వాయువులకు ఉన్నది. మనం యంత్రాల వలె యుద్ధానికి అలవాటు పడ్డాము. పేదరికంపై యుద్ధం, మాదక ద్రవ్యాలపై యుద్ధం, క్యాన్సర్‌పై యుద్ధం. కానీ కార్బన్, మిథేన్ అనే శత్రువులు మన భూభాగంపై వినాశనాన్ని సృష్టించి ప్రాణ నష్టం చేస్తాయి. ఈ నష్టం కోలుకోలేనిది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే మనం చేయవలసిన యుద్ధం ఏ విధంగా ఉండాలో తెలువాలె. ఈ యుద్ధంలో భాగంగా– మానవులందరూ భూమిని పచ్చదనం కాపాడుకోవాలె. చెట్ల పెంపకం, నాటిన చెట్లను పరిరక్షించడం, చెత్తను శుభ్రపరుచగడం, రిసైక్లింగ్ చేయడంతోపాటు వాయు కాలుష్యాన్ని తగ్గించే పునరుత్పాదక వనరులను వాడాలి. ఇందుకోసం అన్నిదేశాలు మేల్కొవాలి. మన భూమి కోసం బాధ్యత తీసుకోవాలి. పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీయకుండా నీరు, జంతుజాలం, వృక్షజాలాలను కాపాడుకోవాలి.

40,000 ఉన్న పెద్ద పెంగ్విన్ కాలనీలో ఈ ఏడాదిలో రెండు పెంగ్విన్ పిల్లలు మాత్రమే బతికి బయటపడ్డాయి. అంటే మనం వినాశనానికి ఎంత దగ్గరగా ఉన్నామో ఆలోచించండి. పక్షుల సామూహిక మరణంతో సహా, గ్రహం అన్నిరకాల సంకేతాలను వినిపిస్తుందని మనం తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా గత కొన్నేండ్లుగా చాలా పక్షులు ఆకలితో చనిపోతున్నాయి. ఈ మరణాలు పక్షుల పొరపాటు వల్ల కాదు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నాయి. కాబట్టి ఎక్కువ ఉష్ణ ఉత్పాదక వ్యవస్థలను వాడుకలోకి తీసుకొని రావద్దు. సరళమైన ప్రజా రవాణా వ్యవస్థను వాడాలి. దీనివల్ల పర్యావరణంపై తక్కువ ప్రభావం ఉంటుంది. భూతాపం పెరిగిపోయి అనేక విపరిణామాలు సంభవిస్తున్నాయి. ఇటువంటి గొలుసుకట్టు పరిణామాలను ఆపడం ఇప్పటికే ఆలస్యమైంది. కాబట్టి కార్యక్రమం చేపట్టేముందు ఇది పర్యావరణానికి హాని కలిగిస్తుందా లేదా అనేది పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి ఒక్కటి పర్యావరణ కోణంలో ఆలోచించినప్పుడే కొంతవరకు విధ్వంసం తగ్గిపోతుంది. భూమిపై మానవ జీవనాన్ని విస్తరించడానికి, నిలుపుకోవడానికి చాలా ప్రాధాన్యం ఇస్తూ చాలావరకు పర్యావరణ హితంగా ఉండాలి.

కార్బన్ డయాక్సైడ్ మానవ చరిత్రలో అత్యధిక స్థాయిని తాకింది. 2019 జూన్‌లో చివరల్లో ఆర్కిటిక్ మహా సముద్రం దగ్గర ఉష్ణోగ్రత 84 ఎఫ్ డిగ్రీలు (29 సీ)గా నమోదైంది. మనందరం మన వినియోగ అలవాట్లను సర్దుబాటు చేసుకొని ఉంటే ఈ అస్తిత్వ సమస్య పరిష్కరించబడుతుందనే నమ్మకం కలిగేది. ఈ సంకేతాలు ప్రమాదకర వాతావరణ పరిస్థితులను చెప్పకనే చెప్తున్నాయి. భూగోళం వేడెక్కడం ప్రపంచ యుద్ధం లాంటిది కాదు. ఇది నిజమైన ప్రపంచయుద్ధం. దాని మొదటి బాధితులు (అమాయక ప్రజలు) ఈ సంక్షోభానికి ఏ మాత్రం కారణం కారణం కాదు. కానీ ఇది మనందరినీ లక్ష్యంగా చేసుకున్నది. గ్లోబల్ గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాలు 2030లో గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయి. శిలాజ ఇంధన వాడకం తగ్గించడం వల్ల వాయు ఉద్గారాలు పడిపోవడం ప్రారంభమౌతాయి. అయితే ఇప్పటికే జరుగాల్సిన నష్టం జరిగింది. భూమి వేడెక్కడం ప్రారంభమైంది. ఇప్పటికే 1.25 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత పెరిగింది. కాబట్టి ఇప్పుడు మనం చూడబోయేది వేరే ప్రపంచం. ఎందుకంటే మనం ఇప్పటికే అటవీ మంటల వంటి వైపరీత్యాలను ప్రత్యక్షంగా చూస్తున్నాం. కాబట్టి 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా జనాభాలో 55 శాతం మంది సంవత్సరానికి 20 రోజులకు పైగా ప్రాణాంతక వేడికి లోనవుతారు. కోట్లాదిమంది ప్రజలపై ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఉత్తర అమెరికా అడవి మంటలు, వేడి తరంగాలు, కరువు, వరదలతో, వినాశకరమైన వాతావరణ తీవ్రతతో సతమతమవుతుంది. భవిష్యత్తులో ఇది మరింత అధ్వాన్నంగా తయారవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల మంది ప్రజలు నీటి కొరతతో బాధపడుతున్నారు. కరువు, వేడి తరంగాలు, వరదలు, తుఫానులు పంటలను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో ఆహార ఉత్పత్తి ఐదవ వంతు తగ్గుతుంది. సుమారు వంద కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులవుతారు. ఇది చాలామంది ప్రజలను నాశనం చేస్తుంది. మూగజీవాలు నశిస్తాయి. సముద్రం స్వల్పంగా పెరుగడం వల్ల కొన్ని నగరాలు నివసించలేని విధంగా మారుతయి. సముద్రమట్టాలు పెరుగడం వల్ల ముంబై, జకర్తా, హాంగ్‌కాంగ్, షాంఘై, లాగోస్, బ్యాంకాక్, మనీలాతో సహా ప్రపంచంలోని పలు నగరాలు నీటిలో మునిగే ప్రమాదం ఉన్నది. అందువల్ల కోట్లాది మందికి పునరావాసం కల్పించాల్సి ఉంటుంది.

మనం తెలిసీతెలువక జీవన స్థితిగతులను, పర్యావరణ సమతుల్యాన్ని, అందులోని విలువైన సంపదను ఎంతో కోల్పోతున్నాం. కొన్నేండ్లుగా పర్యావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను విస్మరిస్తున్నాం. వారు ఎంతోకాలంగా భూగోళం వేడెక్కడం వల్ల చెడు ప్రభావాలుంటాయని చెప్తున్నారు. వ్యర్థ పదార్థాలను వెదచల్లవద్దని చెప్పినా పట్టించుకోలేదు. ఈ తప్పిదాల వల్ల లక్షలాదిమంది అమాయక పౌరులు బలయ్యారు. మనం నిత్యం వాతావరణ మార్పులకు గురవుతున్నాం. రెండో ప్రపంచయుద్ధంలో చేసినట్లుగా వనరులను సమీకరించడం, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా మానవులను రక్షించడంలో అవిశ్రాంతంగా పనిచేయాలి. వాతావరణ మార్పుపై యుద్ధాన్ని చేయడం ప్రతి దేశానికి తప్పనిసరి కావాలె. దీనిని రాజ్యాంగ నిబంధనలోకి తీసుకురావాలె.

వాతావరణ మార్పు అనే ఒక బాంబు. 'ఒక బిలియన్ సిలిండర్ల లోపల ఒక బిలియన్ పిస్టన్ల బిలియన్ పేలుళ్ల వలె ప్రపంచ ముప్పునకు ఆజ్యం పోస్తుంది. మనం వాతావరణ మార్పు అనే దాడికి గురవుతున్నామనేది నిజం. ఇందుకు రెండో ప్రపంచయుద్ధంలో మాదిరగా అందరమూ ఒక తాటిపైకి వచ్చి అన్ని అస్త్రాలను సమీకరించుకోవాలి. మనమంతా కలిసి పర్యావరణ మార్పు అనే శత్రువుపై ఏకకాలంలో దాడి చేయాలి. అదే మనకు మిగిలిన ఏకైక ఆశ.

'ఈ భూగోళం వేడెక్కడమనే పరిణామం ఇప్పుడు కచ్చితంగా మానవ జాతికి జీవన్మరణ విషయం' అని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రకటించారు. భూగోళ వాతావరణం ఈ జూన్ నెలలో 1.24 డిగ్రీల సెల్సియస్, జూలైలో 1.25 డిగ్రీల సెల్సియస్ (లేటెస్ట్ నాసా) ఎక్కువగా ఉన్నట్టు నిరూపితమైంది. 2019 మొదటి ఆరు నెలల్లోనే వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ సంవత్సరానికి 3 పీపీఎం కంటే అత్యధికంగా పెరుగుతున్నది. గత 40 మిలియన్ సంవత్సరాలలో వాతావరణ కార్బన్ ఆక్సైడ్ 2 పీపీఎం చొప్పున పెరుగలేదు. వాతావరణ చరిత్రలోనే 3 పీపీఎం అనేదే అన్నిటికంటే ఎక్కువ అని వాతావరణ వేత్త ఆంగ్రూ గ్లిక్సన్ 2016లో ప్రచురించారు. శిలాజ ఇంధనం ఉపయోగించడం వల్ల వెలువడిన వాయువులే ఈ పెరుగుదలకు కారణం.

వాతావరణ మార్పు అనే ఒక బాంబు. 'ఒక బిలియన్ సిలిండర్ల లోపల ఒక బిలియన్ పిస్టన్ల బిలియన్ పేలుళ్ల వలె ప్రపంచ ముప్పునకు ఆజ్యం పోస్తుంది. మనం వాతావరణ మార్పు అనే దాడికి గురవుతున్నామనేది నిజం. ఇందుకు రెండో ప్రపంచయుద్ధంలో మాదిరగా అందరమూ ఒక తాటిపైకి వచ్చి అన్ని అస్త్రాలను సమీకరించుకోవాలి. మనమంతా కలిసి పర్యావరణ మార్పు అనే శత్రువుపై ఏకకాలంలో దాడి చేయాలి. అదే మనకు మిగిలిన ఏకైక ఆశ.

(వ్యాసకర్త: వాతావరణ మార్పు, సుస్థిర నగరాల నిపుణులు)

బిట్వీన్ ద లైన్స్

విశ్లేషణ

రమేశ్ హజారీ

సామాజిక పరిణామక్రమంలో, నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట కార్యాచరణను అనుసరించి రాజకీయ అవగాహనల్లో మార్పు అనివార్యమైతది. కానీ కొన్ని సంప్రదాయ, కంఫర్ట్ జోన్లను దోలాడుకునే స్టేటస్ కో మనస్తత్వాలు ఈ సంధికాలంలో అనుసరించాల్సిన గతితర్కాన్ని పట్టలేకపోతయి. వారి బుద్ధి జర అటకాయిస్తది. అంత తొందరగా మారదు. నిన్నటిదాకా పేరుకున్న భావజాలాన్ని కడుక్కోమంటే కడుక్కోలేవు. నేనెప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకమేనని అవగాహనారాహిత్యపు స్టేట్‌మెంట్లు ఇస్తయి. రాజులున్మత్తులు వారి సేవ నరకప్రాయంబు.. అంటూ పాసుపండ్ల పాటలు పాడుకుంటూ రాజరికానికి ప్రజాస్వామ్యానికి లెంకపెట్టే పిచ్చిశేతలకు దిగుతయి. లోపల ప్రగతిభవన్‌లకు పోవాలని బలంగా ఉన్నా బయటికి మాత్రం.. ప్రజాపక్షం అనుకుంటూ దబాయిస్తయి. బైటి కోటి లోపలోటి మాట్లాడుకుంట నలుగురి ముందు సిగ్గుపడుతయి.

సరిగ్గ ఇసొంటప్పుడే మేధావితనం సామాజిక, రాజకీయ, తాత్త్వికత మీద లంగరేసుకోని నిలబడాల్సి వుంటది. మార్పు అనివార్యమనే సోయితో మార్పు నుంచి మార్పు దిశకు ప్రయాణం సాగించే సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి వుంటది. నిలదొక్కుకోవాల్సి వుంటది. ఈ గుణాత్మక మార్పు కుదింపులకు గురయ్యే ప్రతిసందర్భంలో మార్పు క్రమంలో అనివార్యమయ్యే సంధికాలం, వొక మార్పు నుంచి మరో మార్పునకు నడుమ షాక్ అబ్సర్బర్‌లాగా ఉంటదనే విషయాన్ని గుర్తించాలె.

ఈ కోణంలో.. తెలంగాణ రాజకీయ తాత్త్విక ఆలోచనా విధాన పరిణామ క్రమాన్ని మనం రెండుగా విభజించవలసి ఉంటది. అది తెలంగాణ రావడానికి ముందుకాలం, తెలంగాణ వచ్చిన తర్వాత కాలం. ఈ రెండు కాలాల నడిమి సంధికాలం. అంటే.. నాటి ఉద్యమసారథి నేటి సీఎం కేసీఆర్ దార్శనికతతో ఇప్పుడు నడుస్తున్న స్వయం పాలనా కాలం.

తెలంగాణ కోసం జరిగిన రాజకీయ ఉద్యమ పోరాటాల్లో నాటి (వలస) ప్రభుత్వాన్ని నిత్యం నిరసిస్తూ ఆ ప్రభుత్వం మీద పోరాటం చేస్తూ సాగింది. ఆ క్రమంలో ఉత్పత్తి అయిన భావజాలం అంతా కూడా, నిర్దిష్టంగా ఆంధ్రా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, జనరల్‌గా ప్రభుత్వ విధానాలను తప్పుపడుతూ సాగింది. ఆ మాటకొస్తే ఈ విధానం నిజాం నుంచి తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన తెల్లారి నుంచి సాగింది. అందుకు కారణం అంతకుముందు రాచరిక నిజాం పాలన, ఆ తర్వాత మనదికాని వలస పాలన కావడమే. మొత్తంగా.. సాయుధ పోరాట కాలం నుంచి స్వయం పాలన వచ్చేవరకు తెలంగాణ బిడ్డల 70 ఏండ్ల జీవితం పరాయి పాలకుల మీద తద్వారా ప్రభుత్వాల మీద పోరాడటమే సరిపోయింది. దీంతోపాటు నడుమ తగులుకున్న సాయుధ పోరాట పంథా. ప్రభుత్వ వ్యతిరేక తెలంగాణ మనస్తత్వానికి అగ్నికి ఆజ్యం పోసినట్టయి, అసలు ఎన్నికలే బూటకం పార్లమెంటరీ పంథానే దోపిడీ అంటూ ఆయుధం ద్వారానే విముక్తి అనే సాయుధ పోరాట పంథా జమయ్యింది. దాంతో ప్రభుత్వాల వ్యతిరేకత మరింత మన బుద్ధిజీవుల్లో జీర్ణించుకున్నది. అట్లా తెలంగాణ తాత్త్విక మేధావి సిద్ధాంతకర్తల బుద్ధిజీవుల డీఎన్ఏల్లో పార్లమెంటరీ ప్రభుత్వ వ్యతిరేకత పాతకాలపు ప్రవాహం కొత్త కాలపు స్వయం పాలనలోనూ ప్రవహిస్తున్నది. అదేవారి

ప్రభుత్వ పథకాలు వాడుకుంటే గ్రీన్‌కార్డు బంద్!

వలసల విషయంలో కొత్త ఆంక్షలకు తెరతీసిన అమెరికా

వాషింగ్టన్, ఆగస్టు 12: వలసల విషయంలో కఠినమైన ఆంక్షలు విధిస్తున్న అమెరికా మరో పిడుగులాంటి వార్త చెప్పింది. ప్రభుత్వ ప్రయోజనాలను ఆశించే వలసదారులకు గ్రీన్ కార్డును నిరాకరిస్తామని సోమవారం పేర్కొంది. 'అమెరికా పౌరులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వినియోగించుకోబోమని వలసదారులు కాన్సులర్ ఆఫీసర్‌కు నమ్మకం కలిగించాలి. అలా చేయని పక్షంలో చట్టబద్ధమైన శాశ్వత నివాసాన్ని కల్పించే గ్రీన్‌కార్డును జారీచేయడం జరుగదు. ప్రభుత్వ పథకాలైన ఆహారం, వైద్యం, గృహవసతి వంటి ప్రయోజనాలను వలసదారులు ఉపయోగించుకున్నట్టు తేలితే వాళ్లపై పబ్లిక్ చార్జ్ (గ్రీన్‌కార్డు, వీసా తదితర పత్రాల రద్దు) విధించబడుతుంది' అని శ్వేత సౌధం పేర్కొంది. బయటి దేశం నుంచి వచ్చే వాళ్లు ప్రభుత్వ పథకాలపై ఆధారపడకుండా, సొంత ఆదాయంపై జీవించేలా ఈ నిర్ణయం సాయపడుతుందని అధికారులు తెలిపారు.

విమానం పంపిస్తాం.. వచ్చి చూడండి

- కళ్లారా చూసి మాట్లాడండి
- రాహుల్‌కు జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆహ్వానం

జమ్ము: జమ్ము కశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయంటూ వార్తలు వస్తున్నాయన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ మండిపడ్డారు. ఆయనకు విమానం పంపిస్తామని, కశ్మీర్ పరిస్థితిని కళ్లారా చూసి మాట్లాడాలన్నారు. 370, 35 ఏ అధికరణల రద్దు నేపథ్యంలో కశ్మీర్‌లో కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయని, ప్రధాని మోదీ శాంతియుత చర్యలు చేపట్టాలని రాహుల్ ఇటీవల అన్నారు. దీనిపై గవర్నర్ సోమవారం స్పందించారు. 'రాహుల్ గాంధీ ఇక్కడకు రావాలని నేను ఆహ్వానిస్తున్నాను. ఇక్కడి పరిస్థితిని కళ్లారా చూసేందుకు ఆయన కోసం విమానం పంపిస్తాను. చూసిన తర్వాత మాట్లాడండి. అంతేగానీ బాధ్యత కలిగిన వ్యక్తి అయిన మీరు ఇలా మాట్లాడటం తగదు' అని సత్యపాల్ మాలిక్ అన్నారు. జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి అంతా ప్రశాంతంగానే ఉన్నదన్నారు. 'అన్ని దవాఖానలు తెరిచే ఉన్నాయి. కనీసం ఒక్క వ్యక్తికి బుల్లెట్ గాయాలయ్యాయి అని అయినా మీరు నిరూపించగలరా?' అని ప్రశ్నించారు. కశ్మీర్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపు (నిర్బంధ శిబిరం)లాగా మారిపోయిందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. తాను 30సార్లు జైలుకు వెళ్లానని, అయినప్పటికీ జైలును కాన్సన్‌ట్రేషన్ క్యాంపు అని ఎన్నడూ అనలేదన్నారు.

ఇంటికెప్పుడెళ్తామో..

కశ్మీర్‌లోయలో ఉన్న ఆంక్షల నేపథ్యంలో సొంత ఇళ్లకు వెళ్లలేని కశ్మీరీ విద్యార్థుల కోసం సోమవారం ఢిల్లీలో బక్రీద్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కశ్మీరీ విద్యార్థిని భావోద్వేగం.

రౌడీల రాజ్యం

- అభిప్రాయాన్ని వెల్లడించే స్వేచ్ఛ లేదు
- ట్విట్టర్ ఖాతాను తొలిగిస్తూ దర్శకుడు అనురాగ్ కశ్యప్ వ్యాఖ్యలు

అనురాగ్ కశ్యప్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: రౌడీల రాజ్యంలో.. దౌర్జన్యాలే జీవనవిధానంగా ఉండబోతున్నాయని బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తన ట్విట్టర్ ఖాతాను ఆయన తొలిగించారు. తన అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించలేకపోతున్నానని, తనకు తన కుటుంబ సభ్యులకు బెదిరింపులు వస్తున్నాయని తన చివరి ట్వీట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. 'మీ అందరికీ సంతోషం, విజయం చేకూరాలని ఆశిస్తున్నా. నా ట్విట్టర్ ఖాతాను తొలిగిస్తున్నందున ఇదే నా చివరి ట్వీట్. నా మనసులోని భావాలను నిర్భయంగా చెప్పలేని పరిస్థితి ఉన్నప్పుడు నేను మాట్లాడకపోవడమే మంచిది. గుడ్ బై' అని ట్వీట్ చేశారు. 'మీ తల్లిదండ్రులకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నప్పుడు, మీ కుమార్తెకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు వస్తున్నప్పుడు.. ఎవరూ కూడా నోరు విప్పి మాట్లాడలేరు. దీనికి కారణాలు, హేతుబద్ధత అవసరం లేదు. రౌడీల రాజ్యం ఏర్పడనున్నది.. దౌర్జన్యాలే జీవన విధానంగా మారనున్నాయి. ఇలాంటి నవభారతంలో ఉన్న వారందరికీ అభినందనలు. మీరంతా అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నా' అని చివరి ట్వీట్‌కు ముందు కశ్యప్ ట్వీట్ చేశారు. ఇటీవల దేశంలో జరుగుతున్న మూకదాడులను నివారించేలా ప్రధాని జోక్యం చేసుకోవాలంటూ మోదీకి బహిరంగ లేఖ రాసిన ప్రముఖుల్లో అనురాగ్ కశ్యప్ కూడా ఒకరు. ఈ నేపథ్యంలో ట్విట్టర్‌లో తనకు వస్తున్న బెదిరింపులపై గత నెలలో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. సామాజిక అంశాలకు సంబంధించిన పలు చిత్రాలకు కశ్యప్ దర్శకత్వం వహించారు. మరోవైపు అనురాగ్ కశ్యప్ తన ట్విట్టర్ ఖాతా తొలిగించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఢిల్లీలో ట్రిపుల్ తలాక్ కింద రెండో అరెస్ట్

వారంలో రెండో ఘటన

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్ కింద భార్యకు విడాకులు ఇచ్చిన ఓ వ్యక్తిని ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ అంశంలో వారంలో ఇది రెండో అరెస్ట్ కావడం గమనార్హం. మహ్మద్ తోసిఫ్ (26) తన భార్య అస్మా సాహెబా (22)కు శుక్రవారం మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులిచ్చాడు. ఈ విషయమై అస్మా సాహెబా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'రెండు నెలలుగా విడాకుల కోసం వేధిస్తున్నాడు. నేను నిరాకరించాను. మరింత కట్నం ఇవ్వాలనీ వేధించాడు' అని అన్నారు. తోసిఫ్‌ను కొడుకు కోసం డబ్బులు ఇవ్వమని తాను అర్థించినప్పుడు మూడుసార్లు తలాక్ చెప్పాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. కొడుకు కోసం డబ్బు ఇవ్వకపోగా, ఆమెపై చేయి చేసుకుని ట్రిపుల్ తలాక్ చెప్పాడని, చంపేస్తానని కూడా బెదిరించాడని పోలీసులు తెలిపారు. తోసిఫ్‌ను అరెస్ట్ చేసి ఒకరోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించామన్నారు.

సారాభాయ్ దార్శనికతతోనే

సైన్స్ శక్తిగా భారత్

- దేశ అంతరిక్ష, అణు కార్యక్రమాలకు కొత్తదారులు చూపారు
- చంద్రుడిపై అడుగిడడం ద్వారా ఆయనకు ఘన నివాళి అర్పిద్దాం
- యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి
- సారాభాయ్ శతజయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ

అహ్మదాబాద్, ఆగస్టు 12:

సారాభాయ్ శతజయంతి సందర్భంగా గూగుల్ రూపొందించిన డూడుల్

భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ శతజయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచంలో భారత్ శాస్త్ర, సాంకేతిక శక్తిగా ఎదుగడంలో సారాభాయ్ దార్శనికత ఎంతో దోహదపడిందని కొనియాడారు. సోమవారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన సారాభాయ్ శతజయంతి ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ మేరకు ప్రధాని వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. 'చంద్రుడిపై భారత్ అడుగు పెట్టబోతున్న వేళ డాక్టర్ సారాభాయ్ శతజయంతి వేడుక రావడం విశేషం. చంద్రయాన-2లోని ల్యాండర్ 'విక్రమ్' వచ్చే నెల చంద్రుడిపై అడుగుపెడితే.. అదే 130 కోట్ల మంది భారతీయులు డాక్టర్ సారాభాయ్‌కి అందించే ఘన నివాళి' అని ప్రధాని పేర్కొన్నారు. కేంద్ర అంతరిక్ష విభాగం, అణుశక్తి విభాగం, ఇస్రో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. 'సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అధునాతన సాంకేతికతను వినియోగించేందుకు సంకోచించకూడదని సారాభాయ్ చెబుతుండేవారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ బలమైన శక్తిగా ఎదుగడంలో సారాభాయ్ అవిరళ కృషి చేశారు' అని ప్రధాని కొనియాడారు. భారత అణు కార్యక్రమానికి బీజం వేసిన ప్రఖ్యాత శాస్త్రవేత్త హోమీ బాబా మరణంతో ఏర్పడిన లోటును డాక్టర్ సారాభాయ్ తీర్చారని చెప్పారు. 1960లలో కేరళలోని తుంబలో సారాభాయ్ సారథ్యంలో ప్రయోగించిన తొలి రాకెట్.. నేడు మార్స్, ల్యూనార్ మిషన్లలో వినియోగిస్తున్న రాకెట్ టెక్నాలజీకి మూలాధారమని మోదీ తెలిపారు.

సారాభాయ్ గొప్ప మానవతావాది

'మన అంతరిక్ష, అణు కార్యక్రమాలకు సారాభాయ్ కొత్త దారులు చూపారు. నేడు అంతరిక్ష రంగంలో మనం సాధిస్తున్న విజయాలను చూసి ప్రపంచం యావత్తూ విస్మయం చెందుతున్నది. విక్రమ్ సారాభాయ్ ప్రసిద్ధ శాస్త్రవేత్త మాత్రమే కాదు.. గొప్ప మానవతావాది.. గొప్ప ఉపాధ్యాయుడు' అని ప్రధాని పేర్కొన్నారు. దేశ యువత సారాభాయ్‌ని స్ఫూర్తిగా తీసుకుని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కొత్త ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ కే శివన్, ఆ సంస్థ మాజీ చైర్మన్ కస్తూరి రంగన్, స్పేస్ అప్లికేషన్ సెంటర్ మాజీ డైరెక్టర్ ప్రమోద్ కాలే, సారాభాయ్ కుమారుడు కార్తికేయ సారాభాయ్ తదితరులు పాల్గొన్నారు. విక్రమ్ సారాభాయ్ 1919 ఆగస్టు 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జన్మించారు. ఇస్రోకు పునాది వేసింది ఆయనే. 28 ఏండ్ల వయసులోనే అహ్మదాబాద్‌లో ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీని నెలకొల్పారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్‌గానూ ఆయన వ్యవహరించారు. అహ్మదాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను (ఐఐఎంను) ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఫాస్టర్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్ (ఎఫ్‌బీటీఆర్), విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, వేరియబుల్ ఎనర్జీ సైక్లోట్రాన్ ప్రాజెక్ట్, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) వంటి సంస్థలను స్థాపించారు. 1971 డిసెంబర్ 30న కన్నుమూశారు.

అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన విక్రమ్ సారాభాయ్ శత జయంతి వేడుకల్లో సారాభాయ్ జీవితంపై రూపొందించిన ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న ఇస్రో చైర్మన్ శివన్ తదితరులు

20న చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్- 2

ఇస్రో చైర్మన్ డాక్టర్ కే శివన్ వెల్లడి

అహ్మదాబాద్, ఆగస్టు 12: చంద్రయాన్ -2 ఆగస్టు 20న చంద్రుడి కక్ష్యలోకి చేరుతుందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ కే శివన్ తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ శతజయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివన్ మాట్లాడుతూ.. 'జూలై 22న చంద్రయాన్ -2ను ప్రయోగించిన తర్వాత ఐదుసార్లు కక్ష్య పెంపు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం చంద్రయాన్ -2 భూమి చుట్టూ తిరుగుతున్నది. బుధవారం మరో కీలక ప్రక్రియ చేపట్టనున్నాం. ఆగస్టు 14న తెల్లవారుజామున 3.30కి ట్రాన్స్ ల్యూనార్ ఇంజక్షన్ ప్రక్రియలను నిర్వహించనున్నాం. దీంతో చంద్రయాన్-2 భూ కక్ష్యను వీడి చంద్రుడి వైపునకు కదులుతుంది. ఆగస్టు 20న చంద్రయాన్-2 చంద్రుడి వద్దకు చేరుతుంది. అనంతరం చంద్రయాన్-2ను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే చర్యలు చేపడతాం. చివరకు సెప్టెంబర్ 7న చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ల్యాండర్ దిగుతుంది. అందులోని రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి చేరుతుంది' అని చెప్పారు. చంద్రయాన్-2 ఉపగ్రహం గమనం ప్రస్తుతం అంతా సజావుగానే సాగుతున్నదని, అందులోని అన్ని వ్యవస్థలు సక్రమంగా పని చేస్తున్నాయని శివన్ వివరించారు. 'రానున్న నెలల్లో ఇస్రో శాస్త్రవేత్తలు బిజీగా ఉంటారు. డిసెంబర్‌లో మరో కీలక మిషన్ చేపట్టనున్నాం. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించనున్నాం. ఇలాంటి ప్రయోగం నిర్వహించడం ఇదే తొలిసారి' అని శివన్ తెలిపారు.

కశ్మీరీల వేదన వినాలి

- 370వ అధికరణం రద్దుపై మాజీ ప్రధాని మన్మోహన్
- కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి నివాళి..
- తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని వెల్లడి

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దుచేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సోమవారం తొలిసారి స్పందించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని దేశంలోని చాలా మంది స్వాగతించడం లేదన్నారు. భారత్ అన్న భావనను కొనసాగించేందుకు కశ్మీరీల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ఇటీవల కన్నుమూసిన కేంద్ర మాజీ మంత్రి, జైపాల్‌రెడ్డికి సోమవారం ఢిల్లీలో పలు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్ మాట్లాడుతూ.. భారత్ 'తీవ్ర సంక్షోభం'లోకి వెళుతున్న వేళ చీకటి శక్తులను ఎదుర్కొనేందుకు భావసారూప్యం గల వ్యక్తుల మధ్య సహకారం అవసరమని చెప్పారు. భారత్ అన్న భావనను చీకటి శక్తులు చెదరగొడుతున్న విపత్కర సమయంలో జైపాల్‌రెడ్డి మనమధ్య లేకపోవడం విచారకరమన్నారు. 'జైపాల్‌రెడ్డి ఆశావాది, మానవతా వాది, తెలంగాణ ఏర్పాటు కోసం ధృడంగా మద్దతు పలికిన నేత. 2014లో ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణ ఏర్పాటు కోసం నేతలను ఒప్పించడంలో కీలకపాత్ర పోషించారు' అని పేర్కొన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాట్లాడుతూ 'ఆయన ఒక మిత్రుడు, తత్వవేత్త, మార్గదర్శి. దేశం భారీ సంక్షోభంలో చిక్కుకున్న వేళ ఆయన మరణం విచారకరం' అని అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ తదితరులు జైపాల్‌రెడ్డికి నివాళులు అర్పించారు.

మన్మోహన్‌సింగ్‌తో సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా కరచాలనం, మధ్యలో సీతారాం ఏచూరి

వరద బీభత్సం

- 200 దాటిన మృతుల సంఖ్య.. 12 లక్షల మందిపై ప్రభావం
- ఉత్తరాఖండ్, జమ్ములో విరిగిపడిన కొండచరియలు.. తొమ్మిది మంది మృతి

ఉత్తరాఖండ్‌లోని చమోలీలో వరద ఉధృతి

న్యూఢిల్లీ: వర్షాలతో దేశవ్యాప్తంగా జనజీవనం అతలాకుతలం అవుతున్నది. పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల్లో వరదలు విలయతాండవం చేస్తుండగా.. ఉత్తరాఖండ్, జమ్ములో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు ముంచెత్తడంతో కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో సోమవారంనాటికి 200 మందికి పైగా మృతి చెందగా 12 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ఉత్తరాఖండ్, జమ్ములో కొండచరియలు విరిగిపడటంతో తొమ్మిది మంది చనిపోయారు. భారీ వర్షాలతో వరదలు పోటెత్తడంతో కేరళలో సోమవారంనాటికి 83 మంది మృతి చెందారు. 58 మంది గల్లంతయ్యారు. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటి వరకూ 122 మంది మరణించారు. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో వరదల కారణంగా రోడ్డుపై చిక్కుకున్న దాదాపు 125 మందిని భారత వైమానిక దళం(ఐఏఎఫ్) రక్షించింది. తర్వాత ఆ రోడ్డు వరదల్లో కొట్టుకుపోయినట్టు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో మహారాష్ట్ర, కర్ణాటకలో దెబ్బతిన్న రహదారులను మరమ్మత్తు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. గత ఆరురోజులుగా మూతబడిన ముంబై-బెంగళూరు జాతీయ రహదారి-4ని అధికారులు సోమవారం పాక్షికంగా తెరిచారు. రోడ్డుపై నిలిచిపోయిన వేలాది సరకు రవాణా లారీలను పంపి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఛుఫ్లాగడ్ నదిలో భారీ ప్రవాహం రావడంతో ఒడ్డున ఉన్న రెండు భవంతులు కొట్టుకుపోయాయి. ఛమోలీ జిల్లాలోని బంజాబ్‌గడ్, అలిగాన్, లంఖి గ్రామాలపై కొండచరియలు విరిగిపడడంతో శిథిలాల కింద చిక్కుకొని ఊపిరాడక ఆరుగురు మృతి చెందారు. జమ్ముకశ్మీర్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల ప్రభావంతో రెసాయి జిల్లాలోని ఓ కుటుంబం బండరాయి కింద నిలబడగా.. ఉన్నట్టుండి కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటి వరకూ ఐదుగురు మరణించారు.

కేరళలో కన్నీరు పెట్టిస్తున్న ఘటన..

కేరళలో తాజాగా వెలుగులోకొచ్చిన ఓ హృదయవిదారక ఘటన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టిస్తున్నది. మలప్పురంలోని కొట్టకున్ను ప్రాంతంలో శుక్రవారం కొండచరియలతో కూడిన ఓ పెద్ద నీటి ప్రవాహం సమీపంలోని ఇంటిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇంటి బయట ఉన్న శరత్.. త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇంటి లోపల ఉన్న శరత్ భార్య గీతూ, ఏడాదిన్నర కొడుకు ధృవ్ ప్రవాహంలో కొట్టుకుపోయారు. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన మట్టి మేట వేసింది. ఆ మట్టిని తొలిగిస్తుండగా తల్లీబిడ్డ మృతదేహాలు సోమవారం లభించాయి. ఆ స్థితిలో కూడా తల్లి తన బిడ్డ చేతిని గట్టిగా పట్టుకుని ఉన్నట్టు మృతదేహాలు కనిపించడంతో.. ఆ దృశ్యం చూసిన పలువురు కంటతడి పెట్టారు. ఈ ఘటనలో కొట్టుకుపోయిన శరత్ తల్లి సరోజిని మృతదేహాన్ని కూడా సోమవారం వెలికితీశారు.

బాధితులకు అండగా రాహుల్

వరద బాధితులకు అవసరమైన సహాయ సహకారాలందిస్తామని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. భారీగా కురిసిన వర్షాలతో పోటెత్తిన వరదలతో నిర్వాసితులైన దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు దన్నుగా నిలువాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. సోమవారం ఆయన కేరళలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్ లోక్‌సభ స్థానం పరిధిలో పర్యటించారు. వరదల వల్ల వాటిల్లిన నష్టం, బాధితుల కోసం చేపట్టిన సహాయ చర్యలపై అధికారులతో సమీక్షించారు. బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, కేరళ సీఎం పినరాయ్ విజయన్‌లను కోరానన్నారు. వయనాడ్ జిల్లా మెప్పాడి, కోజికోడ్ జిల్లా కయిథాపొయిల్‌లో ఏర్పాటుచేసిన సహాయ శిబిరాల్లోని బాధితులతో ఆయన మాట్లాడారు. కాగా, ప్రజలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు బక్రీద్ స్ఫూర్తిగా ముందుకు రావాలని కోరారు.

విలయంలో వెల్లివిరుస్తున్న మానవత్వం

తిరువనంతపురం: వరదలతో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు తనవంతు సాయంగా తన పొలంలో పండించిన అరటి గెలలను ఇచ్చి ఓ రైతు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. కేరళలో ఇడుక్కి జిల్లాలోని రాజక్కడ్ ప్రాంతానికి చెందిన అశోకన్ ఓ రైతు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయన అరటి పంట అంతా నాశనమైంది. అంతటి కష్టంలో కూడా వరదల వల్ల తిండి లేక అలమటిస్తున్న బాధితులకు ఏదైనా సాయం చేయాలని అశోకన్ నిర్ణయించుకున్నాడు. వరదల వల్ల నాశనమవగా మిగిలిన కొన్ని అరటి గెలలను ఆకలితో ఉన్న చిన్నారులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాడు. పంట మొత్తం మునిగి కష్టాల్లో ఉన్నప్పటికీ, సాటివారి కోసం ఆలోచించిన అశోకన్‌ను పలువురు అభినందిస్తున్నారు. మరోవైపు, వరదల్లో నష్టపోయిన కుటుంబాల్లోని చిన్నారులకు బట్టలు ఇచ్చేందుకు ఓ షాపు యజమాని ముందుకొచ్చారు. కట్టప్పన ప్రాంతంలోని రాజు అనే ఓ బట్టల దుకాణం యజమాని తన దగ్గరున్న డబ్బులతో పాటు ఆ ప్రాంత మున్సిపల్ చైర్మన్ సహకారంతో మరి కొంత డబ్బు జమచేసి వరద బాధిత చిన్నారులకు బట్టలను ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కాగా, రోడ్డు పక్కన బట్టలు అమ్మే నౌషద్ అనే వ్యాపారి తన దుకాణంలోని బట్టలన్నిటినీ వరద బాధితులకు ఇచ్చారు.

విభేదాలు వివాదాలు కావొద్దు!

- చైనాకు భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ
- చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ ఖ్విషాన్, విదేశాంగ మంత్రి వాంగ్ యీలతో భేటీ

చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ ఖ్విషాన్‌తో జైశంకర్

బీజింగ్: ద్వైపాక్షిక అంశాలపై తలెత్తే విభేదాలను వివాదాలు కానివ్వవద్దని చైనాకు భారత్ స్పష్టంచేసింది. భారత్, చైనా పరస్పరం తమ సమస్యలపై సున్నితంగా, సుహృద్భావంతో ముందుకెళ్లినప్పుడే రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలను నూతన శిఖరాలకు తీసుకెళ్లేందుకు వుహాన్ సదస్సులోని సానుకూల ఫలితాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. జమ్ముకశ్మీర్ విషయంలో తీసుకున్న నిర్ణయాలు పూర్తిగా భారత్‌కు సంబంధించినవేనని, కశ్మీర్ భారత్ అంతర్భాగమని పేర్కొన్నారు. చైనా పర్యటనలో ఉన్న జైశంకర్ భారత్-చైనా సాంస్కృతిక సమ్మేళనం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఇరు దేశాల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చైనా ప్రభుత్వంతో తన సమావేశాలు సానుకూలంగా జరిగాయన్నారు. చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ ఖ్విషాన్‌తో జరిగిన భేటీలో జైశంకర్ అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో జై శంకర్ సమావేశమయ్యారు. వారిద్దరూ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. 'మేం అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితులతోపాటు ఇరు దేశాల మధ్య చాలా ముఖ్యమైన ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించాం. ఈ ఏడాది చివరిలో భారత్‌లో చైనా అధ్యక్షుడు జరిపే పర్యటన, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 70 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న సంబురాల ఏర్పాట్లపై దృష్టి సారించాలని నిర్ణయించాం' అని జైశంకర్ వివరించారు. జమ్ముకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ఊసెత్తకుండా.. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలో భారత్ నిర్మాణాత్మక పాత్ర పోషించాలని వాంగ్ యీ కోరారు. ఆరోగ్య పరిరక్షణ, క్రీడలు, మ్యూజియంల నిర్వహణ, పరస్పర సాంస్కృతికాంశాల మార్పిడి అంశాలపై ఇరు దేశాలు ఒప్పందాలు చేసుకున్నాయి.

సంయుక్తంగా సినిమా వారోత్సవాలు

ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతానికి 100 కార్యక్రమాలను నిర్వహించాలని భారత్, చైనా నిర్ణయించాయి. అందులో భాగంగా సంయుక్తంగా సినిమా వారోత్సవం, మ్యూజియంల నిర్వహణ, సినిమాలు-ప్రసారాల్లో సహకారం, విద్య, అధ్యయన వేదికల మధ్య చర్చలతో ఇరుదేశాల ప్రజలమధ్య బంధం బలోపేతం చేయాలన్న ప్రతిపాదన వచ్చిందని జైశంకర్ చెప్పారు. కైలాస మానసరోవర్ యాత్రికులకు వసతి కల్పన, చైనా విప్లవ సమయంలో ఆ దేశంలో సేవలందించిన భారత డాక్టర్ ద్వారకనాథ్ శాంతారాం కోట్నిస్ భావాలను ముందుకు తీసుకెళ్లాలని, ఇరు దేశాల వైద్య బృందాలు సంయుక్తంగా రెండు దేశాల్లోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలందించాలన్న ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు.

భయమంటే తెలియదు!

- నాదెప్పుడూ సానుకూల దృక్పథమే.. నా దృష్టి మొత్తం దేశాభివృద్ధిపైనే!
- 'మ్యాన్ వర్సెస్ వైల్డ్'లో మోదీ

న్యూఢిల్లీ: తనకు భయం అంటే ఏంటో తెలియదని, తాను సానుకూల దృక్పథం కలిగిన వ్యక్తినని ప్రధాని మోదీ అన్నారు. డిస్కవరీ చానల్‌లో సోమవారం ప్రసారమైన అడ్వెంచర్ ప్రోగ్రామ్ 'మ్యాన్ వర్సెస్ వైల్డ్'లో ఆయన ఈ విషయాల్ని షో హోస్ట్(వ్యాఖ్యాత) బేర్ గ్రిల్స్‌తో పంచుకున్నారు.

అభివృద్ధే ధ్యేయం..

'నాకెటువంటి భయం, ఆందోళనలు లేవు. ఎ

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

సూర్యాపేట కలెక్టర్‌కు ధన్యవాదాలు

వాట్సప్‌లో మెసేజ్‌చేస్తే భూసమస్యను పరిష్కరించారు

మాది సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం అడ్లూరు. నాకు అడ్లూరులోని సర్వే నంబర్లు 85లో 2.24 ఎకరాలు, 178/9లో ఎకరం, 84/ఆలో 1.20 ఎకరాలు.. మొత్తం 5.04 ఎకరాల భూమి ఉన్న ది. ఈ భూమి మా నాన్న నుంచి వారసత్వంగా సంక్రమించింది. ఈ భూమిని నా పేరిట మార్చేందుకు రెండేండ్ల నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులకు పలు సార్లు అర్జీలు పెట్టుకొన్నాను. అయినా అధికారులు ఎవరూ స్పందించలేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వాట్సప్‌లో నా భూసమస్యను పోస్టు చేశాను. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. నా భూసమస్యను పరిష్కరించి నాకు రెండు రోజుల కింద పాస్‌పుస్తకం జారీచేశారు. కలెక్టర్ అమయ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. **- ఈపూరి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరు, సూర్యాపేట జిల్లా**

భూమి అన్నది.. పరిహారం తమ్ముడికి

- సమాచారం ఇవ్వకుండానే చెక్కు జారీచేసిన అధికారులు
- మొరపెట్టుకొన్నా పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లా బాధితుడు అంతిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అతనికి ఉన్నదే 39 గుంటల భూమి. ఆ భూమి కూడా ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి ఇవ్వాల్సి వచ్చింది. భూమి పోయినా ప్రభుత్వం పరిహారం ఇస్తుందని అనుకొన్నారు. కానీ రెవెన్యూ అధికారుల నిర్వాకంతో బాధితుడికి పరిహారం అందకుండాపోయింది. భూమి ఒకరి పేరిట ఉంటే.. పరిహారం మరొకరికి మంజూరుచేశారు. ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సిద్దిపేట జిల్లాములుగు మండలం తంకి బొల్లారం గ్రామానికి చెందిన బాధితుడు మ్యగన్నగారి అంతిరెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

'నా పేరు మ్యగన్నగారి అంతిరెడ్డి. నాకు సిద్దిపేట జిల్లా ములుగు మండలం తుంకి బొల్లారంలోని సర్వే నంబర్ 339/అ2లో వారసత్వంగా వచ్చిన 39 గుంటల భూమి ఉన్నది. 339 సర్వే నంబర్‌లో మా తండ్రి పేరిట 1.38 ఎకరాలు ఉండేది. దానిని నేను, మా తమ్ముడు సమానంగా పంచుకొన్నాం. దానికి సంబంధించి పాత పాస్‌పుస్తకాలు ఉండటంతోపాటు కొత్తవి కూడా మంజూరయ్యాయి. అయితే మా తండ్రి నుంచి మాకు సంక్రమించిన ఈ భూమి పేదల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం రెవెన్యూ అధికారులు సేకరించారు. భూమిని తీసుకొన్నా పరిహారం వస్తుందిలే అనుకొన్నాం. కానీ అధికారులు నాకు అన్యాయంచేశారు. నాకున్న 39 గుంటల భూమికి వచ్చే పరిహారాన్ని కూడా మా తమ్ముడి పేరిటే మంజూరుచేశారు. ఈ విషయంలో నాకు అన్యాయం జరిగిందని ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా అధికారులు లెక్కచేయడం లేదు. నేను అందుబాటులో లేనందునే తమ్ముడి పేరిట మంజూరుచేశామని దాటవేస్తున్నారు. స్థానికంగా గ్రామంలో లేనంత మాత్రా న నాకు రావాల్సిన పరిహారాన్ని మా తమ్ముడికి మంజూరుచేయడం దారుణం. కేవలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే నాకు అన్యాయం జరిగింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణచేసి నాకొచ్చే పరిహారం ఇప్పించాలి. లేకపోతే నా భూమినైనా తిరిగివ్వాలి.'

ఎంజాయ్‌మెంట్ సర్వే ఎలాచేశారో తెలియదు

సదరు భూమికి సంబంధించి రెండేండ్ల క్రితమే పరిహారం మంజూరైంది. అప్పుడు తాసిల్దార్‌గా నేనులేను. ఆ సమయంలో ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి అంతిరెడ్డి తమ్ముడికి పరిహారం మంజూరుచేశారు. ఏవిధంగా సర్వేచేసి పరిహారం చెల్లించారో, అప్పుడేం జరిగిందో నాకు తెలియదు. దీని గురించి ఆర్డీవోకు కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు.
- విజయ్‌కుమార్, ములుగు తాసిల్దార్

అప్పుడు వీఆర్వోగా నేనే ఉన్నా

ఎంజాయ్‌మెంట్ సర్వేచేసాకే అంతిరెడ్డి తమ్ముడి పేరిట పరిహారం మంజూరుచేశాం. సర్వేచేసినప్పుడు అంతిరెడ్డి రాలేదు. అప్పుడు నేనే వీఆర్వోగా ఉన్నాను. మేం సర్వేచేసి రిపోర్టు ఆర్డీవోకు పంపించాం. ఆ రిపోర్టు ఆధారంగా పరిహారం మంజూరైంది. అంతిరెడ్డికి డబ్బులిచ్చేందుకు ఆయన తమ్ముడు సిద్ధంగా ఉన్నారు. **- జయప్రకాశ్, వీఆర్వో**

పుట్టకముందే.. భూమి కొన్నాడట!

- 43 ఏండ్ల వ్యక్తి.. 46 ఏండ్ల క్రితం భూకొనుగోలు
- దశాబ్దం తర్వాత వెలుగులోకి
- జగిత్యాల జిల్లా రెవెన్యూ లీలలు
- లబోదిబోమంటున్న బాధితులు

బాధిత రైతులు దేశవేని భీమయ్య, దేశవేని లక్ష్మణ్, దేశవేని శకుంతల



కబ్జాదారు రాజిరెడ్డి వయసు 43గా చూపుతున్న ఓటరు జాబితా

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం పొలాసకు చెందిన దేశవేని రాజనర్సు, గంగారాం, భీమయ్యకు తమ తండ్రి ద్వారా సర్వే నంబర్ 639 లో 2.16 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఇందులో రాజనర్సు, గంగారాంలకు 24 గుంటల చొప్పున, భీమయ్యకు 1.08 ఎకరాల చొప్పున వచ్చింది. ఈ మేరకు వారికి పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయి. ముగ్గురు సోదరుల్లో రాజనర్సు, గంగారాం మరణించడంతో వారి వారసులు లక్ష్మణ్, శకుంతల పేరిట ఈ భూములు ఫౌతీ కూడా అయ్యాయి. పూట గడవని పరిస్థితుల్లో లక్ష్మణ్, శకుంతల, భీమయ్య ముగ్గురు కూడా ముంబైకి వెళ్లి కూలి పనిచేసుకొంటూ జీవిస్తున్నారు. లక్ష్మణ్, శకుంతల తమ భూములను రాజిరెడ్డి అలియాస్ తిరుపతిరెడ్డికి కౌలుకు ఇచ్చారు. భీమయ్య మాత్రం తన భూమిని ఎవరికీ కౌలుకు ఇవ్వకుండా పడావు పెట్టారు. కొంతకాలం తర్వాత లక్ష్మణ్ తనకున్న 24 గుంటల్లో పది గుంటలను, శకుంతల తన 24 గుంటల్లో 14 గుంటలను కౌలుదారు రాజిరెడ్డికే అమ్మారు. మిగతా 24 గుంటలు అమ్మలేదు. ఈ అమ్మకాలన్నీ సాదాబైనామా ద్వారానే జరిగాయి. ఇప్పటివరకు అంతా సవ్యంగానే జరిగింది. కొద్దిరోజుల క్రితం శకుంతల, లక్ష్మణ్ పొలాసకు వచ్చి మిగిలిన 24 గుంటల భూమిని సాగుచేసుకోవడానికి ప్రయత్నించగా.. రాజిరెడ్డి అడ్డుకొన్నారు. ఈ భూమి తనదని, పదేండ్ల క్రితమే తన పేరిట పట్టా అయిందని చెప్పాడు. తాము మొత్తం భూమిని అమ్మనప్పుడు పట్టా ఎలా మారుతుందంటూ బాధితులు అధికారులను విచారించగా అసలువిషయం బయటపడింది. శకుంతల, లక్ష్మణ్.. రాజిరెడ్డికి అమ్మిన భూమి 24 గుంటలే అయినా.. వారికి చెందిన మొత్తం 1.08 ఎకరాల భూమి అతని పేరిట మారింది. బీ/326/2008న ఆర్వోఆర్‌చేశారనీ, 2009 మార్చి 19న పట్టామార్పిడి అయినట్టు రికార్డులో ఉండటంతో శకుంతల, లక్ష్మణ్ లబోదిబోమంటున్నారు. భూమి తమదేనంటూ, ఇరువర్గాలూ మోఖాపైకి వెళ్లేందుకు యత్నించిన క్రమంలో పరస్పరం దాడి చేసుకోవడంతో కథ కాస్తా పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

భీమయ్య భూమీ హాంఫట్

ఇదే సందర్భంలో అధికారులు మరోమాయచేశారు. పక్కనే పడావుగా పడి ఉన్న దేశవేని భీమయ్య భూమి (1.08 ఎకరాలు)ని కూడా రెవెన్యూ సిబ్బంది రాజిరెడ్డికి రాసిచ్చారు. తమ భూమిని కోల్పోవడంతో ఆందోళన చెందిన లక్ష్మణ్, శకుంతల.. భీమయ్యకు సమాచారమివ్వడంతో అతను పరుగుపరుగున పొలాసకు వచ్చి ఆరా తీయగా తన భూమి మొత్తం రాజిరెడ్డి పరమైందని తెలిసింది. తాను ఎవరికీ అమ్మకుండా.. పట్టామార్పు ఎలా జరిగిందని ప్రశ్నించగా.. రెవెన్యూ అధికారుల లీలలు బయటపడ్డాయి. భీమయ్య 1973లో కొంత, 1980లో మరికొంత భూమిని రాజిరెడ్డికి అమ్మినట్టుగా సాదాబైనామా ఉన్నదని.. దాని ఆధారంగానే 2008లో పట్టామార్పిడి అయిందని అధికారులు చెప్పడంతో భీమయ్య బిక్కమొఖమేశారు.

పుట్టకముందే సాదాబైనామా

రెవెన్యూ అధికారులు దొంగ రికార్డులు సృష్టిస్తున్నప్పుడు.. తమను ఎవరేమంటారనుకొన్నారేమో.. ముందు వెనుక ఆలోచించకుండా తేదీలు.. సంవత్సరాలు వేసేశారు. మామూలుగా భూములు కొనాలంటే.. మేజర్ అయి ఉండాలి. మైనర్ అయితే గార్డియన్ ఉండాలి. ఇవేవీ వాళ్లకు గుర్తుకు రాలేదు. పొలాసలోని భీమయ్య భూమికి సంబంధించిన వ్యవహారంలో దొంగ సాదాబైనామా సృష్టించిన వ్యక్తులు ఏకంగా తాను పుట్టిన తేదీకి ఆరేండ్లకు ముందే భూమిని కొన్నట్టుగా రాశారు. అంతేకాదు.. అందులో సర్వే నంబర్లు లేవు.. ఎంత భూమి అమ్మారన్న వివరాలూ లేవు. కేవలం పేర్లతో మాత్రమే సాదాబైనామా రాశారు. 1973నాటి సాదాబైనామా ఒకటి కాగా.. 1980 సంవత్సరంతో మరో సాదాబైనామా సృష్టించారు. మొదటి సాదాబైనామా జరిగిన సంవత్సరానికి సదరు రాజిరెడ్డి పుట్టనే లేదు. రెండో సాదాబైనామా నాటికి శిశువుగా ఉన్నాడు. రాజిరెడ్డి ఓటర్ ఐడీ ప్రకారం అతని వయస్సు 43 సంవత్సరాలు. అంటే.. అతను పుట్టడానికి ముందే అతనిపేరు మీద భూమి కొన్నట్టు తొలి సాదాబైనామా పుట్టుకొచ్చింది. ఈ రెండు సాదాబైనామాల ఆధారంగా రెవెన్యూ అధికారులు డబ్బులు దండుకొని తప్పుడు మార్గంలో పట్టాచేశారన్నది స్పష్టమైంది. ఇంత గుడ్డిగా అధికారులు ఎలా వ్యవహరిస్తారని తోటి ఉద్యోగులే విస్తుపోతున్నారు.

మాజీ వీఆర్వోనే సూత్రధారి?

దేశవేని భీమయ్య, దేశవేని శకుంతల, దేశవేని లక్ష్మణ్‌కు సంబంధించిన భూముల పట్టాల మార్పు వెనుకాల పొలాస గ్రామంలో గతంలో వీఆర్వోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తి కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. పదేండ్ల క్రితం ఉద్యోగంలో ఉన్న సమయంలో, పట్టాదారులైన శకుంతల, లక్ష్మణ్, భీమయ్య స్థానికంగా లేకపోవడాన్ని ఆసరాచేసుకొని, సాదాబైనామాలతో వ్యవహారాన్ని గుట్టుగా చక్కబెట్టినట్టు తెలుస్తున్నది. పొలాసలో శకుంతల, లక్ష్మణ్, భీమయ్యవే కాకుండా అనేక మంది రైతులు సదరు వీఆర్వో వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు సమాచారం.

పరిశీలిస్తున్నాం

జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలో 629, 639 సర్వే నంబర్ భూముల వ్యవహారంలో సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమే. 639 సర్వే నంబర్ భూమిలోని 2.16 ఎకరాల భూమిని రౌతు రాజిరెడ్డి అనే వ్యక్తికి 2009లో పట్టాచేసినట్లు ఉన్నది. సాదాబైనామాల ద్వారా ఈ వ్యవహారం జరిగింది. ఈ విషయమై ప్రస్తుతం భీమయ్య, శకుంతల, లక్ష్మణ్ ఫిర్యాదుచేశారు. ఈ భూమికి సంబంధించి గతేడాది కోర్టులో సైతం సివిల్‌కేసు వేశారు. అది నడుస్తున్నది. అన్ని వివరాలనూ పరిశీలిస్తున్నాం. అన్ని కోణాల్లో పరిశీలించి, అర్హులకు న్యాయం చేస్తాం. తప్పుడు పద్ధతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకొంటాం.
- జీ శ్రీనివాసరావు, తాసిల్దార్, జగిత్యాల రూరల్

ఏండ్ల సమస్యలు తీరిపోతున్నాయి

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏండ్లుగా అనేక భూసమస్యలు పెరిగాయి. సీఎం కేసీఆర్ భూరికార్డుల ప్రక్షాళన చేపట్టిన తర్వాత కొంతవరకు పరిష్కారమైనా.. కొంతమంది అధికారుల అవినీతి కారణంగా కొన్ని సమస్యలు అలాగే ఉన్నాయి. రైతుల భూసమస్యలపై 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట'తో చాలావరకు పరిష్కారమవుతున్నాయి. రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారం చూపుతున్న 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు. **- కనుకు పద్మశ్రీను, అర్వపల్లి, సూర్యాపేట జిల్లా**

రెవెన్యూశాఖ ప్రక్షాళన గొప్ప విషయం

ఏండ్లుగా పరిష్కారం కాని రైతుల భూసమస్యలు 'ధర్మగంట' ద్వారా పరిష్కారమవుతున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ రెవెన్యూశాఖ ప్రక్షాళనకు పూనుకోవడం గొప్ప విషయం. అవినీతి వ్యవస్థను నిర్మూలించడానికి, ఇతర ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచడానికి ఈ ప్రక్షాళన ఎంతగానో ఉపయోగపడనున్నది. ఎంతోమంది నిరుపేద రైతుల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి. **-ఉగ్గిడి లింగయ్య. వేములపల్లి, నల్లగొండ జిల్లా**

సీఎం కేసీఆర్ కృషి అభినందనీయం

భూసమస్యల పరిష్కారానికి 'ధర్మగంట' రైతులకు అండగా నిలుస్తున్నది. రైతుల ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్. రెవెన్యూశాఖ ప్రక్షాళన ఇప్పటివరకు ఎవరూ చేయలేదు. రైతులను ఇబ్బందిపెడుతున్న రెవెన్యూశాఖను ప్రక్షాళనచేస్తేనే అధికారుల్లో మార్పు, వారిలో బాధ్యత పెరుగుతుంది. ఇందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయం.
- బల్గూరి విష్ణువర్ధన్, నర్సింహులగూడెం, నాంపల్లి, నల్లగొండ జిల్లా

అమెరికాలో ప్రత్యూష్ అంత్యక్రియలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ ఎంపీ నల్లమల గిరిప్రసాద్ మనువడు ప్రత్యూష్‌చంద్ర అంత్యక్రియలు సోమవారం అమెరికాలో పూర్తయ్యాయి. ప్రత్యూష్‌చంద్ర అమెరికాలో రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. ప్రత్యూష్ తల్లిదండ్రులు వనశ్రీ, సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ప్రమాదవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు అమెరికాకు వెళ్లారు.

ప్రముఖకవి సీవీ కృష్ణారావు కన్నుమూత

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రముఖకవి, 'నెలనెలా వెన్నెల' సాహిత్య సంస్థ వ్యవస్థాపకుడు చింతలపాటి వెంకట కృష్ణారావు (సీవీ కృష్ణారావు) ఆదివారం రాత్రి 9.30 గంటలకు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. కృష్ణారావు 1926 జూలై3న రుక్మిణమ్మ, వెంకటేశ్వరశర్మ దంపతులకు జన్మించారు. ఈయన రాసిన 'వైతరిణి' కవితా సంపుటి, మహారాష్ట్రలో భూకంపం వచ్చినప్పుడు రచించిన 'కిల్లారి' దీర్ఘకావ్యం ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. 'మాది మీ ఊరే మహారాజకుమారా?', 'అవిశ్రాంతం', 'రాస్తూ రాస్తూ' వంటి కవితా సంపుటాలతో తెలుగు సాహిత్యంపై తనదైన మద్రవేశారు. ప్రముఖ కవులు శివారెడ్డి, వీర్రాజు, నాళేశ్వరం శంకరం, సిద్ధార్థ, అంబటి సురేంద్రరాజు, యాకూబ్, రూప్‌కుమార్, చమన్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు.

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. నిరుపేదలకు తమకు తోచినంత దానం చేశారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హైదరాబాద్‌లోని మక్కామసీదు వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తోటివారిని ఆత్మీయ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

హంపి చూసేందుకు వెళ్లి వరదలో చిక్కారు

మూడు వందల మందిని రక్షించిన పోలీసులు

- గుట్టలపై పడిగాపులు కాస్తున్న మరో 300 మంది
- రాత్రి కావడంతో సహాయక చర్యలకు అంతరాయం
- బాధితుల్లో జూబ్లీహిల్స్‌కు చెందిన పది మంది

బడంగ్‌పేట: హంపి విహారయాత్రకు వెళ్లిన నగరానికి చెందిన పలువురు పర్యాటకులు అక్కడి వరదనీటిలో చిక్కుకొనిపోయారు. వరదలో దాదాపు 600 మంది చిక్కుకోగా.. స్థానిక పోలీసులు సుమారు 300 మందిని రక్షించినట్టు తెలిసింది. మిగతావారు అక్కడి గుట్టలపైనే ఉండిపోయి సహాయక చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. రాత్రి కావడంతో హెలికాప్టర్ దిగేందుకు అనువైన పరిస్థితులు లేకపోవడం వల్ల సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. బాధితుల్లో హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్ 10కి చెందిన పది మంది ఉన్నారు. తమను రక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు తమ బంధువులకు మెసేజ్‌ల ద్వారా కోరుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని హంపి తోపాటు తుంగభద్ర డ్యామ్‌ను చూసేందుకు ఎప్పటిమాదిరిగానే పర్యాటకులు తరలివచ్చారు. వీరిలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన పది మంది పర్యాటకులు కూడా ఈ నెల 8వ తేదీన హంపీ వెళ్లారు. 15న డ్యామ్ గేట్లు తెరుస్తామని ఇదివరకే ప్రకటించిన అక్కడి అధికారులు.. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగడంతో సమాచారం ఇవ్వకుండా గేట్లను ఎత్తారు. దాంతో డ్యామ్ కింది భాగంలో ఉన్న పర్యాటకులు సమీపంలోని గుట్టల వైపునకు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకొన్నారు. విషయం తెలుసుకొన్న కర్ణాటక ప్రభుత్వం హెలికాప్టర్ ద్వారా 300 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. చీకటిపడటం వల్ల హెలికాప్టర్ దిగేందుకు పరిస్థితులు అనుకూలించక సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరదలో చిక్కుకొన్న తమను కాపాడాలంటూ పలువురు నగర పర్యాటకులు మీర్‌పేటలో ఉండే ఎంపీటీసీ లలిత జగన్‌కు సమాచారం అందించారు. తిండిలేక, తాగేందుకు నీరు లేక అలమటిస్తున్నామని వారు బంధువులకు ఎస్సెమ్మెస్‌లు పంపారు. తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం అందించి తమను రక్షించాలని వారు కోరారు.

వరద సమస్యలను ఎదుర్కొంటాం

- ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం
- పది రోజుల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు సీఎం కేసీఆర్
- కృష్ణా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సోమవారం కృష్ణానది వరదలతో ముంపునకు గురైన నారాయణపేట జిల్లా హిందూపూర్‌లో పర్యటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు

నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరదల వల్ల సంభవించే ప్రాణ, పంట, ఆస్తి నష్టాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకొని, ప్రజలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, సాం స్కృతికశాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పది రోజు ల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనకు వస్తారని చెప్పారు. సోమవారం నారాయణపేట జిల్లాలో కృష్ణానది వరద తాకిడికి గురైన కృష్ణ, మాగనూరు, మక్తల్ మండలాల్లో ఆయన పర్యటించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కే వనజ, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ డాక్టర్ చేతనలతో కలిసి ఆయన ముంపునకు గురైన కృష్ణ మండలంలోని హిందూపూర్, వాసునగర్, టైరోడ్డు తోపాటు మక్తల్ మండలంలోని పస్పుల, పంచదేవ్‌పహాడ్ గ్రామాల్లో పర్యటించారు. వరద తీవ్రతను అంచనావేశారు. అధికారులు, వరద బాధితులతో మాట్లాడి వరద ఇబ్బందులను తెలుసుకున్నారు. హిందూపూర్, పస్పులలో బోట్‌లో ప్రయాణించి వరద పరిస్థితులను అంచనావేశారు. అనంతరం కృష్ణ మండలం కున్సీ గ్రామంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులను కలిశారు. వైద్యసిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి హామీఇచ్చారు. హిందూపూర్ గ్రామస్థులు వరద తాకిడికి గురికాకుండా ఎత్తైన ప్రాంతంలో ఉన్న మూడెకరాల స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్ల ను నిర్మించి ఇస్తామన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో ఇండ్ల నిర్మాణ పనులను 15 రోజుల్లోనే ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. టైరోడ్డు వద్ద ఎన్‌హెచ్-167 వరద తీవ్రతకు దెబ్బతినే అవకాశం ఉన్నందున, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రు. కార్యక్రమంలో టీఎస్ టీపీసీ చైర్మన్ దేవరి మల్లప్ప, జెడ్పీ సీఈవో కాళిందిని, ఆర్డీవో శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ పీ నర్సింహగౌడ్, మాగనూరు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, కృష్ణ జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, మక్తల్ ఎంపీపీ వనజమ్మ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా నిషేధిత సిగరెట్ల పట్టివేత

శంషాబాద్, ఆగస్టు 12: హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం ఎయిర్ ఇంటెలిజెన్స్ అధికారులు భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న విదేశీ నిషేధిత సిగరెట్లను పట్టుకున్నారు. దుబాయి నుంచి ఎయిరిండియా 951, ఎయిరిండియా 977 విమానాల్లో సుమారు 16 మంది హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. వారిపై అనుమానం రావడంతో అధికారులు తనిఖీ చేశారు. వారి వద్ద రూ.21 లక్షల విలువ చేసే 2.10 లక్షల నిషేధిత విదేశీ సిగరెట్లు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకున్న ఎయిర్ ఇంటెలిజెన్స్ అధికారులు.. స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగు ఇండ్లు దగ్ధం

ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు ఇండ్లు దగ్ధం కాగా దాదాపు రూ.8 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. మావల మండల కేంద్రం లో జక్కుల సురేందర్, ఆనంద్, మహబూ బా, కిష్టు ఇండ్లు పక్కపక్కనే ఉన్నాయి. మహబూబా మినహా మిగతా వారంతా రోజు మా దిరిగా పొలం పనులకు వెళ్లారు. బక్రీద్ సందర్భంగా మహబూబా ప్రార్థన చేసుకొని సమీప బంధువుల ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆయన ఇంట్లో నుంచి ముందుగా మంటలు లేచి.. క్రమంగా పక్కనే గల మరో మూడు ఇండ్లకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీటీసీ నల్ల వనితబాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

భూవివాదం.. అంత్యక్రియలకు ఆటంకం

రెండు గ్రామాల మధ్య సమస్యగా చెరువుశిఖం

ఐనవోలు: రెండు గ్రామాల మధ్య రాజుకున్న భూవివాదం మృతదేహం అంత్యక్రియలకు ఆటంకంగా మారిన వైనం వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం నర్సింహులగూడెం, ముల్కలగూడెం మధ్య చోటుచేసుకున్నది. ముల్కలగూడెం గ్రామానికి చెందిన శ్మశానం చెరువు శిఖంలో ఉంది. నాలుగు దశాబ్దాలుగా ఇక్కడే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. సోమవారం ముల్కలగూడెంకు చెందిన దోమల నర్సమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని శ్మశానానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో నర్సింహులగూడెంకు చెందిన కొందరు ఆ భూమిని సాగు చేస్తున్నామనీ.. అంత్యక్రియలు చేయొద్దని అడ్డుతగిలారు. స్థానికుల సమచారంతో ఎస్సై నర్సింహారావు అక్కడికి వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

epaper.ntnews.com

శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం కిక్కిరిసిపోయింది. ఆలయ ధర్మగుండంలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. 25 వేల మందికి పైగా తరలిరాగా, రూ.21 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

- వేములవాడ కల్చరల్

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధిలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అష్టోత్తర శతకలశాభిషేకం, పవిత్రారోహణ వేడుక వైభవంగా నిర్వహించారు. అంతరాలయంలో మూలమూర్తులకు మహాకుంభప్రోక్షణ జరిపి, యాగశాలలో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను సాయంత్రం గోదావరిలో నిమజ్జనం చేశారు.

-భద్రాచలం

వచ్చే మూడ్రోజులు వానలు

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం: వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్: రాగల మూడ్రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈశాన్య బంగాళాఖాతం, దానిని ఆనుకొని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఉదయం పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీనికి అనుబంధంగా 7.6 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది రాగల 48 గంటల్లో మరింత తీవ్రంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఫలితంగా తెలంగాణలో రాగల మూడ్రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించారు. ఒకట్రెండు రోజులు కొన్నిచోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాగల మూడ్రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

వేములవాడలో భారీ వర్షం

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా సోమవారం జల్లులతో మొదలై ఓ మోస్తరు వర్షం కురవగా, కోనరావుపేట, చందుర్తి, వేములవాడ రూరల్, పట్టణ ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వేములవాడలో సాయంత్రం కూడా వర్షం కురవగా రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులు తడిసిముద్దయ్యారు. అత్యధికంగా మల్లారంలో 50 మి.మీ., వేములవాడలో 37 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా సిరికొండ ప్రాంతంలో భారీ వర్షాలు కురవగా నిమ్మపల్లి చెరువు పూర్తిస్థాయిలో వరద నీటితో నిండి మత్తడి పోస్తుండటంతో మూలవాగు పరీవాహక ప్రాంతం జలకళను సంతరించుకున్నది. మూడేండ్ల తర్వాత మూలవాగుకు భారీ వరదనీరు చేరుకోవడంతో వేములవాడ పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. మెదక్ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.

గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల సోమవారం తేలికపాటి జల్లులు కురిశాయి. పురానాపూల్, రాజేంద్రనగర్, శివరామ్‌పల్లి, బహదూర్‌పురా, జియాగూడ, కార్వాన్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, ఖైరతాబాద్, మాదాపూర్, బేగంపేట, కాప్రా, నేరేడ్‌మెట్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

దళిత యువతకు సర్కార్ దన్ను

- ప్రత్యేక శిక్షణతో ఉద్యోగావకాశాల కల్పన
- వృత్తివిద్య శిక్షణతో నైపుణ్యం మెరుగు
- ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫినిషింగ్ స్కూల్ తర్ఫీదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని దళిత యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేకంగా కృషి చేస్తున్నది. ఎస్సీ యువత ఆర్థిక ప్రగతికి ఒకవైపు స్వయం ఉపాధి రుణాలు అందించడమే కాకుండా.. వృత్తి విద్య కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. మోటార్ డ్రైవింగ్, ఆటోమొబైల్, మొబైల్ మరమ్మతు, ఆటోమొబైల్ సర్వీసింగ్ సెంటర్, టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ టెక్నాలజీ, ప్లంబింగ్, కంప్యూటర్ శిక్షణ, ఎయిర్ హోస్టెస్, చెఫ్, పంచకర్మ ఆయుర్వేద వైద్యం, హెల్త్ కేర్ వంటి పలు రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు. సమాజంలో వస్తున్న మార్పులు, ఆయా రంగాల్లో ఉండే ఉద్యోగావకాశాలను దృష్టిలో ఉంచుకొని కొత్త అంశాల్లోనూ శిక్షణ అందించడంపై శ్రద్ధ తీసుకొంటున్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి గత జులై చివరి నాటికి 3,915 మందికి ఉద్యోగ, ఉపాధి నైపుణ్య శిక్షణ అందించారు. ఇందుకు ప్రభుత్వం రూ.18.39 కోట్లు వెచ్చించింది.

వంద శాతం సబ్సిడీతో ఉచిత శిక్షణ

ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్న ఎస్సీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి.. తద్వారా ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఇప్పించేందుకు కృషిచేస్తున్నారు. అలాగే స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. దళిత యువకుల ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ.. వంద శాతం సబ్సిడీతో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాలు దొరుకనివారికి ఫినిషింగ్ స్కూల్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. సీఏపీ, సీఐపీఈటీ, డీబీటెక్, డాటాప్రో, ఎలక్ట్రానిక్ హౌస్‌వైరింగ్, జనరల్ వర్క్స్, సూపర్‌వైజర్, పీఎల్‌ఈ, ఎస్‌సీఏడీఏ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు జీడీఏ, నర్సింగ్, హాస్పిటాలిటీ, ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వే, టైలరింగ్, కంప్యూటర్, ఇండస్ట్రియల్ ఆటోమెషిన్ ట్రైనింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల వివరాలు

ఆర్థిక సంవత్సరం	శిక్షణ పొందిన వారి సంఖ్య	శిక్షణా వ్యయం రూ.కోట్లల్లో
2014-15	61	0.11
2015-16	626	1.29
2016-17	197	0.34
2017-18	1,222	5.50
2018-19	1,653	10.20
2019-20	156	0.95
మొత్తం	3,915	18.39

దళితులకు దన్నుగా నిలుస్తున్నాం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దళితులకు దన్నుగా నిలిచేలా కార్యక్రమాలు చేపడుతూ సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా చేస్తున్నాం. ఇంజినీరింగ్ పూర్తిచేసుకొని ఉద్యోగావకాశాలు దక్కని నిరుద్యోగ ఎస్సీ యువతకు ఫినిషింగ్ స్కూల్ కార్యక్రమం ద్వారా నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ఈ శిక్షణకు ఒక్కో విద్యార్థిపై రూ.57వేల నుంచి రూ.92వేల వరకు ఖర్చు చేస్తున్నాం. వృత్తి నైపుణ్య శిక్షణతో ఎస్సీ నిరుద్యోగులకు భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నది.

- కొప్పుల ఈశ్వర్, సంక్షేమశాఖ మంత్రి

సాగర్ ప్రవాహంలో వ్యక్తి గల్లంతు

నందికొండ: నాగార్జున సాగర్ డ్యాం క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీటిని చూడటానికి వచ్చిన వ్యక్తి గల్లంతయ్యాడు. విజయపురి టౌన్ ఎస్సై శీనయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జహీరాబాద్‌కు చెందిన నర్సింహ (45) మేస్త్రీ పని చేస్తుంటాడు. స్నేహితులతో కలిసి సోమవారం సాగర్ సందర్శనకు వచ్చాడు. పైలాన్ శివాలయం పుష్కర్‌ఘాట్‌లో స్నానానికి దిగిన సమయంలోక్రస్ట్ గేట్ల నుంచి వచ్చిన వరద ఉధృతికి గల్లంతయ్యాడు. నర్సింహ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సెల్ఫీ దిగుతూ గాయాలు..

గుంటూరు జిల్లా గురజాలకు చెందిన షేక్ నాగుల్ మీరా(35) రైట్ బ్యాంక్ ఆంధ్రా ప్రాంతం పాతబ్రిడ్జి వద్ద సెల్ఫీ దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు 25 అడుగుల ఎత్తు నుంచి నదిలో ఉన్న రాళ్లపై పడటంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక మాచర్ల దవాఖానకు తరలించినట్టు స్థానిక ఎస్సై పాల్ రవీందర్ తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి. చిత్రంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ తదితరులు

సాహితీలోకానికి కూరెళ్ల కృషి అమోఘం

- సాహిత్య అకాడమీ చైర్మన్‌నందిని సిధారెడ్డి

భువనగిరి, నమస్తే తెలంగాణ: సాహితీ లోకానికి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య విశేష కృషి చేశారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. దాశరథి పురస్కారంఅందుకున్న సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా సాహిత్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యాదాద్రి-భువనగిరి జిల్లా రాయగిరిలో సోమవారం కూరెళ్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిధారెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూరెళ్ల మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు.మరుగున పడ్డ కవులను వెలుగులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం బృహత్ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని నందిని సిధారెడ్డి అన్నారు. విఠలాచార్య కవితల్లో ఆర్తి ఉందని, పల్లె కవితలు సరళంగా అర్థమయ్యేరీతిలో విశదీకరించగల నేర్పరి అని కొనియాడారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి, సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవులు లింగంపల్లి రామచంద్ర, తూర్పు మల్లారెడ్డి, ఎస్ హరగోపాల్, డాక్టర్ బెల్లి యాదయ్య, గంటా జలంధర్‌రెడ్డి, తండు కృష్ణకౌండిన్య, సామ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రగతిసింగారానికి సీఎం కేసీఆర్

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ : ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 14న వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం ప్రగతిసింగారానికి రానున్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తండ్రి మల్లారెడ్డి ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం దశదినకర్మ కార్యక్రమానికి సీఎం హాజరై ఎమ్మెల్యేను పరామర్శించనున్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఓ కార్యక్రమానికి హాజరై అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ప్రగతిసింగారానికి రానున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరిత, సీపీ డాక్టర్ విశ్వనాథ రవీందర్ హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

అదుపు తప్పి.. గోడెక్కి

- కిరాణ దుకాణంపైకి దూసుకెళ్లిన కారు
- సైకిల్‌ను తప్పించే క్రమంలో ఘటన

గన్నేరువరం: సైకిల్‌ను తప్పించబోయి ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న దుకాణం గోడపైకి దూసుకెళ్లిన ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో రాజీవ్ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకున్నది. దాదాపు 30 నిమిషాలు కారు అలానే గోడపైన ఉండగా, అందులో ఉన్నవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడిపారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు గుండ్లపల్లి స్టేజీ వద్ద సైకిల్‌పై వెళ్తున్న సఫియన్ మహ్మద్ అనే బాలుడిని తప్పించే క్రమంలో అతడిని ఢీకొట్టి అదుపు తప్పింది. అక్కడే ఉన్న ఓ పార్టీ జెండా గద్దెను ఢీకొని గాలిలోకి లేచి కిరాణ దుకాణంపైకి దూసుకెళ్లింది. స్థానికులు, పోలీసులు స్థానిక టోల్ ప్లాజా క్రేన్ సహాయంతో వారిని కిందకు దించారు. కారులో ఉన్న నర్సింగ్ భూషణ్, స్వరూప, ఉప్పల విజయకు తీవ్ర గాయాలు కాగా, నర్సింగ్ వెంకటాచారి, సచీంద్రాచారి, సరోజకు స్వల్ప గాయాలయ్యాయి. సైకిల్‌పై ఉన్న బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్ దవాఖానకు తరలించారు.

కరీంనగర్ జిల్లా గుండ్లపల్లిలో రాజీవ్ రహదారిపై అదుపుతప్పి కిరాణ దుకాణంపైకి దూసుకెళ్లిన కారు

కారు బోల్తా.. ముగ్గురి దుర్మరణం

- మృతుల్లో తల్లిదండ్రులు, కొడుకు
- రాజీవ్ రహదారిపై ఘోరం

శామీర్‌పేట: కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు రాజీవ్ రహదారిపై వెళ్తున్న కారు (టీఎస్08ఎఫ్‌వీ 3005) శామీర్‌పేట తాసిల్దార్ కార్యాలయం వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొడుతూ వెళ్లి హైదరాబాద్ నుంచి గజ్వేల్ వైపు వస్తున్న మరో కారు(టీఎస్ 36ఈ 7111)ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ వైపు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న నాగోల్ బండ్లగూడకు చెందిన కిశోరాచారి(48), ఆయన భార్య భారతి(40), కొడుకు సుధాన్షు(20) అక్కడికక్కడే మృతిచెందగా, మరో కొడుకు తనూష్(12)కు తీవ్రగాయాలయ్యాయి. ముందు సీటులో కూర్చున్న భారతి మృతదేహం కారు బానెట్‌పై వచ్చి పడింది. మరో కారులో ప్రయాణిస్తున్న గజ్వేల్ ప్రాంతానికి చెందిన రాజు, మహేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కార్లను పక్కకు తొలిగించారు. క్షతగాత్రులను అల్వాల్ జూబ్లీ దవాఖానకు తరలించారు. మృతుడు కిశోరాచారిని నాగోల్ డివిజన్ బీజేపీ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా పోలీసులు గుర్తించారు.

ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగిస్తున్న పోలీసులు

రైలు కింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

సంగెం: రైలు కింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. సంగెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ కోడూరి సదయ్య-రజిత దంపతుల కుమారుడు ప్రణీత్(21) నర్సంపేట జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (సీఎస్‌సీ) సెకండియర్ చదువుతున్నాడు. ఫస్టియర్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిలయ్యాడు. సోమవారం ఉదయం స్నేహితుడి బైక్ మీద సంగెం నుంచి చింతలపల్లి రైల్వేగేట్ సమీపంలోని వరంగల్-విజయవాడ రైల్వేలైన్ వద్దకు వెళ్లాడు. అక్కడ కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడి విజయవాడ నుంచి వరంగల్ వైపు వస్తున్న గూడ్స్‌రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

జోగుళాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గుర్రంగడ్డను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మరబోటుతో కృష్ణానదిలో ప్రయాణం.. గ్రామంలో పర్యటన

జోగుళాంబ గద్వాలప్రతినిధి, నమస్తేతెలంగాణ: జలదిగ్బంధమైన జోగుళాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామాన్ని ఆదుకుంటామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణానది మధ్యలో ఉన్న గుర్రంగడ్డ పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోగా.. ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న కృష్ణానదిని సోమవారం ఎమ్మెల్యే మరబోటులో ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. వరదనీటితో బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులకు ధైర్యం చెప్పి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. వరద ప్రవాహం తగ్గిన వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు వంట సామగ్రి, సిలిండర్లు, కిరోసిన్, తాగునీటిని, నిత్యావసర సరుకులను సరఫరా చేస్తామని గ్రామస్తులకు హామీఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

వెన్నెల కుటుంబానికి అండగా ఉంటాం

- దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

భీమారం(వరంగల్): కామాంధుల చేతిలో లైంగికదాడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డ వెన్నెల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామనీ, దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన వెన్నెల కుటుంబాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి నానమ్మ లక్ష్మిని ఓదార్చారు. వెన్నెలకు జరిగిన ఘోరాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా, న్యాయపరంగా ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక కమిటీలను వేస్తామని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

వెన్నెల నానమ్మతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కుటుంబ సభ్యుల సాయంతో సోమవారం వాగు దాటుతున్న బాలింత. (ఇన్‌సెట్)లో చంటిబిడ్డతో నిర్మల

వాగు దాటి.. బిడ్డకు జన్మనిచ్చి

గుండాల: ఓ గర్భిణి వాగుదాటి దవాఖానకు చేరుకొని పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మల్లన్న వాగు అవతలి గ్రామమైన కన్నాయిగూడేనికి చెందిన నిండు గర్భిణి నిర్మలకు ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యుల సహకారంతో ఉధృతంగా పారుతున్న మల్లన్న వాగు దాటి.. అవతలి ఒడ్డున ఉన్న 108 వాహనంలో గుండాల ప్రాథమిక వైద్య కేంద్రానికి చేరుకున్నది. వైద్యులు సోమవారం ఉదయాన్నే ప్రసవం చేయగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తరువాత నిర్మలకు కేసీఆర్ కిట్ అందించారు. ఆ తర్వాత బాలింత తన కుటుంబ సభ్యులతో అదే వాగు దాటి ఇంటికి చేరుకున్నది.

నీలిచిత్రాలు చూపిస్తూ.. బాలికపై లైంగిక వేధింపులు

సిరిసిల్లక్రైం: సెల్‌ఫోన్‌లో నీలి చిత్రాలను చూపిస్తూ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఓ బాలిక(9) అదే కాలనీలో తమకు పరిచయస్తుడైన గణేశ్(40) ఇంటికి సోమవారం వెళ్లింది. ఈ క్రమంలో బాలికకు సెల్‌ఫోన్‌లోని నీలిచిత్రాలు చూపిస్తూ గణేశ్ వెకిలి చేష్టలకు పాల్పడగా, భయపడిన బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు, స్థానికులు గణేశ్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో గణేశ్

నాలుగేండ్ల చిన్నారిపై లైంగికదాడి

- వికారాబాద్ జిల్లాలో ఘటన

తాండూరు, నమస్తేతెలంగాణ: నాలుగేండ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రోజు మాదిరిగా ఈనెల 9న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వచ్చిన చిన్నారి.. ఇంటి ఎదుట ఆడుకుంటుండగా మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన నగేశ్ (22) మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరువాత రోజు చిన్నారి ఏడ్వడంతోపాటు తీవ్ర జ్వరం రావడంతో గమనించిన తల్లిదండ్రులు ఏమైందని పాపను ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. చిన్నారి తల్లిదండ్రులు, గ్రామస్థులు.. నగేశ్‌ను పిలిచి నిలదీయగా జరిగిన విషయాన్ని ఒప్పుకొన్నాడు. బాధిత తల్లిదండ్రులు సోమవారం పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం జిల్లాకేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించినట్టు తాండూరు డీఎస్పీ రామచంద్రుడు తెలిపారు. లైంగికదాడికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

హైదరాబాద్ ఆణిముత్యాలు

ఆసియా, ఓషియానా రెగెట్టా టోర్నీకి ఎంపికైన ప్రీతి, ఝాన్సీ, లక్ష్మి

అంచలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి యువ సెయిలర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: సెయిలింగ్.. అలలకు ఎదురొడ్డి నిలుస్తూ గాలివాటాన్ని అనుకూలంగా మలుచుకుంటూ గమ్యాన్ని చేరే సాహస క్రీడ. ఏ మాత్రం పట్టు తప్పినా ఫలితం అందకుండా పోయే ఆట. మరి అలాంటి సెయిలింగ్‌లో ప్రత్యర్థులకు దీటుగా నిలుస్తూ రాణించడమంటే మామూలు విషయం కాదు. కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు మన హైదరాబాదీ ఆణిముత్యాలు ప్రీతి కొంగర, ఝాన్సీ ప్రియ, లక్ష్మీ నూకరత్నం. దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినా సాధించాలన్న ఏకైక లక్ష్యంతో సెయిలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుని ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు వీరు. కష్టాలకు ఎదురొడ్డి నిలుస్తూ సాహసమే ఊపిరిగా పతకాలు కొల్లగొడుతూ రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. ఒమన్ వేదికగా సెప్టెంబర్ 30 నుంచి మొదలయ్యే ఆసియా, ఓషియానా రెగెట్టా చాంపియన్‌షిప్ టోర్నీకి ప్రీతి, ఝాన్సీ, లక్ష్మి ఎంపికై తమ సత్తాచాటారు. ఇటీవల జరిగిన 11వ హైదరాబాద్ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో మెరిశారు. ముఖ్యంగా జాతీయ ర్యాంకింగ్ మాన్‌సూన్ రెగెట్టాలో ప్రీతి పసిడి పతకం కొల్లగొట్టింది.

అంతర్జాతీయ టోర్నీకి తొలిసారి: ఒమన్ వేదికగా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా ఓషియానా చాంపియన్‌షిప్‌నకు ప్రీతి, ఝాన్సీ, లక్ష్మి తొలిసారి ఎంపికయ్యారు. నిలకడైన ప్రదర్శనను పరిగణనలోకి తీసుకున్న సెలెక్టర్లు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించారు. దేశం తరపున మొత్తం 10 మంది సెయిలర్లు బరిలోకి దిగనుండగా, అందులో ఆరుగురు హైదరాబాద్ వాళ్లే కావడం గర్వంగా ఉందని యాచ్ క్లబ్ అధ్యక్షుడు సుహేమ్ షేక్ అన్నారు. 'ముఖ్యంగా మన హైదరాబాద్ నుంచి ముగ్గురు బాలికలు ఎంపిక కావడం కష్టానికి తగిన గుర్తింపు నిచ్చింది. సరిగ్గా మూడేండ్ల క్రితం నావికా ప్రాజెక్ట్ ద్వారా కొంత మంది అమ్మాయిలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. అందులో ప్రీతి, ఝాన్సీ, లక్ష్మి అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నారు. టోర్నీ టోర్నీకి మెరుగవుతూ తొలిసారి అంతర్జాతీయ వేదికపై పోటీపడబోతున్నారు' అని షేక్ అన్నారు.

పేదరికాన్ని జయిస్తూ

సెయిలింగ్‌లో సంచలనాలు సృష్టిస్తున్న ప్రీతి, ఝాన్సీ, లక్ష్మి పేదరికాన్ని ఎదిరించి ఈ స్థాయికి ఎదిగారు. ఏదైనా సాధించగలమన్న పట్టుదలకు తోడు కఠోర శిక్షణతో రాష్ట్ర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేస్తున్నారు. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ప్రీతి ప్రస్తుతం 10వ తరగతి చదువుతుండగా, సికింద్రాబాద్‌లోని ఉద్భవ్ స్కూల్‌లో లక్ష్మి తొమ్మిది, ఝాన్సీ ఎనిమిదో తరగతులు చదువుతున్నారు. అటు విద్యతో పాటు సెయిలింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. రానున్న ఆసియా, ఓషియానా టోర్నీలోనూ పతకాలతో మెరువాలని ఆశిద్దాం.

క్రికెట్ బంతుల్లో మైక్రోచిప్‌లు



మెల్‌బోర్న్: ఇటీవలి కాలంలో క్రికెట్‌లో సాంకేతికత కీలకంగా మారింది. నూతన ఆవిష్కరణలు ఎన్నో వస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగా క్రికెట్ బంతులు త్వరలో స్మార్ట్‌గా మారనున్నాయి. మైక్రోచిప్‌లతో కూడిన బంతులను ఇప్పటికే ఆస్ట్రేలియాకు చెందిన కూకబుర్రా సంస్థ తయారు చేసి, పరీక్షిస్తున్నది. వచ్చే వేసవిలో జరిగే ఆసీస్ టీ20 లీగ్ బిగ్‌బాష్‌లో వీటిని ప్రవేశపెట్టే అవకాశముంది. ఈ స్మార్ట్ బంతులు... బౌలర్ బంతిని విడిచే స్థానం దగ్గర నుంచి వేగం, బౌన్స్ తదితర అంశాలను సాధారణ రాడార్ కన్నా మరింత కచ్చితత్వంతో అందిస్తాయని కూకబుర్రా ప్రకటించింది. ఈ బంతులు అంపైర్ నిర్ణయ సమీక్ష(డీఆర్ఎస్) లోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే క్యాచ్‌ల విషయంలో నిర్ణయం కష్టమైనప్పుడూ సహకరిస్తాయి. ఈ స్మార్ట్ బాల్స్.. చూసేందుకు సాధారణ కూకబుర్రా బంతుల్లాగే ఉంటాయి.

ఎంజాయ్ చేయాలనుకుంటా : కోహ్లీ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ : టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. మైదానంలోనూ, బయట ఎంత సరదాగా ఉంటాడో అందరికీ తెలిసిందే. ఇక పార్టీల్లో, ప్రత్యేక సందర్భాల్లో ఎన్నోసార్లు డ్యాన్స్‌లు చేశాడు. ఇటీవలే గయానాలో తొలి వన్డేకు వర్షం అంతరాయం కలిగించిన సందర్భంలో వెస్టిండీస్ ఆటగాడు గేల్‌తో కోహ్లీ.. కరీబియన్ పాటకు మైదానంలోనే స్టెప్పులేశాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లోనూ చక్కర్లు కొట్టింది. ఆ సరదా ఘటనపై చాహల్‌కు సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ స్పందించాడు. ఈ వీడియోను బీసీసీఐ పంచుకుంది. 'సంగీతం విన్నప్పుడల్లా నేను మంచి అనుభూతిని పొందుతా. ప్రతీసారి డ్యాన్స్ చేస్తున్నట్టే ఫీలవుతా. మైదానంలో నేను ఎంజాయ్ చేయాలనుకుంటా. నేను కెప్టెనా.. కాదా అన్నది పట్టించుకోను. దేవుడు అద్భుతమైన జీవితాన్ని ఇచ్చాడు. దేశం తరపున ఆడే అవకాశాన్ని ఇచ్చాడు. అందుకే అవకాశం వచ్చిన చిన్నచిన్న సందర్భాల్లోనూ ఎంజాయ్ చేయడం ఎంతో ముఖ్యమని భావిస్తా' అని కోహ్లీ చెప్పాడు. విండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో వర్షం కారణంగా మొదటిది రద్దు కాగా.. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో కోహ్లీ(120) శతకంతో చెలరేగిన విషయం తెలిసిందే. అయితే, తాను 65 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉన్నప్పుడు ఎంతో అలిసిపోయినట్టు అనిపించిందని కోహ్లీ చెప్పాడు. అప్పుడు వాతావరణం ఎంతో వేడిగా, ఉక్కపోతగా ఉందని చెప్పాడు. జట్టు అప్పుడున్న పరిస్థితుల కారణంగా భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిందేనని పట్టుదలతో ముందుకు సాగినట్టు కోహ్లీ వెల్లడించాడు.

'నాలుగుకు' అయ్యరే బెస్ట్

న్యూఢిల్లీ : ఏడాది తర్వాత జట్టులోకి వచ్చి.. వెస్టిండీస్‌తో రెండో వన్డేలో అద్భుతంగా రాణించిన శ్రేయస్ అయ్యర్(71)పై ప్రశంసల వర్షం కురుస్తున్నది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానానికి అయ్యర్ సరైన ఆటగాడని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. అతడిని నాలుగులో పంపి, మిడిల్‌ఆర్డర్‌లో రిషభ్ పంత్‌కు ఓ స్థానాన్ని కేటాయించాలని సూచించాడు. 'ధోనీ లాగే పంత్‌ను కూడా ఫినిషర్‌లా ఐదు లేదా ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు పంపాలి. అదే అతడి సాధారణ ఆట. ఒకవేళ టాపార్డర్ బాగా ఆడి మ్యాచ్ 40 ఓవర్ల వరకు వస్తే అప్పుడు పంత్ నాలుగో స్థానంలో వస్తే బాగుంటుంది. కానీ 30-35 ఓవర్లు మిగిలి ఉంటే మాత్రం ఆ స్థానానికి శ్రేయస్ సరైన ఆటగాడు. పంత్ ఆ తర్వాత రావాలి' అని గవాస్కర్ అన్నాడు. అయ్యర్‌ను నాలుగో స్థానంలో పంపుతారని అందరూ భావించిన తరుణంలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో మేనేజ్‌మెంట్ పంత్‌వైపే మొగ్గు చూపిన విషయం తెలిసిందే. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన అయ్యర్ 71 పరుగులు చేయడం సహా కెప్టెన్ కోహ్లీతో కలిసి 125 పరుగులు భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జట్టు 279 పరుగుల స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. 'నాన్‌స్ట్రయికర్ నుంచి ఎంతో ఆటను నేర్చుకోవచ్చు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ మరో ఎండ్‌లో ఉండగా శ్రేయస్ అయ్యర్ అదే చేశాడు. ఈ ప్రదర్శనతో జట్టులో అతడి స్థానం పదిలమవుతుందనుకుంటున్నా' అని సన్నీ అన్నాడు.

బాగా ఆడతానని తెలుసు : అయ్యర్

వెస్టిండీస్‌తో రెండో వన్డేలో చేసిన ప్రదర్శన ద్వారా జట్టులో తన స్థానం పదిలంగా ఉంటుందని భావిస్తున్నట్టు అయ్యర్ తెలిపాడు. తాను తుదిజట్టులో ఉండి, నిలకడగా రాణించాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పాడు. 'నేను ఇక్కడ(విండీస్‌లో) బాగా ఆడతానని తెలుసు. ఇండియా 'ఏ' తరపున ఈ మైదానాల్లోనే ఆడా. ఇన్నింగ్స్‌లో ఎలాంటి రిస్క్ తీసుకోకూడదని అనుకున్నా. చివరి దాకా భాగస్వామ్యం ఉండాలని విరాట్ చెప్పాడు. అతడు నాకెంతో మద్దతునిచ్చాడు. మేం సింగిల్స్, డబుల్స్ తీశాం. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదాం. 250 పరుగులు సరిపోతాయని భావించినా, ఎక్కువ పరుగులే వచ్చాయి. నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నా' అని శ్రేయస్ అన్నాడు.

టైటాన్స్ రెండో 'టై'

బెంగాల్‌తో మ్యాచ్ సమం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో భాగంగా గత మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌పై గెలిచి తొలి విజయాన్ని నమోదు చేసుకున్న తెలుగు టైటాన్స్.. సోమవారం మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. బెంగాల్ వారియర్స్‌తో ఇక్కడ జరిగిన మ్యాచ్‌ను టైటాన్స్ 'టై'గా ముగించింది. నిర్ణీత సమయంలో ఇరుజట్లు 29-29 పాయింట్లతో నిలువడంతో మ్యాచ్ 'డ్రా'అయింది. తెలుగు జట్టు తరపున సూరజ్ దేశాయ్ 7 పాయింట్లు సాధించగా.. స్టార్ ప్లేయర్ సిద్ధార్థ్ దేశాయ్ (4 పాయింట్లు) పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. 12 సార్లు ప్రత్యర్థి కోర్టులోకి రైడింగ్‌కు వెళ్లిన సిద్ధార్థ్ ఆరుసార్లు అందులోనే దొరికిపోవడం ఫలితంపై ప్రభావం చూపింది. బెంగాల్ తరపున మొహమ్మద్ నబీబక్ష్ (8 పాయింట్లు), మణిందర్ సింగ్ (5 పాయింట్లు) రాణించారు. లీగ్‌లో ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లాడిన టైటాన్స్ ఒక విజయం, ఐదు పరాజయాలు, రెండు 'టై'లతో 13 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 10వ స్థానంలో నిలిచింది.

ఆఖరివరకు హోరాహోరీ

తొలి రైడ్‌లోనే పాయింట్ తెచ్చిన సిద్ధార్థ్ టైటాన్స్ ఖాతా తెరిచాడు. రెండో నిమిషంలో బెంగాల్ రైడర్ నబీబక్ష్.. సిద్ధార్థ్‌ను ఔట్ చేసి స్కోరు సమం చేశాడు. ఈ దశలో టైటాన్స్ చక్కటి ట్యాక్లింగ్స్‌తో రెండు పాయింట్లు సాధించి 4-2తో ముందడుగు వేసింది. కాసేపటికే సిద్ధార్థ్‌ను సూపర్ ట్యాకిల్ చేసిన వారియర్స్ 9-9తో స్కోరు సమం చేసింది. అక్కడి నుంచి ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు పోరాడటంతో ఆధిక్యం చేతులు మారుతూ వెళ్లింది. ఎట్టకేలకు తొలి అర్ధభాగం ముగిసే సమయానికి టైటాన్స్ 13-11తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. రెండో సగం ఆరంభంలోనే ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేసిన టైటాన్స్ తొలిసారి 5 పాయింట్ల లీడ్ సాధించగలిగింది. 17-12, 19-15తో ముందంజలో కనిపించిన టైటాన్స్ కీలక దశలో వరుస పాయింట్లు కోల్పోయి 21-23తో వెనుకబడింది. ఈ దశలో ఇరు జట్లు రక్షణాత్మక ధోరణిలో ఆడటంతో పెద్దగా మెరుపులేకుండా చివరకు మ్యాచ్ 'టై'గా ముగిసింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధా 35-33తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. మంగళవారం లీగ్‌లో సెలవు రోజు కాగా.. బుధవారం జరుగనున్న మ్యాచ్‌ల్లో యూపీతో హర్యానా, గుజరాత్‌తో బెంగాల్ తలపడనున్నాయి.

భువీ మ్యాజిక్

నాలుగు వికెట్లతో విజృంభణ.. రెండో వన్డేలో భారత్ ఘన విజయం

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: కెప్టెన్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీకి.. బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్ (4/31) మెరుపులు తోడవడంతో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ విజయం సాధించింది. తొలి వన్డే వర్షం కారణంగా రద్దుకాగా.. రెండో మ్యాచ్‌లో నెగ్గిన టీమ్‌ఇండియా మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున ముగిసిన మ్యాచ్‌లో విరాట్ సేన డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 59 పరుగుల తేడాతో గెలుపొందింది. 280 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ ఇన్నింగ్స్ మధ్యలో రెండుసార్లు వర్షం ఆటంకం కలిగించడంతో టార్గెట్‌ను 46 ఓవర్లలో 270గా సవరించారు. సాధించాల్సిన రనరేట్ ఎక్కువగా లేకున్నా.. ఒత్తిడికి లోనైన విండీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి చివరకు 42 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. ప్రేక్షకుల స్టాండింగ్ ఓవేషన్ మధ్య 300వ వన్డే బరిలో దిగిన స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ (11) పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. మరో ఓపెనర్ లూయిస్ (65; 8 ఫోర్లు, 1 సిక్సర్), పూరన్ (42) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో షమీ, కుల్దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే బుధవారం ఇక్కడే జరుగనుంది.

62 పరుగుల్లో 6 వికెట్లు..

లక్ష్య ఛేదనలో విండీస్ ఒక దశలో 148/4తో మెరుగ్గానే కనిపించినా.. భువనేశ్వర్ స్వింగ్‌తో బెంబేలెత్తించడంతో 62 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు కోల్పోయింది. కష్టతరం కాని లక్ష్య ఛేదనలో విండీస్‌కు మంచి ఆరంభమే దక్కింది. గేల్, లూయిస్ తొలి వికెట్‌కు 9.3 ఓవర్లలో 45 పరుగులు జోడించారు. ఈ క్రమంలో విండీస్ తరపున అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాడిగానేకాక అత్యధిక పరుగులు (10,353) చేసిన బ్యాట్స్‌మన్‌గానూ గేల్ రికార్డుల్లోకెక్కాడు. అయితే తన సహజ సిద్ధ ఆటతీరు కనబర్చలేకపోయిన గేల్ 24 బంతుల్లో 11 పరుగులు చేసి భువనేశ్వర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ షై హోప్ (5) ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. క్రీజులో పాతుకుపోయేందుకు యత్నించిన హెట్‌మైర్ (18)ను కుల్దీప్ పెవిలియన్ బాట పట్టించాడు. ఈ దశలో లూయిస్‌కు పూరన్ జతకలిశాడు. ఈ జోడీ సాధికారికంగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లడంతో విండీస్ విజయంపై ఆశలు పెంచుకుంది. నాలుగో వికెట్‌కు 56 పరుగులు జోడించాక.. లూయిస్‌ను బోల్తాకొట్టించిన కుల్దీప్ ఈ భగస్వామ్యానికి తెరదించాడు. అయితే అసలు దెబ్బ మాత్రం భువనేశ్వర్ కొట్టాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి కరీబియన్లను విజయానికి దూరం చేశాడు. 35వ ఓవర్ రెండో బంతికి పూరన్‌ను ఔట్ చేసిన భువీ.. ఐదో బంతికి రిటర్న్ క్యాచ్ ద్వారా చెజ్‌కు డగౌట్ దారిచూపి మ్యాచ్‌ను మన వైపు తిప్పాడు. బౌలింగ్ చేసి ఫాలోత్రూలో ఎడమవైపుకు డైవ్ చేస్తూ భువీ అందుకున్న క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్. కెప్టెన్ హోల్డర్ (13 నాటౌట్) అజేయంగా నిలిచినా మరో ఎండ్ నుంచి సహకారం అందకపోవడంతో విండీస్ ఓటమి ఖాయమైంది.

స్కోరు బోర్డు

వెస్టిండీస్: గేల్ (ఎల్బీ) భువనేశ్వర్ 11, లూయిస్ (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 65, హోప్ (బి) ఖలీల్ 5, హెట్‌మైర్ (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 18, పూరన్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 42, చేజ్ (సి అండ్ బి) భువనేశ్వర్ 18, హోల్డర్ (నాటౌట్) 13, బ్రాత్‌వైట్ (సి) షమీ (బి) జడేజా 0, రోచ్ (బి) భువనేశ్వర్ 0, కాట్రెల్ (సి) జడేజా (బి) షమీ 17, థామస్ (ఎల్బీ) షమీ 0, **ఎక్స్‌ట్రాలు:** 21, **మొత్తం:** 42 ఓవర్లలో 210 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-45, 2-52, 3-92, 4-148, 5-179, 6-179, 7-180, 8-182, 9-209, 10-210, **బౌలింగ్:** భువనేశ్వర్ 8-0-31-4, షమీ 8-0-39-2, ఖలీల్ 7-0-32-1, కుల్దీప్ 10-0-59-2, జాదవ్ 5-0-25-0, జడేజా4-0-15-1.

నాదల్‌దే మాంట్రియల్

మాంట్రియల్ : స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ మరోసారి సత్తాచాటాడు. సోమవారమిక్కడ జరిగిన ఫైనల్లో 6-3, 6-0 తేడాతో డేనిల్ మెద్వెదెవ్(రష్యా)పై గెలిచి మాంట్రియల్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. తన కెరీర్‌లో మొత్తంగా 35వ ఏటీపీ సింగిల్స్ మాస్టర్స్ 1000 టైటిల్‌ను చేజిక్కుంచుకొని రికార్డును మెరుగుపరుచుకున్నాడు. 33 టైటిళ్లతో జొకోవిచ్ రెండో స్థానంలో ఉన్నాడు. 70 నిమిషాల పాటు సాగిన ఫైనల్లో నాదల్ విశ్వరూపాన్ని చూపాడు. మొదటి నుంచి బలమైన షాట్లతో విరుచుపడుతూ ప్రత్యర్థి డేనిల్‌కు చుక్కలు చూపాడు.

శాస్త్రితో సహా ఆరుగురు..

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ పదవి కోసం రవిశాస్త్రితో సహా ఆరుగురు పోటీపడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఆసక్తిరేపుతున్న వారి పేర్లతో సోమవారం కుదించిన జాబితా ఒకటి బయటికొచ్చింది. ఇందులో ప్రస్తుత చీఫ్ కోచ్ శాస్త్రితో పాటు మైక్ హెస్సెన్, టామ్ మూడీ, ఫిల్ సిమ్మన్స్, లాల్‌చంద్ రాజ్‌పుత్, రాబిన్ సింగ్ ప్రధాన పోటీదారులుగా నిలిచారు. దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) చీఫ్ కోచ్‌ను ఎంపిక చేయనుంది. 'ఇంటర్వ్యూ కోసం ఆరుగురిని ఎంపిక చేశారు. వీరు సీఏసీ ముందు హాజరై తమ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తారు' అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

భారత్‌కు మూడో స్థానం

న్యూఢిల్లీ: భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు కోటిఫ్ కప్‌లో మూడో స్థానంలో నిలవడంతో పాటు ఫెయిర్ ప్లే అవార్డు సొంతం చేసుకుంది. వాలెన్సియాలో జరిగిన ఈ టోర్నీలో మన అమ్మాయిలు మొత్తం నాలుగు మ్యాచ్‌లాడగా.. అందులో రెండింట నెగ్గి, మరో రెండు ఓడారు. తొలుత భారత్ 3-1తో మౌరిటానియాపై, 7-0తో బొలీవియాపై విజయం సాధించింది. అనంతరం 0-2తో వల్లారియల్, 0-2తోనే స్పెయిన్ అండర్-19 జట్ల చేతిలో ఓడింది. కాగా ఈ టోర్నీలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 'ఈ సారి మా జట్టు మంచి ప్రదర్శన చేసింది. ఈ విషయం ప్రతీఒక్కరు గుర్తించారు. ఓడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపు సమీపానికి వచ్చాం. ఏడాది కాలంగా జట్టులో చాలా మార్పు కనిపిస్తున్నది' అని భారత హెడ్ కోచ్ మేమోల్ రాకీ తెలిపాడు.

డకౌట్లతో ఆర్యభట్టకు నివాళి అర్పించా

న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాల్లో సెహ్వాగ్ విభిన్న పోస్టులు పెడుతుంటాడు. సందర్భోచితంగా సరదాగా, చతురతతో మాజీ డాషింగ్ ఓపెనర్ చేసే ట్వీట్లకు అభిమానులు ఫిదా అయిపోతుంటారు. అయితే, తనపై తానే సెటైర్ వేసుకుంటూ సెహ్వాగ్ సోమవారం ఓ ట్వీట్ చేశాడు. 2011 ఇంగ్లండ్ పర్యటనలో ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్ అయిన తరుణానికి ఎనిదేండ్లయిన సందర్భంగా వీరూ ఈ ట్వీట్ చేశాడు. 'సరిగ్గా ఎనిమిదేండ్ల క్రితం ఇదే రోజు బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లో డకౌట్ అయ్యా. రెండు రోజుల ప్రయాణం... 188 ఓవర్ల ఫీల్డింగ్ తర్వాత ఇలా జరిగింది. అయిష్టంగానే అప్పుడు ఆర్యభట్టకు నివాళి అర్పించా' అని సెహ్వాగ్ ట్వీట్ చేశాడు. దీనికి అభిమానులు అనేక రకాల కామెంట్లు చేశారు. వైఫల్యాలను గుర్తు తెచ్చేందుకు ఎంతో ధైర్యం కావాలని, అది సెహ్వాగ్ ఉందంటూ కొందరు ప్రశంసించారు. తాను సెలెక్టర్ కావాలనుకుంటున్నానని, ఎవరు అవకాశమిస్తారంటూ మరో ట్వీట్ కూడా వీరూ చేశాడు. 2011లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌ను భారత్ 0-4తో కోల్పోయిన విషయం తెలిసిందే.

పాక్‌కు వెళ్లడంపై ఏమీ చెప్పం

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌లో జరగాల్సిన డేవిస్‌కప్ మ్యాచ్‌ల్లో భారత జట్టు పాల్గొనడంపై ప్రభుత్వం అభిప్రాయం చెప్పాల్సిన అవసరం లేదని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఒకవేళ అది ద్వైపాక్షిక టోర్నీ అయితే... పాక్‌తో భారత్ ఆడే విషయం రాజకీయ నిర్ణయంగా ఉండేదని చెప్పారు. అయితే డేవిస్‌కప్‌ను ప్రపంచ క్రీడా మండలి నిర్వహిస్తున్నందున, ప్రభుత్వం కలుగజేసుకోదని చెప్పారు. 'భారత్.. ఒలింపిక్ ఒప్పందంలో ఉంది. అందుకే భారత ప్రభుత్వం, జాతీయ ఫెడరేషన్... జట్టు పాల్గొనాలా వద్దా అనేది చెప్పవు' అని రిజిజు చెప్పారు. డేవిస్‌కప్‌లో భాగంగా వచ్చే నెల 14,15 తేదీల్లో పాకిస్థాన్‌లో జరిగే ఆసియా-ఓషియానా జోన్ (గ్రూప్-1 మ్యాచ్‌లు ఆడేందుకు భారత జట్టు వెళ్లే అంశంపై ఉత్కంఠ కొనసాగుతున్నది.

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్!

లండన్: విశ్వక్రీడల్లో క్రికెట్‌ను చూడబోతున్నామా. అంటే అవుననే సమాధానం వస్తున్నది. అవును లాస్‌ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేసేందుకు ప్రయత్నాలు జోరందుకున్నాయి. విశ్వక్రీడల్లో క్రికెట్ ప్రాతినిధ్యంపై ఐసీసీ ఆదిశలు అడుగులు ముందుకు వేస్తున్నదని ఎమ్‌సీసీ వరల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ మైక్ గ్యాటింగ్ సోమవారం అన్నాడు. ఇటీవలే జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) పరిధిలోకి బీసీసీఐ రావడం ఈ నిర్ణయానికి కారణంగా తెలుస్తున్నది.

జియో నంబర్ 2

టెలికం రంగంలో ప్రభంజనం సృష్టించిన రిలయన్స్ జియో..ఇక ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) సేవలకు సిద్ధమవుతున్నది. మూడేండ్లలోపే 34 కోట్ల మంది టెలికం వినియోగదారులతో అగ్రస్థాయికి చేరుకున్న జియో..గృహాలకు, ఎంటర్‌ప్రైజెస్‌లకు బ్రాడ్‌బ్యాండ్ సేవలతోపాటు చిన్న మధ్యతరహా పరిశ్రమలకు తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించనున్నట్లు ప్రకటించింది. భారత్‌లో అత్యంత వేగవంతమైన డాటా సేవలు అందించాలనే ఉద్దేశంతో మూడేండ్ల క్రితం టెలికం రంగంలోకి అడుగు పెట్టిన సంస్థ.. ఇప్పటి వరకు రూ.3.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. జియోకు ముందు 'డార్క్ డాటా'గా ఉన్న భారత దేశంలో ఆ తర్వాత జియో అంటే మేడి న్ ఇండియా డాటాగా మారిపోయిందని ముకేశ్ అంబానీ అన్నారు. వినియోగదారులను చూస్తుంటే భవిష్యత్తులో 50 కోట్లకు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. భారత్‌లో అతిపెద్ద టెలికం సంస్థగా అవతరించిన జియో..ప్రపంచంలో రెండో అతిపెద్ద సంస్థగా రికార్డు సృష్టించిందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు దేశంలో ప్రముఖంగా ఉన్న బిట్స్ పిలానీ, మణిపాల్ అకాడమీలకు పోటీగా రిలయన్స్‌కు చెందిన జియో ఇనిస్టిట్యూట్‌లను ప్రపంచ స్థాయి విద్యా సంస్థలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు ముకేశ్ ప్రకటించారు. వచ్చే మూడేండ్లకాలంలో రూ.1,500 కోట్ల వరకు ఖర్చు చేయనున్నది.

ముంబైలో జరిగిన 42వ వార్షిక సాధారణ సమావేశంలో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేష్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, తల్లి కోకిలా బెన్

3డీ స్క్రీన్ కలిగిన వర్చువల్ రియల్టీతో ముకేశ్ అంబానీ తనయుడు ఆకాశ్ అంబానీ, కుమార్తె ఇషా అంబానీ

జియో జిగేల్

ఇక గిగా ఫైబర్ సేవలు.. వచ్చే నెల 5 నుంచి మొదలు

- వార్షిక చందాదారులకు సెట్ టాప్ బాక్స్‌తో ఎల్ఈడీ టీవీ ఉచితం
- ల్యాండ్ లైన్ ఫోన్లపై జీవితాంతం వాయిస్ కాల్స్ కూడా
- విడుదలైన రోజే కొత్త సినిమాలను ఇంట్లో చూసే అవకాశం

ముఖ్యాంశాలు..

- 18 నెలల్లో రుణ రహిత రిలయన్స్
- చమురు శుద్ధి, రసాయనాల వ్యాపారంలో సౌదీ ఆరామ్కోకు 20% వాటా అమ్మకం ద్వారా సంస్థకు రూ.1.06 లక్షల కోట్ల ఆదాయం
- వాటా కొనుగోలు తర్వాత రిలయన్స్ రిఫైనరీలకు రోజుకు 5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును సరఫరా చేయనున్న సౌదీ ఆరామ్కో
- చమురు రిటైల్ వ్యాపారంలో బ్రిటిష్ పెట్రోలియంకు 49 శాతం వాటా విక్రయం ద్వారా రిలయన్స్ చేతికి రూ.7 వేల కోట్లు రాక
- రిలయన్స్ జియోపై పూర్తయిన పెట్టుబడులు, ఇప్పటిదాకా దాదాపు రూ.3.5 లక్షల కోట్లు మదుపు
- సెప్టెంబర్ 5 నుంచి జియో ఫైబర్ వాణిజ్య సేవలు మొదలు
- కనీస ఇంటర్నెట్ వేగం 100 ఎంబీపీఎస్.. గరిష్ఠం 1,000 ఎంబీపీఎస్
- ధరల శ్రేణి నెలకు రూ.700ల నుంచి రూ.10,000
- జియో ఫైబర్ ల్యాండ్ లైన్ ఫోన్ల నుంచి దేశవ్యాప్తంగా జీవితాంతం వాయిస్ కాల్స్ ఉచితం
- 2020 మధ్య నుంచి 'జియో ఫస్ట్ డే ఫస్ట్ షో' సేవలు
- వచ్చే ఏడాది స్టాక్ మార్కెట్లలోకి రిలయన్స్ రిటైల్, జియో
- భారతీయ సాంకేతిక పరివర్తన కోసం మైక్రోసాఫ్ట్‌తో కలిసి క్లౌడ్ డాటా సెంటర్ల ఏర్పాటు
- 2030 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందన్న విశ్వాసం

ముంబై, ఆగస్టు 12:

రిలయన్స్ జియో.. 2016 సెప్టెంబర్ 5న మొదలై భారతీయ టెలికం రంగ ముఖచిత్రాన్నే మార్చేసిన సంచలనం. సరిగ్గా మూడేండ్ల తర్వాత మళ్లీ జియో ఫైబర్.. అదే తేదీన పరిచయం అవుతున్నది. ఇప్పుడు దీని టార్గెట్ డిష్ టీవీలు, కేబుల్ ఇంటర్నెట్, టెలి విజన్ పరిశ్రమలు. నాడు అనూహ్య ఆఫర్లతో వచ్చి కొమ్ములు దిరిగిన టెలికం ఆపరేటర్లను జియో కుదిపేయగా, ఈ సెప్టెంబర్ 5న జియో గిగా ఫైబర్ సైతం అలాంటి అద్భుతాలనే ఆవిష్కరించనున్నది. వార్షిక ప్లాన్లను ఎంచుకున్న కస్టమర్లకు 4కే సెట్ టాప్ బాక్స్‌తో ఏకంగా 4కే ఎల్ఈడీ హెచ్‌డీ టీవీనే సంస్థ అధిపతి ముకేశ్ అంబానీ ఫ్రీ ఆఫర్ చేశారు మరి. సోమవారం ఇక్కడ జరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వాటాదారుల 42వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో జియో ఫైబర్ అద్భుత ఆఫర్లను ఆయన ప్రకటించారు. రిలయన్స్‌ను ఇక మునుపెన్నడూ చూడని విధంగా చూడబోతున్నారన్న ముకేశ్.. వచ్చే నెల 5 నుంచి జియో ఫైబర్ సేవలు మొదలవుతాయని, నెలకు కేవలం రూ.700లకే హై-స్పీడ్ బ్రాడ్‌బాండ్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కనీస ఇంటర్నెట్ వేగం 100 ఎంబీపీఎస్ ఉండగా, గరిష్ఠ వేగం 1,000 ఎంబీపీఎస్ (1 జీబీపీఎస్). ధర కూడా రూ.10,000లుగా స్పష్టం చేశారు. అలాగే వార్షిక ప్లాన్లను కొనుగోలు చేసినవారికి సెట్ టాప్ బాక్స్‌లతో ఉచితంగా హెచ్‌డీ టీవీలను అందిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ ల్యాండ్ లైన్ కస్టమర్లకు జీవితాంతం ఉచిత వాయిస్ కాల్స్ ఉంటాయన్న ముకేశ్.. అమెరికా, కెనడాలకు నెలకు రూ.500 చెల్లించి అపరిమిత అంతర్జాతీయ కాలింగ్ ప్యాక్‌ను పొందవచ్చని చెప్పారు. ప్రస్తుత మార్కెట్ ధరలతో పోల్చితే ఇది చాలాచాలా తక్కువని గుర్తు చేశారు. 'ఇక దేశంలోనే ప్రప్రథమంగా కొత్త సినిమాలను థియేటర్లలో విడుదలైన రోజే.. ఇంటిల్లిపాదీ ఇంట్లో కూర్చుని చూసే అవకాశాన్ని కల్పిస్తున్నాం. 'జియో ఫస్ట్ డే ఫస్ట్ షో' పేరుతో పరిచయం కానున్న ఈ సేవలు.. వచ్చే ఏడాది మధ్య నుంచి అందరికీ అందుబాటులో ఉంటాయి' అంటూ పెను సంచలనాన్నే ముకేశ్ సృష్టించారు. అయితే జియో ఫైబర్ ప్లాన్‌లో టీవీలు మాత్రమే కాకుండా డెస్క్‌టాప్‌లనూ భాగం చేస్తున్నామని సంస్థకు చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు. రూ.700-10,000 నెలసరి ప్లాన్లలో కేబుల్ టీవీ సబ్‌స్క్రిప్షన్ భాగం కాదని, టీవీ సేవల కోసం ప్రత్యేకంగా వినియోగదారులు చెల్లించాలన్నారు. ఈ సేవలు కేబుల్ ఫైబర్ ద్వారాగానీ డీటీహెచ్ సర్వీస్ ద్వారాగానీ అందుతాయన్నారు. ఇక తొలి ఏడాదిలో 3.5 కోట్ల మంది కస్టమర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పిన ఆయన 2 కోట్ల మంది గృహస్తులను, 1.5 కోట్ల మంది వ్యాపారస్తులను చేర్చుతామన్నారు. గత ఏజీఎంలో ప్రకటించినట్లుగానే జియో గిగా ఫైబర్ సర్వీస్.. టీవీల్లో అల్ట్రా-హై డెఫినేషన్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను వీక్షకులకు అందించనున్నది. నిరుడు 41వ ఏజీఎంలో డిజిటల్ షాపింగ్, వర్చువల్ రియాల్టీ గేమింగ్, స్మార్ట్ హోం సొల్యూషన్లు, వాయిస్ యాక్టివేటెడ్ అసిస్టెన్స్‌ను గృహస్తులకు అందిస్తామని ముకేశ్ వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. దాన్ని ఈ సందర్భంగా ముకేశ్ నిలబెట్టుకున్నారన్న అభిప్రాయాలు.. తాజా ఏజీఎం తర్వాత వ్యక్తమవుతున్నాయి.

> మీ జీవితంలోకి జియో ఫైబర్, జియో సెట్ టాప్ బాక్స్‌ల అనుభవం ఓ ఎల్ఈడీ టీవీతో పరిచయమవబోతున్నది. మా కస్టమర్లకు ఎల్ఈడీ టీవీ ఉచితం మరి. జియో ఫైబర్ వినియోగదారులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. మా వార్షిక ప్లాన్లను ఎంచుకున్నవారు హెచ్‌డీ లేదా 4కే ఎల్ఈడీ టీవీ, 4కే సెట్ టాప్ బాక్స్‌లను పూర్తిగా ఉచితంగా అందుకుంటారు. అంతేగాక జీవితాంతం ఉచిత వాయిస్ కాల్స్‌ను ల్యాండ్ లైన్ ఫోన్ల ద్వారా పొందగలుగుతారు. ఇక థియేటర్లలో విడుదలైన కొత్త సినిమాలను మొదటి రోజే ఇంట్లో కూర్చుని చూసే అవకాశాన్ని మీకు అందిస్తున్నాం. 2020 మధ్య నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి
>
> – ముకేశ్ అంబానీ

ఇప్పటికే 5 లక్షల గృహాలకు సేవలు

గత కొద్ది నెలలుగా జియో గిగా ఫైబర్ మౌలిక వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించిన రిలయన్స్.. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ పట్టణాల్లో 5 లక్షల గృహాలకు ప్రయోగాత్మకంగా సేవలను ప్రారంభించారు. గతేడాది జియో ఫైబర్‌ను ప్రకటించిన దగ్గర్నుంచి దేశంలోని దాదాపు 1,600 నగరాలు, పట్టణాల నుంచి కోటిన్నర కుపైగా రిజిస్ట్రేషన్లను అందుకున్నామని ముకేశ్ ఈ సందర్భంగా తెలియజేశారు. జియో పోస్ట్ పెయిడ్ ప్లస్.. సిమ్ ప్రాధాన్య సెట్ టాప్ సర్వీసులను ఇంటి వద్దే అందించనుందని చెప్పారు.

సౌదీ ఆరామ్కోకు 20 శాతం వాటా

సంస్థకు కీలకమైన చమురు శుద్ధి-రసాయనాల వ్యాపారంలో సౌదీ చమురు దిగ్గజం ఆరామ్కో 20 శాతం వాటాను దక్కించుకుంటున్నది. ఇందుకుగాను దాదాపు 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.06 లక్షల కోట్లు)ను చెల్లిస్తున్నది. ఆర్ఐఎల్ చమురు-రసాయన విభాగం విలువను 75 బిలియన్ డాలర్లుగా లెక్కించి ఈ వాటాకు ఈ మొత్తాన్ని సౌదీ ఆరామ్కో ఇస్తున్నది. ఈ డీల్‌లో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్దనున్న రెండు రిలయన్స్ రిఫైనరీలకు దీర్ఘకాలిక ప్రాతిపదికన రోజుకు 5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును ప్రపంచ అతిపెద్ద క్రూడ్ ఎగుమతిదారైన సౌదీ ఆరామ్కో సరఫరా చేయనున్నది. ప్రస్తుతం సౌదీ అరేబియా నుంచి రిలయన్స్ కొంటున్న దానికి ఇది రెట్టింపు కావడం గమనార్హం.

బీపీ నుంచి రూ.7 వేల కోట్లు

తమ దేశీయ చమురు మార్కెటింగ్ వ్యాపారంలో బ్రిటీష్ పెట్రోలియం (బీపీ)కు 49 శాతం వాటాను విక్రయిస్తున్న రిలయన్స్.. అందుకుగాను ఆ సంస్థ నుంచి రూ.7 వేల కోట్లను పొందుతున్నది. గత వారం ఇరు సంస్థలు ఇందుకు సంబంధించి ఓ ఒప్పందాన్నీ చేసుకున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే ఉన్న 1,400 రిలయన్స్ పెట్రోల్ పంపులు, 31 విమాన యాన ఇంధన స్టేషన్లు ఈ జాయింట్ వెంచర్‌లోకి వచ్చేస్తున్నాయి. వచ్చే ఐదేండ్లలో 5,500 పెట్రోల్ పంపుల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్న బీపీ, ఆర్ఐఎల్‌లు.. విమానయాన ఇంధనాన్నీ అమ్మనున్నాయి.

జమ్ము కశ్మీర్‌లో పెట్టుబడులు

జమ్ము కశ్మీర్‌లో పెట్టుబడులు పెడుతామని ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో జమ్ము కశ్మీర్, లడఖ్‌లలో పెట్టుబడులకు ముందుకు రావాలని ప్రధాని పిలుపునిచ్చిన క్రమంలో ముకేశ్ స్పందించారు. పర్యాటకం, వ్యవసాయం, ఐటీ, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని మోదీ ఆదివారం పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో రాబోయే రోజుల్లో రిలయన్స్ పెట్టుబడులు ఇక్కడ ఉంటాయని ముకేశ్ స్పష్టం చేశారు.

2021 మార్చి ఆఖరుకల్లా అప్పులుండవ్

రుణ రహిత రిలయన్స్‌ను లక్ష్యంగా పెట్టుకున్న ముకేశ్.. 18 నెలల్లో ఆ కల సాకారం అవుతుందని ప్రకటించారు. 2021 మార్చి 31 నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై ఉన్న రుణ భారం మొత్తాన్ని తీర్చేస్తామని చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ దాదాపు 134 బిలియన్ డాలర్లుగా ఉందన్న ఆయన ఈ ఏడాది మార్చి 31 నాటికి సంస్థ నికర రుణాలు రూ.1,54,478 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. జూన్ 30 నాటికి రూ.2,88,243 కోట్లకు చేరగా, నగదు నిల్వలు రూ.1,31,710 కోట్లకు పడిపోయాయి. 2013 నుంచి ఇదే కనిష్ఠ స్థాయి. గత ఐదేండ్లలో రిలయన్స్ రూ.5.4 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టగా, ఇందులో అధిక శాతం రుణాల ద్వారా తీసుకున్నవే. ఈ క్రమంలోనే సౌదీ ఆరామ్కో, బీపీలకు వాటాలను విక్రయిస్తుండగా, రూ.1.15 లక్షల కోట్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 18 నెలల్లో రుణ రహిత రిలయన్స్‌ను చూస్తారంటూ వాటాదారులకు ముకేశ్ అభయమిచ్చారు.

మైక్రోసాఫ్ట్‌తో జియో జట్టు

దేశవ్యాప్తంగా అతిపెద్ద డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి రిలయన్స్ జియో.. అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో జతకట్టింది. భారతీయ సాంకేతిక రంగాన్ని మరో ఉన్నత శిఖరాలకు చేర్చాలనే ఉద్దేశంతో మైక్రోసాఫ్ట్‌తో కలిసి క్లౌడ్ డాటా సెంటర్ల ఏర్పాటు చేయనున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. తద్వారా స్టార్టప్‌లు, చిన్న మధ్యతరహా పరిశ్రమలు తమ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించడానికి ఉచితంగా అత్యంత వేగవంతమైన డాటా సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌లు పెట్టే ఖర్చులో 80 శాతం క్లౌడ్, కనెక్టివిటీ మౌలిక సదుపాయాలకోసం ఖర్చు చేస్తున్నాయని, తద్వారా ఎంతో నష్టపోతున్నాయని, వీటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో నూతన సేవలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇందుకోసం వచ్చే జనవరి 1 నుంచి jio.com నుంచి స్టార్టప్‌లు రిజిస్టార్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. వ్యవసాయం, హెల్త్ కేర్, విద్య, నైపుణ్యం అభివృద్ధి పరిచే స్టార్టప్‌లకు ఆర్థికంగా చేయూతనివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు అంబానీ ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువు పట్టులాంటి సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి సంస్థలు ప్రతి నెల రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతున్నదని, వీటి నుంచి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముకేశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదన్నారు. ఆ దిశగా రిలయన్స్ జియో తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.

జీవీకే పవర్ నష్టం రూ.131 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 12: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నష్టాల పరంపర కొనసాగుతున్నది. గడిచిన త్రైమాసికానికిగాను రూ.131.51 కోట్ల కన్సాలిడేటెడ్ నష్టం వచ్చినట్లు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.54.86 కోట్ల నష్టంతో పోలిస్తే రెండు రెట్లు అధికమైంది. ఆదాయం తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,106.33 కోట్ల నుంచి రూ. 1,042.12 కోట్లకు పడిపోయింది. ప్రస్తుతం సంస్థ ఇంధనం, విమానాశ్రయాలు, రవాణా, ఆతిథ్య, లైఫ్ సైన్స్ విభాగంలో సేవలు అందిస్తున్నది.

నాట్కో ప్లాంట్‌పై అమెరికా అభ్యంతరాలు

హైదరాబాద్, ఆగస్టు 12: ప్రముఖ ఔషధ సంస్థ నాట్కో ఫార్మాకు చెందిన మేకగూడ గ్రామంలో ఉన్న తయారీ కేంద్రంపై అమెరికా నియంత్రణ మండలి ఆరు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి ఫామ్ 483ని జారీ చేసింది. ఈ నెల 5 నుంచి 9 మధ్యకాలంలో తనిఖీ చేసిన యూఎస్ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు ఈ ఆరు అభ్యంతరాలను వ్యక్తంచేసినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. డాటా ఇంటెగ్రిటీతోపాటు ఇతర విషయాలపై యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరాలను త్వరలో పరిష్కరించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

భళారే.. మేఘా

కాళేశ్వరం ప్రాజెక్టులో అద్భుతాలు

హైదరాబాద్, ఆగస్టు 12: తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు.. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మేఘా ఇంజినీరింగ్ అద్భుతాలను సృష్టిస్తున్నది. భూగర్భంలో ఆవిష్కృతమైన ఈ ప్రాజెక్టు.. ఓ ఇంజినీరింగ్ కళాఖండమే. ఈ మానవ నిర్మిత అద్భుతానికి తమ సాంకేతిక శక్తి, సామర్థ్యాలను మేఘా జోడించడంతో ప్రపంచ శ్రేణి నిర్మాణాల్లో ఒకటైంది. అదే కాళేశ్వరం పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద భూగర్భాన్ని తొలిచి నిర్మించిన లక్ష్మీపూర్ (గాయత్రి) భూగర్భ పంపింగ్ కేంద్రం. ప్రపంచంలో ఇంత పెద్ద నీటి పంపింగ్ కేంద్రం ఇంతవరకూ ఎక్కడా నిర్మించలేదు. ఒక్కో మిషన్ వారీగా చూస్తే సామర్థ్యం 139 మెగావాట్లు కావడంతో ప్రపంచంలో ఇదే పెద్దది. మొత్తం పంపింగ్ కేంద్రం ప్రకారం చూసినా 973 మెగావాట్లతో ముందుంటుంది. ఇందులో వినియోగించిన ఎలక్ట్రికల్ మోటర్ పంప్ హౌజ్.. ప్రపంచంలోని ఏ రంగంలోనూ లేదంటే అతిశయోక్తి కాదు. దీన్ని బట్టి ఈ పంపింగ్ కేంద్రం, మేఘా స్థాయి ఎంత గొప్పదో ఊహించుకోవచ్చు. ఈ భూగర్భ పంపింగ్ కేంద్రంలోని 5వ పంపు నుంచి నీటి పంపింగ్‌ను ఆదివారం రాత్రి ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. సుమారు 52 నిమిషాలు నడిపించారు. మొత్తం పంపు డిశ్చార్జ్ 89.73 క్యుమెక్స్. ఆదివారం పంపు చేసిన నీటి పరిమాణం మొత్తం 98,85,303 ఘనపుటడుగులు. అంటే సుమారు 28 కోట్ల లీటర్ల నీటిని 111 మీటర్ల ఎత్తుకు పంపు చేశారు. సోమవారం నాలుగో మోటరు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తి చేసింది.

ఈఫిల్ టవర్ కన్నా పెద్దది..

లక్ష్మీపూర్ (గాయత్రి) భూగర్భ నీటి పంపింగ్ కేంద్రం పొడవు ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ పొడవు కన్నా ఎక్కువ. ఈఫిల్ టవర్ ఎత్తు 324 మీటర్లు అవగా, ఈ పంప్ హౌజ్ పొడవు 327 మీటర్లు. ఇక కోల్‌కతాలోని దేశంలోనే అతిపొడవైన భవంతి 'ది 42' కంటే ఈ పంప్ హౌజ్ లోతు ఎక్కువ. 'ది 42' పొడవు 260 మీటర్లు. ఈ పంప్ హౌజ్ ఎంత లోతైనదో తెలిస్తే విస్తుపోక తప్పదు. ఈ పంప్ హౌజ్ నిర్మాణం కోసం భూగర్భాన్ని తొలిచి 2.3 కోట్ల ఘనపు మీటర్ల మట్టిని మేఘా ఇంజినీరింగ్ బయటకు తీసింది. మొత్తంగా లక్ష్మీపూర్ (గాయత్రి) భూగర్భ నీటి పంపింగ్ కేంద్రం వైశాల్యం 84,753.2 చదరపు అడుగులు. ఈ పంప్ హౌజ్ నిర్మాణం కోసం 6 వేల టన్నుల స్టీల్‌తోపాటు 50 వేల టన్నుల సిమెంట్ కాంక్రీట్ వినియోగించారు.

మూడున్నరేండ్లలోనే

అసలు ఎత్తిపోత పథకాలే ఇంత పెద్ద స్థాయిలో, భారీ శక్తి సామర్థ్యాలతో భూ ఉపరితలంపై కూడా ఇప్పటికీ ఎక్కడా లేవు. అటువంటిది ఇక్కడ భూగర్భంలో ప్రపంచంలోనే పెద్దది నిర్మించడం.. అందులోనూ రోజుకు కనీసం 2 టీఎంసీల నుంచి గరిష్ఠంగా 4.5 టీఎంసీలను 111.4 మీటర్ల ఎగువకు పంప్ చేయడం అనేది అసామాన్యమైనది. సవాళ్లను ఎదుర్కొని తన శక్తి సామర్థ్యాలతో మేఘా ఇంజనీరింగ్ ఈ పంపింగ్ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చింది. అదీ కేవలం మూడున్నరేండ్లలోనే. సాధారణ పథకాల నిర్మాణాలు సైతం దశాబ్దాల సమయం పడుతున్న పరిస్థితుల్లో ఈ పథకంతోపాటు ఈ పంపింగ్ కేంద్రాన్ని యుద్ధప్రాతిపదికన వేగంగా నిర్మించి రైతులకు అంకితం చేయడం మేఘా ఇంజనీరింగ్‌కే సాధ్యమైంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో 2 టీఎంసీల పంపింగ్‌కుగాను మొత్తం 4,627 మెగావాట్ల పంపింగ్ సామర్థ్యం అవసరం. మేఘా 3,057 మెగావాట్ల పంపింగ్ సామర్థ్యం కలిగిన పంపులను ఏర్పాటు చేస్తున్నది. సాగునీటి రంగంలో ఎత్తిపోతల పథకంలోని పంపులకు ఇంత పెద్ద స్థాయిలో విద్యుత్ సామర్థ్యం వ్యవస్థను ఏర్పాటు చేయడం ఓ రికార్డ్. దీని విద్యుత్ వినియోగ, పంపింగ్ సామర్థ్యం 973 మెగావాట్లు. విడివిడిగా చూస్తే శ్రీశైలంలోని రెండు జలవిద్యుత్ కేంద్రాల కన్నా, నాగార్జునసాగర్‌లో ఒక జలవిద్యుత్ కేంద్రం ఉత్పత్తి స్థాయి కన్నా దీని వినియోగం ఎక్కువ. 'ఈ భారీ పంప్ హౌజ్ విశిష్టత అంతా జంట టన్నెల్స్. ఈ రెండింటినీ పక్కపక్కనే 10 మీటర్ల వ్యాసంతో భూమిని తవ్వి ఒక్కో టన్నెల్‌ను 4,133 మీటర్ల పొడవుతో నిర్మించాం. సర్జ్ పూల్, అదనపు సర్జ్‌పూల్ కూడా ప్రపంచంలోనే అతి పెద్దవి. భూగర్భంలో ఇంత భారీ ఎత్తున నిర్మాణాలు జరుగడం ప్రపంచంలో ఇదే తొలిసారి. 470 అడుగుల దిగువన 327 మీటర్లు పొడవు, 25 మీటర్ల వెడల్పు, 65 మీటర్ల ఎత్తుతో ఈ పంప్ హౌజ్ నిర్మాణం జరిగింది' అని మేఘా డైరెక్టర్ బీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

లక్ష్మీపూర్‌లోని బాహుబలి మోటర్లు

పశ్చిమాన్నే అధిక అద్దెలు

- హైదరాబాద్‌లో అద్దెలపై సీబీఆర్ఈ నివేదిక
- దక్షిణదిలో వస్తు రవాణాకు పెరిగిన గిరాకీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పారిశ్రామిక, వస్తు రవాణా మార్కెట్ విభాగంలో హైదరాబాద్‌లోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో 12 నుంచి 18 శాతం మేరకు అధిక అద్దెలు గిట్టుబాటు అవుతున్నాయని సీబీఆర్ఈ సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడించింది. ఈ సంస్థ 2019 మొదటి ఆరు నెలల్లో పారిశ్రామిక, వస్తు రవాణా మార్కెట్‌కు సంబంధించిన అధ్యయన నివేదికను సోమవారం విడుదల చేసింది. 2019 ద్వితీయార్థంలో ఉత్తర హైదరాబాద్‌లో కొత్త సంస్థలు స్థలాన్ని లీజుకు తీసుకునే అవకాశముందని, ఫలితంగా అద్దెలు గణనీయంగా పెరుగుతాయని విశ్లేషించింది. 2019 ప్రథమార్థంలో లాజిస్టిక్స్ లీజింగ్ విభాగంలో దాదాపు 1.30 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని పలు సంస్థలు లీజుకు తీసుకున్నాయని వెల్లడించింది. దీంతో గతేడాది మొదటి ఆరునెలలతో పోల్చితే, 2019 ప్రథమార్థంలో సుమారు 31 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నది. 2018 మొదటి అర్థ సంవత్సరంతో పోల్చితే 2019 ప్రథమ విభాగంలో 56 శాతం స్థలాన్ని మూడు బడా సంస్థలు తీసుకున్నాయని వెల్లడించింది. ఇందులో దాదాపు ఎనభై ఐదు శాతం స్థానిక సంస్థలే స్థలాన్ని అద్దెకు తీసుకున్నాయని తెలియజేసింది. 50 వేల చదరపు అడుగుల నుంచి లక్ష చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకునే విభాగంలో 38 శాతం అమ్మకాలు పెరిగాయని నివేదికలో పేర్కొన్నది. ఈ- కామర్స్, రిటైల్ సంస్థల వాటా గణనీయంగా తగ్గుముఖం పట్టింది. 2020 నాటికల్లా భారత లాజిస్టిక్స్ విభాగం 6 కోట్ల చదరపు అడుగుల స్థలానికి చేరుకునే అవకాశముందని సీబీఆర్ఈ ఛైర్మన్ అంశుమన్ మ్యాగజీన్ తెలిపారు. ఆసియా పసిఫిక్ దేశాల్లో లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడుల్ని ఆకర్షించడంలో భారత్ మొదటి ఐదు స్థానాలకు చేరుకునే అవకాశముందన్నారు. హైదరాబాద్‌లో ముప్పయ్ నుంచి యాభై లక్షల్లోపు చదరపు అడుగుల స్థలంలో సరికొత్త గిడ్డంగులు ఏర్పాటవుతుందన్నారు.

జెట్‌పై ఆసక్తి లేదు: అనిల్ అగర్వాల్

ముంబై, ఆగస్టు 12: నిధులు లేక మూతపడిన జెట్ ఎయిర్‌వేస్ కొనుగోలు చేయడానికి గతంలో ముందుకొచ్చిన ఒక్కొక్కరు జారుకుంటున్నారు. గతంలో జెట్ ఎయిర్‌వేస్‌ను కొనుగోలు చేయడానికి బిడ్డింగ్‌ను దాఖలు చేసిన ప్రముఖ మైనింగ్ దిగ్గజం అధినేత అనిల్ అగర్వాల్..తాజాగా సోమవారం ఈ బిడ్డింగ్ ప్రక్రియ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఎతిహాద్ ఎయిర్‌వేస్, హిందుజా గ్రూప్‌లూ జెట్ కొనుగోలుకు మొదట్లో ఆసక్తి చూపినా.. ఆ తర్వాత వెనుకకు తగ్గాయి. తొలి విడుత నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియ చివరి తేదీని ఈ నెల 3 నుంచి 10 వరకు పెంచినప్పటికీ ఏ సంస్థ కూడా ముందుకురాలేదు. జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటా కలిగిన ఎతిహాద్ కూడా రెండో రౌండ్‌లో పాల్గొంటుందని అందరు ఆశించారు, కానీ చివరి నిమిషంలో వెనక్కి తగ్గింది.

అందుబాటులో 'రైడ్ ఈజీ' క్యాబ్ సేవలు

- యాప్‌ను ఆవిష్కరించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నగర ప్రజలకు మరో క్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. నగరానికి చెందిన 'రైడ్ ఈజీ' టెక్నాలజీస్ క్యాబ్ అగ్రిగేటర్ సర్వీసులను అందించేందుకు సిద్ధమైంది. 'రైడ్ ఈజీ' యాప్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి సోమవారం నగరంలోని దిల్‌కుషా అతిథిగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుశిక్షితులైన డ్రైవర్లను నియమించి ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేసేలా 'రైడ్ ఈజీ' యాప్ యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు. రైడ్ ఈజీ టెక్నాలజీస్ సీఎండీ రాజశేఖర్‌రెడ్డి తమ సంస్థ కార్యకలాపాలను వివరిస్తూ.. ప్రస్తుతం తమ వద్ద 4,200 మంది సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్నారని, త్వరలోనే ఈ సంఖ్యను 50 వేలకు పెంచేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఎలాంటి సర్‌చార్జీలు విధించకుండా కేవలం స్థిర ధరలతోనే సేవలందించనున్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో కూడా 'రైడ్ ఈజీ' సేవలను విస్తరిస్తామని, రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాలతోపాటు కేరళలో కూడా సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు.

'రైడ్ ఈజీ' యాప్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

'మన మహాత్ముడు' ఫొటో ప్రదర్శనకు అద్భుత స్పందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారంపై రీజినల్ ఔట్‌రీచ్ బ్యూరో, సమాచార ప్రసార మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'మన మహాత్ముడు' ఫొటో ప్రదర్శనకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ఈ తరం యువతకు గాంధీ జీవితం, ఆయన త్యాగం గురించి తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని ఫొటోఎగ్జిబిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్ తెలిపారు. మహాత్ముడి చిత్రంతో సెల్ఫీ దిగే ఏర్పాటుచేశామని, అనేక మంది సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

ప్రదర్శనలో ఏర్పాటుచేసిన గాంధీజీ ఫొటో

పండుగపూట అపశ్రుతి

- క్వారీ గుంతలో ఈతకు దిగి ఇద్దరు చిన్నారులు మృతి

రఘునాథపాలెం: డోలమైట్ క్వారీ గుంతలో ఈతకు దిగిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన ఖమ్మం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన షేక్ సలీం కుమారుడు షేక్ నాగులు(08) బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ జానీ కుమారుడు షేక్ మున్నా(05) రస్తోగినగర్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సోమవారం బక్రీద్ సెలవు కావడంతో ఆడుకుంటామని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారిద్దరు.. డోలమైట్ క్వారీ గుంతలో ఈతకు దిగారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆ గుంతలో నీళ్లు నిలవడతో ఇద్దరూ గల్లంతయ్యారు. స్థానికుల సాయంతో తల్లిదండ్రులు మృతదేహాలను వెలికి తీయించారు.

చేనేతకు మహాకీర్తి

- సినీ కాస్ట్యూమ్స్‌కు తోడ్పాటు.. కార్మికులకు చేతినిండా పని
- టాలీవుడ్, బాలీవుడ్ కాస్ట్యూమ్స్‌లో తెలంగాణ చేనేత కళాకృతులు
- జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో అవార్డు వెనుక కార్మికుల ప్రతిభ

(శిరందాస్ ప్రవీణ్‌కుమార్)
హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

తెలంగాణ చేనేత రంగానికి 'మహాకీర్తి' లభించింది. ఇక్కడి కార్మికుల నైపుణ్యం, ప్రతిభకు గుర్తింపు. ఏదైనా అవార్డు లభించిందంటే తెరవెనుక అనేక మంది శ్రమ దాగి ఉంటుందన్నది నిజం. 'మహానటి' సినిమాకు జాతీయ చలనచిత్ర పురస్కారాల్లోనూ అదే వరుస. కాస్ట్యూమ్ డిజైనర్‌గా గౌరంగ్‌షాకు పురస్కారం ప్రకటించారు. ఐతే 'మహానటి' సినిమాలో కాస్ట్యూమ్స్‌కు చేనేత వస్త్రాలదే కీలక పాత్ర. సావిత్రి పాత్రలో కట్టిన కంచి పట్టుచీరలన్నీ బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ ఉత్పత్తులు కావు. అవన్నీ చేనేత కార్మికుల చేతుల్లో రూపుదిద్దుకున్నవే. బాలీవుడ్‌లో ఉర్రూతలూగించిన 'దేవదాసు' సినిమాలోనూ తెలంగాణ చేనేత కళాకృతులు పరిఢవిల్లాయి. ఐశ్వర్యా రాయ్, మాధురీదీక్షిత్ ధరించిన వస్త్రాల్లో చాలావరకు ఇక్కడివే. ముఖ్యంగా నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నేసినవే. గట్టుప్పల, పుట్టపాక, చండూరు, ఆమనగల్లు ప్రాంతాల్లో ఈ చీరలు నేస్తున్నారు. ఈ కంచి పట్టుచీరల ఉత్పత్తిలో చేనేత కళాకారుల కళాతృష్ణ, నైపుణ్యం అంతాఇంతా కాదు. వారి నైపుణ్యమే కీర్తిసురేశ్‌కు కొత్త అందాలను తెచ్చిపెట్టింది. ఈ సినిమా కాస్ట్యూమ్స్‌కు ప్రసిద్ధ డిజైనర్ గౌరంగ్‌షాకు పురస్కారం లభించడాన్ని చేనేతరంగం స్వాగతిస్తున్నది. అవార్డు తమకే వచ్చినట్టుగా కార్మికులు భావిస్తున్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా ధర పలికే ఈ చీరలకు నాలుగేండ్ల నుంచి అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఒక్కో చీర నేసేందుకు 20 నుంచి 45 రోజుల సమయం పడుతున్నది. దేశ, విదేశీ డిజైనర్లు ఎందరో ఆర్డర్లు ఇస్తుండటంతో నిపుణులైన యువ కార్మికులు ఈ చీరలను జోరుగా ఉత్పత్తి చేస్తున్నారు.

జకాట్ మగ్గం

డిజైనర్ గౌరంగ్‌షా పాత్ర పెద్దదే

చేనేతరంగంలో డిజైనర్ గౌరంగ్‌షా పాత్ర పెద్దదే. కొంతకాలం క్రితం బెర్లిన్‌లోనూ తన సహజసిద్ధ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఎకో డిజైనర్స్ లావెరా షో ఫ్లోర్‌లో షాకు మంచి పేరొచ్చింది. ఖాదీలోనే 24 రకాల అవుట్‌ఫిట్స్‌ను ప్రదర్శించారు. ఖాదీతోపాటు కోటా, ఆరెంజ్ వంటివి ఉన్నాయి. ఇందులో మూడు చీరలు కాగా, మిగతావి ఇండో- వెస్టన్ అవుట్‌ఫిట్స్ కావడం విశేషం. ఇవన్నీ కూడా జమ్దాని నేత, పార్శి చికంకారి ఎంబ్రాయిడరీతో రూపొందించనవి. గౌరంగ్‌షా తన లేబుల్‌తోనే వస్త్రాలను తయారుచేసి సమ్మోహితులను చేస్తున్నారు. సంప్రదాయ చేనేత మగ్గాలపై కాటన్‌పైన నాణ్యమైన జరితో జమ్దానీ టెక్నిక్‌ను వినియోగిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ఆలయాల్లోని శిల్పాలు, పూలు, క్షేత్ర ఆకృతులను స్ఫూర్తిగా తీసుకొని వైవిధ్యభరిత డిజైన్లను సృష్టిస్తున్నారు. కాటన్ చీరకు సిల్క్ బార్డర్, టస్సర్ బార్డర్ వేసి రూపొందించిన ఉత్పత్తులు ఆకటుకొంటున్నాయి.

'మహానటి' సినిమాలో కీర్తిసురేశ్ ధరించిన చేనేత వస్త్రాలు

స్కిల్డ్ వీవ్‌కు విదేశాల్లోనూ డిమాండ్

నేటి ఫ్యాషన్ ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నది. అందుకే చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నది. సంప్రదాయ ఉత్పత్తులకు ఆధునికతను జోడిస్తే చేనేతరంగానికి, కార్మికులకు భవిష్యత్‌లోనూ ఢోకాలేదని నిరూపితమైంది. డబుల్ ఇక్కత్‌లో మరమగ్గాలకు దీటుగా వస్త్రోత్పత్తి చేస్తూ అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌ను అందుకొంటున్నారు. అందమైన మోడళ్లు ర్యాంప్‌పై అందాలొలికిస్తున్నారు. లక్మే ఫ్యాషన్ వీక్‌లో ఇక్కడి ఉత్పత్తులకే అవార్డుల పంట. గడిచిన ఐదేండ్లుగా తెలంగాణ చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తున్నది. మగ్గంపై విరిసిన పూల తరంగాలు, అందంగా కదలాడే హంసల బారులు, ఆనందంగా పురివిప్పి ఆడే నెమళ్లు, విరగ్గాసిన మామిడి పిందెలు.. ఇలా అనేక రకాల డిజైన్లకు ఆధునికత సొబగులు అద్దిన ఉత్పత్తులు దేశ, విదేశాల్లో అమ్ముడుపోతున్నాయి. చీరలతో పాటు షూటింగ్, షర్టింగ్ ఫ్యాబ్రిక్‌ను ఎగుమతి చేస్తున్నారు.

సినీ కాస్ట్యూమ్స్‌లో కళాకారుల ప్రతిభ

దశాబ్దాలుగా సినీ కాస్ట్యూమ్స్‌లో చేనేత కళాకారుల ప్రతిభ దాగి ఉన్నది. అయితే గుర్తింపు లభించడం గగనం. ప్రధానంగా ఇతిహాసాలు, చరిత్ర, రాజుల కథలతో సాగే సినిమాల్లో ప్రధాన పాత్రధారుల కాస్ట్యూమ్స్‌లో చేనేత ఉత్పత్తులే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఇప్పటికే చాలా హిందీ సినిమాల్లో కంచి, ఇక్కత్ చీరలు, వస్త్రాలను వినియోగించారు.

దేవదాసు సినిమాలో మాధురీ దీక్షిత్ ధరించిన చేనేత చీర

మాటలకందని భావోద్వేగం నాది

జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో 'మహానటి'లో కాస్ట్యూమ్స్‌కు అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మాటలకందని భావోద్వేగం. నిర్మాతలు స్వప్నాదత్, ప్రియాంకదత్, దర్శకుడు నాగ్‌అశ్విన్‌కు కృతజ్ఞతలు. ఈ అవార్డును చేనేత కార్మికులకు అంకితం చేస్తున్నాను. నా కుటుంబం, చేనేత వస్త్రప్రియులు ప్రోత్సహిస్తున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ ప్రయాణంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొన్నాను. సినిమాలో అవకాశం రావడం, దానికి గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది. చేనేత రంగానికి మరింత గుర్తింపు రావాలని ఆకాంక్షిస్తున్నాను.

– ప్రముఖ డిజైనర్ గౌరంగ్‌షా

చేనేతకు దొరికిన ఆణిముత్యం గౌరంగ్‌షా

భారతీయ సంప్రదాయ చేనేత చీరను అంతర్జాతీయ వేదికపై సగౌరవంగా నిలిపిన ఘనత గౌరంగ్‌షాదే. వివిధ దేశాల్లో అనేక వేదికలపై శక్తివంతమైన సినీ, సెలబ్రిటీలతో చేయించిన ర్యాంప్‌షోలు, విస్తృత ప్రచారం చేనేత రంగానికి మేలు కలిగించింది. లాక్మే ఫ్యాషన్‌షోలలో చేనేత వస్త్రం అత్యంత భిన్నంగా కనిపించింది. గౌరవ వేతనం, గుర్తింపు రావాలని వాదించి ఆచరించిన వ్యక్తికి అవార్డు రావడమంటే చేనేతరంగానికి వచ్చినట్లే. చేనేత రంగానికి ఆయన సేవలు ఎల్లకాలం ఉండాలని కోరుకుంటున్నా.

– యర్రమాద వెంకన్న నేత, జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త

సినీ కాస్ట్యూమ్స్‌కు చేనేత కళతో అందం

దశాబ్దాలుగా సినీ కాస్ట్యూమ్స్‌కు చేనేత కొత్త కళను తెస్తున్నది. గౌరంగ్‌షా వంటి ఫ్యాషన్ డిజైనర్లు రూపొందించే దుస్తులకు అవసరమైన వస్త్రాలను ఉత్పత్తిచేయగల సమర్థత తెలంగాణలో ఉన్నది. రాజులు, చరిత్ర, ఇతిహాసాలతో కూడిన సినిమాల్లో ప్రధాన పాత్రధారుల దుస్తులకు వినియోగించేందుకు ఇక్కడి ఉత్పత్తులే ప్రధానం. ఎన్నో చీరలు, వస్త్రాలను సినీరంగానికి అందించాం. నటీనటులు కూడా చేనేత వస్త్రాల కోసం సంప్రదిస్తున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ నటీమణులెందరో మా చీరలను కట్టారు.

– గజం అంజయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత, పుట్టపాక, యాదాద్రి భువనగిరి జిల్లా


'ప్రజా సంకల్ప పాదయాత్ర'పై రూపొందించిన 'జయహో' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, పద్మభూషణ్ శేఖర్‌గుప్తా, సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి తదితరులు

జయహో పుస్తకావిష్కరణ

వైఎస్ జగన్‌పాదయాత్రపై పుస్తకం రాసిన సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించిన ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

అమరావతి: ప్రజా సంకల్పయాత్ర పాదయాత్రపై రూపొందించిన జయహో పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ది ప్రింట్ ఎడిటర్ చీఫ్, పద్మభూషణ్ శేఖర్ గుప్తా చేతులమీదుగా సోమవారం జగన్ ఈ పుస్తకాన్ని విడుదలచేశారు. సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జయహో పుస్తకాన్ని సంకలనం చేశారు. పుస్తకాన్ని ఎమ్మెస్కో సంస్థ ప్రచురించింది. 14 నెలలపాటు ఏపీవ్యాప్తంగా వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలోని వివిధ చారిత్రాత్మక ఘటనను పుస్తకంలో పొందుపరిచారు.

ఉత్తమ్.. చరిత్ర తెలుసుకొని మాట్లాడు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ వ్యాఖ్య
- సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో అమిత్‌షా పర్యటిస్తారని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చరిత్ర తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును కాంగ్రెస్ ఎంపీలే వ్యతిరేకించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు రాయల తెలంగాణకు మొగ్గు చూపితే.. బీజేపీ పక్షనేతగా ఉన్న సుష్మాస్వరాజ్ వ్యతిరేకించారని చెప్పారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు కుంతియా ఎక్కడున్నారని ప్రశ్నించారు. కుంతియా, ఉత్తమ్ మాటలు పూర్తిగా దుష్ప్రచారమే అని పేర్కొన్నారు. ఈ నెల 18న బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా హైదరాబాద్‌లో పర్యటించనున్నారని చెప్పారు. సెప్టెంబర్ 17న బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారని లక్ష్మణ్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

తాండూర్: ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్‌లో కొనకంచి మురళీకృష్ణ ఇంట్లో సోమవారం తనిఖీ చేయగా నకిలీ విత్తనాలతోపాటు 20 లీటర్ల నిషేధిత గ్లైఫోసెట్ దొరికింది. మురళీకృష్ణను విచారించగా.. మందమర్రికి చెందిన మల్లికార్జున్‌తో కలిసి రహస్యంగా నకిలీ విత్తనాలను ఆంధ్రా నుంచి తెప్పించి అమ్ముతున్నామని పోలీసులకు వివరించాడు. అనంతరం మల్లికార్జున్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

ఎంటెక్ కాలేజీల్లో నకిలీలకు చెక్

- బయోమెట్రిక్‌తో సత్ఫలితాలు
- సగానికిపైగా తగ్గిన సీట్ల సంఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో అక్రమాలకు తెరదించేంకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన బయోమెట్రిక్ అటెండెన్స్ యంత్రాలను యూనివర్సిటీలు సమర్థంగా నిర్వహిస్తున్నాయి. ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన నాటినుంచి ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. గతంలో 30 వేలకుపైగా ఉన్న సీట్ల సంఖ్య ప్రస్తుత విద్యా సంవత్సరంలో 12,624కు తగ్గినట్టు పీజీఈసెట్-2019 అడ్మిషన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ ఏడాది పీజీఈసెట్‌కు దరఖాస్తు చేసుకున్న 22 వేల మంది విద్యార్థుల్లో సుమారు 18 వేల మంది అర్హత సాధించారని, వారిలో ఇప్పటివరకు 7,500 మంది విద్యార్థులు మాత్రమే ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. ఈ రిజిస్ట్రేషన్లకు బుధవారం వరకు గడువు ఉన్నదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 204 ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీలు (194 ప్రైవేటు కాలేజీలు, 10 యూనివవర్సిటీ కాలేజీలు) ఉన్నాయి. ఈ రెండు కోర్సుల్లో మొత్తం 12,624 (యూనివర్సిటీ కాలేజీల్లో 1,258, ప్రైవేటు కాలేజీల్లో 11,366) సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంటెక్ సీట్లు 7,304 సీట్లు, ఎంఆర్క్ సీట్లు 100 ఉండగా.. ఎంఫార్మసీ కాలేజీల్లో 3,900 సీట్లు, ఫార్మాడీలో 250 సీట్లు ఉన్నాయి. ఎంటెక్ కన్వీనర్ కోటాలో 6,157 సీట్లు, ప్రైవేటు ఎంఆర్క్‌లో 40 సీట్లు, ఎంఫార్మసీ కన్వీనర్ కోటాలో 3,789 సీట్లు, ఫార్మాడీలో 250 సీట్లు ఉన్నాయి.

నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు
- జీయర్ ట్రస్ట్ ఆశ్రమ భవనంలో శిక్షణకేంద్రం ప్రారంభం

మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ: వృత్తి నైపుణ్య శిక్షణతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెంకట్రావుపేట శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీ సమీపంలో ఉన్న చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ ఆశ్రమ భవనంలో జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, ప్రతిమ ఫౌండేషన్, టాటా స్ట్రైవ్ సంయుక్త ఆధ్వర్యంలో నెలకొల్పిన నైపుణ్య శిక్షణకేంద్రాన్ని సోమవారం గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ మన దేశంలో యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నదని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 1.4 మిలియన్ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కల్పించేందుకు సీఎస్సార్ (కంపెనీల సామాజిక బాధ్యత) విధానాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. కంపెనీలో వచ్చే లాభాల్లో రెండు శాతం స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఖర్చు చేయాల్సిఉంటుందన్నారు. జర్మనీ, ఇజ్రాయెల్, చైనా దేశాలు కేవలం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధారంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలతో అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారికుటుంబాల్లో వెలుగులు నింపేందుకు జీయర్ ట్రస్ట్, మై హోం సంస్థ అధినేత రామేశ్వర్‌రావు, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ బోయినపల్లి శ్రీనివాసరావు ముందుకు ప్రశంసనీయని పేర్కొన్నారు. అనంతరం గవర్నర్‌ను స్థానిక నాయకులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. అంతకుముందు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మెట్‌పల్లి అంబేద్కర్ స్టేడియానికి చేరుకున్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావుకు పలువురు ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్, కరీంనగర్ ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్, జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మైహోం సంస్థ అధినేత రామేశ్వర్‌రావు, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ బోయినపల్లి శ్రీనివాస్‌రావు, టాటా స్ట్రైవ్ సీఈవో అనితరాజన్, మెట్‌పల్లి సబ్ కలెక్టర్ గౌతమ్ పూట్రు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి టాటా స్ట్రైవ్ వారి బ్యాగ్‌ను అందజేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు

సోషల్ మీడియాలో సీపీఐ పేరుతో తప్పుడు ప్రచారం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వాతంత్ర్య దినోత్సవాన్ని 'బ్లాక్ డే'గా పాటించాలని తమ పార్టీ పేరుతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరుగుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి చెప్పారు. సీపీఐ అలాంటి నిర్ణయం చేయలేదని, ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అమరులకు నివాళులర్పించనున్నామని స్పష్టంచేశారు. కాగా, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి బలవంతపు వసూళ్లకు, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతున్న హైదరాబాద్ నగర పార్టీ కార్యవర్గసభ్యుడు పులిజాల గెల్వయ్యను సీపీఐ నుంచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. గెల్వయ్యకు పార్టీతో ఇకపై ఎలాంటి సంబంధం లేదని చాడ వెంకటరెడ్డి స్పష్టంచేశారు.

దివ్య మృతదేహం

విద్యుదాఘాతంతో గర్భిణి మృతి

జగిత్యాల క్రైం : విద్యుదాఘాతంతో ఓ గర్భిణి మృతి చెందిన ఘటన సోమవారం జగిత్యాల జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్నది. మేడిపెల్లి మండలం కాచారానికి చెందిన దివ్య(26)కు జగిత్యాల పట్టణానికి చెందిన స్తంబంపల్లి బ్రహ్మచారితో ఐదేండ్ల కింద వివాహం జరిగింది. వీరికి రెండేండ్ల వయస్సున్న బాబు ఉన్నాడు. సోమవారం బట్టలు ఉతికి ఆరేస్తుండగా, దండెం కోసం కట్టిన జే వైరుకు విద్యుత్ ప్రసారం జరిగి దివ్యకి విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

విశాఖ ఔటర్ హార్బర్‌లో దగ్ధమవుతున్న టగ్

విశాఖ హార్బర్‌లో అగ్నిప్రమాదం

విశాఖ: విశాఖ ఔటర్ హార్బర్‌లోని టగ్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు 70 మేర టగ్ కాలిపోయింది. నౌకలో సివిల్‌పనుల కోసం సిబ్బందిని తరలిస్తుండగా టగ్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. తీవ్ర భయాందోళనకు గురైన సిబ్బంది సముద్రంలోకి దూకేశారు. గమనించిన కోస్టుగార్డు సిబ్బంది వారిని ఒడ్డుకుచేర్చారు. ప్రమాద సమయంలో టగ్‌లో 29 మంది సిబ్బంది ఉండగా, 28 మందిని రక్షించారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన 15 మందిని చికిత్స కోసం ప్రైవేటు దవాఖానకు తరలించారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదానికి గురైన టగ్‌ను జాగ్వార్‌గా గుర్తించారు. చమురు నౌకలను బెర్త్‌కు తీసుకెళ్లడం, నౌకలోని సిబ్బంది సేవల కోసం ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌పీసీఎల్ ఈ టగ్‌ను అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. హెచ్‌పీసీఎల్‌కు చమురు పైపు అనుసంధానం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు ఏసీపీ కులశేఖర్ తెలిపారు. సహాయ చర్యల్లో పలు నౌకాలు పాల్గొన్నాయని కోస్టుగార్డు అధికారులు పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

- సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ టాప్
- నాలుగేండ్లలో 25 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణం
- పాలమూరు-రంగారెడ్డి పథకానికి పైసా ఇవ్వని కేంద్రం
- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. దేశంలోనే సంక్షేమంలో ముందున్న రాష్ట్రం తెలంగాణ అని, పేదరికం క్రమంగా తగ్గుతూ వస్తున్నదని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో రూ.30 కోట్లతో నిర్మించిన నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రారంభోత్సవం, పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతుల సభలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడేనాటికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు ఉంటే.. నాలుగేండ్లలో నాబార్డ్ ద్వారా రూ.వెయ్యి కోట్ల రుణంతో 25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాంలు నిర్మించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా గుంట భూమి కూడా కొ

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 13 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ఫ్రూట్ ప్యాక్స్ ట్రై చేద్దాం!

వాతావరణ కాలుష్యం వల్లనో, తినే ఆహారం వల్లనో చర్మ సౌందర్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో కొన్ని ఫ్రూట్ ప్యాక్స్‌ను ఉపయోగించి చర్మాన్ని మరింత కాంతివంతంగా మార్చవచ్చు. ఆ చిట్కాలేంటంటే..

- **అరటిపండు:** ఈ పండు బాగా మగ్గించి దాన్ని మెత్తని గుజ్జులా చేయాలి. ఆ గుజ్జును ముఖానికి రాసుకోవాలి. మొటిమల సమస్య ఉంటే గుజ్జుకు కొంచెం తేనె లేదా నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకొని 20 నిమిషాల పాటు అలాగే ఉంచుకోవాలి.
- **యాపిల్ పండు:** దీన్ని గుజ్జులా చేసి దానిలో కొద్దిగా తేనె కలపాలి. ఆ పేస్టును ఫ్రిజ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత దాన్ని బయటకు తీసి ముఖానికి రాసుకుని కాసేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.
- **ద్రాక్షపళ్లు:** మొటిమలతో బాధపడేవాళ్లు ద్రాక్షపళ్ల గుజ్జును ముఖానికి రాసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. గుజ్జు ఎండిపోయేంత వరకు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని కడిగేసుకోవాలి. ద్రాక్షపళ్ల ఫేస్‌ప్యాక్‌తో ముఖం మీద ఏర్పడ్డ చిన్న చిన్న మచ్చలు తొలగిపోతాయి.
- **బొప్పాయి పండు:** పండిన బొప్పాయి పండు గుజ్జును తీసి మెత్తగా చేసి దాన్ని ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాల పాటు అలాగే ఉంచుకోవాలి. తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని కడిగేసుకోవాలి.
- జిడ్డు చర్మం ఉన్నవారికి టమాటా మాస్క్ చాలా బాగా పనిచేస్తుంది. టమాటాను పిండి ఆ రసాన్ని ముఖానికి రాసుకోవాలి. కాసేపు అలాగే ఉంచుకున్న తర్వాత ముఖాన్ని నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారంలో మూడు రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

రారండోయ్.. అందంగా మార్చేస్తాం!

ఒక యాడ్.. 'ఎక్స్‌క్యూజ్ మి.. మీదే కాలేజ్?'
'నేను కాలేజా'.. అంటూ ఆశ్చర్యం!
ఇలా.. చర్మ సౌందర్యానికి కారణమేంటి? అనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది.
అంటే.. ఏం వాడుతున్నారు అని అర్థం.
కామన్‌గా.. మనకిలాంటి సిచువేషన్స్ రోజూ ఎదురవుతుంటాయి.
అలాంటి అందమైన అవకాశం కల్పిస్తున్నది పల్ప్.
ఇదొక బ్యూటీ ప్రొడక్ట్స్ ఆర్గనైజేషన్.
ఫుడ్ ఫర్ స్కిన్ నినాదంతో దీప్తి అలపతి నడిపిస్తున్నారు.
అందానికి పల్ప్‌ను ఎలా కేంద్రంగా మార్చారు?
నేటి బ్యూటీ జనరేషన్‌కు వారిచ్చే ప్రొడక్ట్స్ ఏంటి? ఆమెను అడిగి తెలుసుకుందాం.

అందం.. చూసే విధానంలో ఉంటుంది. కావచ్చు. అలాగనీ ఎలా పడితే అలా ఉండలేం కదా? ఏదో ఒక విధానం అనుసరించి అందానికి మెరుగులద్దే ప్రయత్నాలెన్నో చేస్తుంటాం. అది కూడా నచ్చకపోతే.. ఏం చేస్తాం? బ్రాండ్ మారుస్తాం కానీ అందానికి మెరుగులు అద్దడం మానేయం కదా? ఇలా ఒకొక్క అమ్మాయి దగ్గర పదులేసి బ్యూటీ ప్రొడక్ట్ ఐటమ్స్ ఉంటాయి. వీటికోసం ఏకంగా ఒక కిట్‌బాక్సే ఉంటుంది. అంటే.. నేటితరం అందమైన మనసుతో పాటు అందమైన శరీరాన్ని కూడా కోరుకుంటున్నది. వారి అవసరాలకు తగిన విధంగా సంస్థలు ప్రొడక్ట్స్ అందిస్తే ఆదరణ అంతకు రెట్టింపు ఉంటుంది. పల్ప్ అలాంటిదే.

అంతా ఎకోఫ్రెండ్లీ

'ఆమె ముఖం చంద్రబింబం వలె ప్రతిబింబించుచుండెను'.. స్కూల్‌డేస్‌లో ఇలాంటి ఉపమానాల గురించి చదివే ఉంటారు కదా? వెనకటి రోజుల్లో అలా ఉండేవారు. వర్ణనలు కూడా ఈ స్థాయిలో ఉండేవి. ఇప్పుడేమో.. 'అబ్బాయి నల్లగా ఉన్నాడంట.. అమ్మాయి నచ్చలే అంటున్నది'.. 'అమ్మాయి ఎర్రగానే ఉంది కానీ.. ముఖం మీద ఆ మొటిమలే బాలేవు'.. 'ముక్కు.. మొఖం బాగున్నాయి కానీ.. జిడ్డు చర్మం ఉన్నట్టుంది' వంటివి వింటున్నాం. వీటిలో తప్పులేదు. కానీ అందంకోసం నేటి జనరేషన్ ఇస్తున్న ప్రియారిటీ ఏంటో తెలుసుకోవచ్చు. అలాంటి ఏ సమస్య ఉన్నా సరిదిద్ది అందర్నీ అందంగా మార్చేస్తాం అంటున్నారు దీప్తి. అందుకోసమే పల్ప్ ద్వారా అన్నీ ఎకోఫ్రెండ్లీ ఉత్పత్తులనే అందిస్తున్నారు. తమ ప్రొడక్ట్స్ ద్వారా గ్యారెంటీగా అందాన్ని పొందవచ్చనే హామీ ఇస్తున్నారు.

ఫీడ్‌బ్యాక్ కాన్సెప్ట్

న్యూయార్క్‌లో చదువుకున్న దీప్తిది హైదరాబాద్. 2009లో ఇంజినీరింగ్ పూర్తిచేసింది. కొద్దికాలం పాటు ప్రతిష్ఠాత్మక టీ-హబ్‌లో పనిచేసింది. ఎంఎస్ ఫార్మర్ చేసిన గౌతమ్ ఉప్పలూరితో పరిచయం ఏర్పడింది. గౌతమ్ చర్మ సౌందర్య ప్రొడక్ట్స్ దీప్తికి చూపించాడు. మంచి ఐడియా. దీప్తికి నచ్చేసింది. వాటిని తెలిసినవాళ్లకు ఇచ్చారు. ఉపయోగించిన తర్వాత ఫీడ్‌బ్యాక్ ఇవ్వమన్నారు. ఏం ఎక్కువైంది? ఏం తక్కువైంది? అంతిమంగా దాని ద్వారా పొందే ఫలితం ఎలా ఉంటుంది? వంటి విషయాలు తెలుసుకున్నారు. రెట్టింపు స్పందన. రెట్టింపు ఉత్సాహం. ప్రతీ దాంట్లో దీప్తి క్రియాశీలంగా భాగస్వామి అయ్యింది. వీటిని మార్కెటింగ్ ఎలా చేయాలో దీప్తి చూసుకునేది.

పల్ప్ అంటే?

2018 నుంచి పల్ప్ నుంచి ఎలాంటి కెమికల్స్ ఉపయోగించని బాడీ లోషన్, స్క్రబ్బర్, ఫేస్‌మాస్క్, సబ్బులు వంటివి తయారు చేస్తున్నారు. ఆసక్తికర విషయం ఏంటంటే.. స్టార్టింగ్ నుంచి కూడా ఈ ఐటమ్స్‌ను మొదటగా దీప్తిపైనే ప్రయోగిస్తారు. ఎలాంటి దుష్ప్రభావాలు లేకుంటే వాటిని కొన్ని సాంపిల్స్ మార్కెట్లోకి తీసుకొస్తారు. కస్టమర్లు ఇచ్చే రేటింగ్ ప్రకారం వాటిలో మార్పులు చేర్పులు చేసి ఫైనల్‌గా నిర్ధారించిన తర్వాతనే విక్రయానికి పెడుతారు. పండ్లు, కూరగాయలను గుజ్జుగా చేసి ఈ ప్రొడక్ట్స్ చేస్తారు కాబట్టి దానికి పల్ప్ అనే పేరు పెట్టారు.

ఏమేం ఉంటాయి?

మొత్తం 16 ప్రొడక్ట్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే కాఫీ.. టీ స్క్రబ్స్ మన దగ్గర అంతగా దొరకవు. కాబట్టి వాటిని ఇండియాలో పరిచయం చేస్తున్నారు. సౌందర్యానికి ముఖ్య అవసరాలైన సబ్బులు, క్రీములు, లిప్‌బామ్‌లు, లోషన్‌లు వంటి బ్యూటీ ప్రొడక్ట్స్ అన్నింటినీ తయారు చేస్తున్నారు. తండ్రి బిజినెస్‌లో ఉన్నారు. తల్లి లాయర్ ప్రొఫెషన్‌లో ఉన్నారు. ఇంకేదైనా మంచి ఉద్యోగం చేసుకోక ఈ బ్యూటీ ప్రొడక్ట్స్ ఏంటి? అనేవాళ్లు ఉన్నారు. అయినా పేరెంట్స్ మాత్రం ఎలాంటి అడ్డు చెప్పలేదు. అంతేకాదు బిజినెస్‌లో ఆమెకు తోడుగా నిలుస్తున్నారు. కస్టమర్ నమ్మకాన్ని ఎలా నిలబెట్టుకోవాలో.. మార్కెట్‌కు అనుగుణంగా ఎలా మారాలో దీప్తికి వారే చెప్తూ ఎంకరేజ్ చేస్తున్నారు. ఇండియా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లోనే కాకుండా హెల్త్ అండ్ గ్లో, నైకా బ్రాండ్‌లో పెట్టాలని అనుకుంటున్నారు.

...✍ వనజ వనిపెంట
📷 చిన యాదగిరి గౌడ్

వర్క్‌షాపులు

పిల్లలకు ఆర్ట్ అంటే చాలా ఇష్టం. నేచురల్ సబ్బు వారితో తయారు చేపిస్తే చాలా బాగుంటుందని తెలిసినవాళ్లు సలహా ఇచ్చారు. పిల్లలు సబ్బుతో ఆడుకోవడమే కాకుండా తయారీ విధానాన్ని తెలుసుకుంటే ఇంకెంత బాగుంటుందో అని వర్క్‌షాపులు నిర్వహించింది. దీనికి ఫీజు రూ. 2000 వరకు ఉంటుంది. 2 ఏండ్ల నుంచి 16 ఏండ్ల వయసున్న వారు వర్క్‌షాప్‌కు హాజరు కావచ్చు. పిల్లలతో పాటు తల్లి కూడా వెంట రావచ్చు. కావాల్సిన మెటీరియల్ అంతా వారే చూసుకుంటారు. దీంతో పిల్లల్లో ఊహాశక్తి, క్రియేటివిటీ, ఆలోచనా విధానం మెరుగవుతుందంటున్నది. దీప్తి పిల్లలకు శిక్షణ ఇస్తుంది. ఇప్పటివరకు 12 వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ ప్రొడక్ట్స్‌కు కావాల్సిన ఇంగ్రీడియంట్స్ భారత్‌లో దొరకకపోతే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. మెయిన్ ఆఫీస్ పటాన్‌చెరులో ఉంది.



ఎక్కువగా సెలబ్రిటీలే

–దీప్తి

పల్ప్‌కు కస్టమర్లు సెలబ్రిటీలే. దీపికా పదుకొనే, మలైకా అరోరా, కీర్తి సురేష్ ఇలా చాలా మంది రెగ్యులర్ కస్టమర్లు. ప్రొడక్ట్స్ బాగున్నాయని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటారు. రానున్న ఆరు నెలల్లో మేకప్‌కు కావాల్సిన కాస్మొటిక్స్ తయారీపై దృష్టి సారిస్తాం. ఇలా ఒకటి సక్సెస్ అయిన తర్వాత మరో దానికి వెళ్తాం. ఆన్‌లైన్‌లో మొదలుపెట్టిన ఆరు నెలల్లో ఆరు లక్షల ప్రొడక్ట్స్ అమ్ముడుపోయాయి. ముందుగా చర్మాన్ని టెస్ట్ చేసి ప్రొడక్ట్స్‌ని డిసైడ్ చేసే ప్రక్రియ, యాప్‌తో స్కిన్‌ను టెస్ట్ చేసి ఏ ప్రొడక్ట్ వాడాలి అనే పద్ధతిని మొదలుపెడుతాం. ఒక్కో ప్రొడక్ట్‌కు ఒక్కో ధర ఉంటుంది. కస్టమర్లను తృప్తి పరుచడమే మా లక్ష్యం. మరింత వివరాల కోసం https://www.instagram.com/pulp_india లో చూడొచ్చు.

కలలు కని.. లక్ష్యాన్ని చేరుకొని

చిన్నప్పుడు టీవీలో 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' డాక్యుమెంటరీ చూస్తూ పెరిగింది. పెద్దయ్యాక వాళ్లలాగే ఆకాశంలో ఎగరాలని కలలు కన్నది. పరీక్షలు రాసింది. ఫెయిలయింది. మళ్లీ ప్రయత్నించింది. సాధించింది. 26 ఏండ్ల వయస్సులోనే 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్'లో ఉద్యోగం సాధించి తన కలను సాకారం చేసుకుంది త్రిపురకు చెందిన బిపాష.

సహోద్యోగులు చెప్పేంతవరకూ ఆమెకే తెలియదు ఆ విభాగంలో తొలి మహిళ తానే అని. త్రిపురలోని బిర్‌బిక్రామ్ ఎయిర్‌పోర్ట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో ఉద్యోగంలో చేరిన మొదటి మహిళ బిపాష. చిన్నప్పటి నుంచీ ఈ ఉద్యోగం కోసం కలలు కన్నది. తండ్రి ఉద్యోగరీత్యా ఎక్కువ ట్రాన్స్ఫర్లు ఉండేవి. దీంతో బిపాషా స్కూల్ విద్య ఒక్కదగ్గరే జరగలేదు.మహారాష్ట్రలోని కొంకన్ జ్ఞాన్ పీఠ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ చదవింది. తర్వాత ఓ మార్కెటింగ్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. కానీ ఆమె లక్ష్యం ఎయిర్‌ఫోర్స్‌లో పని చేయాలని. దీంతో మార్కెటింగ్ మానేసి ఈ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేసింది.2015లో మొదటి ప్రయత్నం విఫలం అయినా రెండోసారి 2017లో పరీక్ష పాసైంది. చివరికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఉద్యోగానికి అర్హత సాధించింది. శిక్షణ, ఉద్యోగం ముంబైలోని ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్ట్‌లో చేసింది. అప్పుడు తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో సొంతరాష్ట్రానికి బదిలీ చేయాలని అర్జీ పెట్టుకుంది. ఉన్నతాధికారులు స్పందించి ఆమెను త్రిపురలోని బిర్‌బిక్రామ్ ఎయిర్‌పోర్ట్‌కు బదిలీ చేశారు. తర్వాత తెలిసింది. ఆమెనే అక్కడ మొదటి మహిళా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ అని. ఇలా చిన్నప్పటి డ్రీమ్స్‌నే కష్టపడి సాధించింది బిపాష.

ఉల్లికాడలు ఆరోగ్యజాడలు

చాలామంది ఉల్లికాడల్ని కూరల్లో ఉపయోగించడానికి ఇష్టపడరు. కానీ వాటి వల్ల అనేక లాభాలుంటాయి. ఆకు కూరల మాదిరిగా ఎన్నో పోషకాలు వీటిలో లభిస్తాయి. ఉల్లికాడల వల్ల ఏమేం ఆరోగ్య ప్రయోజనాలున్నాయంటే..

- ఉల్లికాడల్లోని ఎ, సి విటమిన్లు రోగనిరోధక వ్యవస్థను శక్తివంతం చేస్తాయి. ఇన్‌ఫెక్షన్ బారినుంచి కాపాడుతాయి. వీటిలో ఫైబర్, ఏ, బి, సి విటమిన్లు ఫోలేట్‌తో పాటు పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటి మూలకాలు అధికంగా ఉంటాయి. వీటితో సలాడ్స్, సూప్ కాకుండా కూర వండినా రుచికరంగానే ఉంటుంది.
- ఉల్లికాడల వల్ల శరీరానికి సూక్ష్మ పోషకాలు అందుతాయి. ఇవి జీవక్రియల్ని నియంత్రిస్తాయి. ఉల్లిపొరల్లోని సల్ఫర్ రక్తపీడనాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. తద్వారా రక్తంలో చక్కెర నిల్వలు పెరుగకుండా చూస్తుంది.
- వీటిలో లభించే అలైల్ సల్ఫైడ్ ఫ్రీరాడికల్స్‌ను బయటకు పంపుతుంది. కేన్సర్ కణాలను ఉత్పత్తి చేసే ఎంజైమ్‌ల విడుదలను సైతం ఇది నిలిపివేస్తుంది. ఉల్లికాడల్లోని కె, సి విటమిన్లు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ వైరల్ గుణాలు జలుబు, దగ్గును నివారిస్తాయి.
- ఉల్లికాడల్లో కంటి ఆరోగ్యానికి మేలు చేసే కెరొటినాయిడ్స్, ఏ విటమిన్ అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థం జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. తరచూ ఉల్లికాడల్ని ఆహారంలో తీసుకుంటే కంటికి కూడా మంచిది .

గ్రీన్ అంబాసిడర్

పిల్లలు చేసే పనులు ఒక్కోసారి ఎన్నో ఆలోచనలకు తావిస్తాయి. ఎన్నో పనులకు దారితీస్తాయి. ఇట్లాంటి నేపథ్యాన్ని కలిగిందే ఈ చిన్నారి బ్రాండ్ అంబాసిడర్ కథ. చెట్లపై ఆమెకున్న ప్రేమ ప్రభుత్వాన్నే కదిలించింది. ఇప్పుడు ఆమె ఆ రాష్ట్రానికి 'మిషన్ గ్రీన్ బ్రాండ్ అంబాసిడర్' అయింది.

ఆమె ఒకటో తరగతి చదువుతున్నప్పుడు పాఠశాల దగ్గర్లోని ఓ నది పక్కన రెండు మొక్కలు నాటింది. వాటికి రోజూ నీళ్లు పోస్తూ శ్రద్ధగా పెంచింది. ఇలా నాలుగేండ్లు గడిచాయి. ఇప్పుడామెకు తొమ్మదేండ్లు. మొక్కలు పెరిగాయి. వాటిపై ఆ పాపకు ప్రేమ కూడా పెరిగింది. చెట్లను కంటికి రెప్పలా పెంచిన ఆ పాప పేరు ఎలగంబం వాలెంటీన దేవి. మణిపూర్‌లోని కాక్‌చింన్ జిల్లాకు చెందిన బాలిక. చిన్నప్పటి నుంచీ చెట్లంటే ఆమెకు ఎంతో ఇష్టం. కానీ ఓ రోజు రోడ్డు వెడల్పులో భాగంగా నది దగ్గర ఈమె నాటిన చెట్లను నరికేశారు. ఇలా నరికేయడాన్ని ఆమె కండ్లారా చూసింది. గుక్కపెడుతూ ఏడ్చింది. చిన్నప్పటి నుంచీ పెంచిన ఆ చెట్లు ఒక్కసారిగా నేలకొరిగాయి. ఈ పాప మాత్రం ఏం చేయాలో అర్థం కాక ఏడుస్తూనే ఉండిపోయింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. చెట్లను నరికివేయడం పట్ల ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. చెట్లపై ఈ చిన్నారికి ఉన్న ప్రేమ, అభిమానాన్ని గుర్తించి 'మణిపూర్ మిషన్ గ్రీన్' కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ పర్యావరణ పరిరక్షణ మీద అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అట్లాగే ఈ పాప చెట్లు నరికేసినందుకు మరో 20 మొక్కలు, వాటి కోసం స్థలం చూపించాలని జిల్లా పోలీస్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ పాపకంటే మంచి అంబాసిడర్ అండరనీ ప్రభుత్వం దేవినే అంబాసిడర్‌గా నియమించింది.

వంటింటి చిట్కాలు

- ఐస్‌క్యూబ్స్ ఫ్రిజ్‌లో పెడుతున్నారా? అయితే ఐస్‌క్యూబ్ ట్రే నీరు వేసే ముందు ఆ నీటిని కాచి, వడపోత చేసి వేయండి. ఇలా చేస్తే అందులోని కనిపించని మలినాలు తొలగిపోతాయి. ఐస్ క్యూబ్స్ క్రిస్టల్స్ క్లియర్‌గా వస్తాయి. రెగ్యులర్ వాటర్‌తో తయారైన ఐస్‌క్యూబ్స్ తెల్లగా ఉంటాయి.
- గుడ్లు వండే ముందు వాటిని ఒకసారి చెక్ చేయాలి. అవి తాజావా కాదా తెలుసుకోవాలంటే.. ఓ జగ్గులో నిండా నీళ్లు పోసి గుడ్డును వేయాలి. గుడ్డు తేలిందో అది చాలా రోజులు నిల్వ చేసిందని అర్థం. అలా కాకుండా అది నీటి అడుగుకు చేరి అడ్డంగా పడితే ఆ గుడ్డ తాజాదని అర్థం.
- ఓవెన్‌లో కూడా గుడ్లను ఉడకబెట్టొచ్చు. 160 డిగ్రీల వద్ద వాటిని 15 నిమిషాలు పెడితే బాగా ఉడుకుతాయి.
- ఐస్‌క్రీంను కొని డీప్‌ఫ్రిజ్‌లో పెడితే తినే సమయానికి గడ్డకట్టేస్తుంది. అలా కాకుండా ఉండాలంటే ఐస్‌క్రీమ్ బాక్స్‌ను ఓ కవర్‌లో చుట్టి డీప్ ఫ్రిజ్‌లో పెడితే ఐస్‌క్రీము గడ్డ కట్టకుండా ఎప్పుడైనా తినేందుకు వీలుగా ఉంటుంది.
- చేపలు గ్రిల్ చేస్తున్నప్పుడు గ్రిల్‌పై ముందు నిమ్మకాయ ముక్కల్ని పరిచి, దానిపై చేప ముక్క పెట్టి గ్రిల్ చేయాలి. ఇలా చేస్తే మంచి రుచి వస్తుంది.

రష్మీదత్.. సరికొత్త తంత్రం

కొందరు చిన్న సమస్యలను భూతద్దంలో చూస్తూ అనవసరమైన అపోహలతో ఉజ్వలమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటూ ఉంటారు. మరికొందరు మానసికంగా నలిగిపోయి చివరకు ఏ అఘాయిత్యానికో పాల్పడుతారు. అటువంటి వారిలో వినూత్న విధానం ద్వారా మార్పు తీసుకొస్తున్నది ఓ మానసిక నిపుణురాలు. సరైన పరిష్కార మార్గాల్ని చూపిస్తూ మానసిక రుగ్మతలను దూరం చేస్తున్నది.

ముంబైకి చెందిన రష్మీ దత్ బిట్స్ పిలానీ నుంచి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఓ సంస్థలో హెచ్‌ఆర్‌గా చేరింది. ఆ సమయంలో ఉద్యోగుల మానసిక ధోరణులను గమనించేది. కొందరు అనవసరంగా ఆవేశపడి ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవాళ్లు, మరికొందరు మానసికంగా కుమిలిపోతుండేవాళ్లు. అటువంటి వాళ్ల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తుండేది. కొన్నాళ్లకు మానసికశాస్త్రంలో డిగ్రీ పొందింది. అప్పటి నుంచి ఎంతోమందికి కౌన్సెలింగ్ ఇస్తూ మానసిక రుగ్మతల నుంచి వారిని బయటపడేసింది. కౌన్సెలింగ్‌తోపాటు ఇతర విధానాల ద్వారా మనసును ఎలా నియంత్రించుకోవాలి? మనసుకు తగిలిన గాయాలను ఏ విధంగా నయం చేసుకోవాలి? అనే అంశాలపై పరిశోధనలు చేసింది. మనిషి భావోద్వేగాలను అర్థం చేసుకునేందుకు సైకోడ్రామా ప్రక్రియ సరైందని గుర్తించింది. ఈ ప్రక్రియలో నటించడం అనేది కీలకం. వారిలోని కోపం, ఆందోళన, ఒత్తిడి వంటి రుగ్మతలకు ఈ విధానం ద్వారా అర్థం చేసుకుని వారిని మామూలు మనుషులుగా తీర్చి దిద్దుతున్నది. ఈ పద్ధతిలో గతంలో వారు ఎదుర్కొన్న సమస్య తాలూకు పాత్రలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆ క్యారెక్టర్ వల్ల జరిగిన లోపాలను డ్రామా రూపంలో వారి ముందు ఉంచుతుంది. అప్పుడు ఆయా సందర్భాలను సమస్యగా గుర్తించి వారి మనసులో ఉన్న భయాందోళనలను తుడిచి వేస్తున్నది. బాధితులకు వ్యక్తిగతంగానూ, బృందాలుగానూ సమావేశాలు ఏర్పాటు చేసి వారి మానసిక రుగ్మతలను తొలగిస్తున్నది రష్మీదత్. పది నుంచి 15 మంది సభ్యులతో సెషన్ ఏర్పాటు చేసినప్పుడు సమయం వృథాకాకుండా అందరి సమస్యలను పరిష్కరించగలుగుతున్నానని చెబుతున్నది ఆమె. సైకోడ్రామా విధానంలో భారతదేశంలో ముగ్గురు మాత్రమే గుర్తింపు పొందారు. ఆ ముగ్గురిలో రష్మీదత్ ఒకరు. 'వేద దర్మ' సైకోడ్రామా సొసైటీ ద్వారా ఆమె ఎంతోమంది మానసిక రోగులకు పరిష్కారాలందిస్తున్నది. బెంగళూరు, ఢిల్లీ, కోయంబత్తూర్ వంటి నగరాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది. కోపాన్ని ఎలా నియంత్రించుకోవాలి? దానివల్ల తలెత్తే సమస్యలను గమనించేందుకు రష్మీదత్ ప్రత్యేకంగా రెండు పుస్తకాలు రాసింది. వీటిని అమేజాన్ వెబ్‌సైట్‌లో ఉంచగా ప్రపంచదేశాల నుంచి మంచి స్పందన వచ్చింది. మానసికంగా కుంగిపోయేవారికి ఉచితంగా చికిత్స చేస్తున్న రష్మీదత్ సేవలను అందరూ ప్రశంసిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[కరీంనగర్]
మంగళవారం 13 ఆగస్టు 2019

వ్యాధులతో.. పిల్లలు భద్రం

పిల్లలకు జలుబు చేసినా ఆందోళ నే. అది జలుబేనా? లేక ఏదైనా విష జ్వరమా? అనే భయం. పిల్లల స్పెషలిస్ట్‌కు చూపించాలా? అందుబాటులో ఉండే డాక్టర్‌కు చూపించాలా? సమస్య ఏంటి? చికిత్స ఏంటి? వంటి విషయాలపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చు. ఇది వ్యాధుల సీజన్. ఏయే వ్యాధులు పిల్లలను వేధిస్తాయి? వాటికి పరిష్కారాలేంటి తెలుసుకుందాం.

ఈ సీజన్‌లో వ్యాధులన్నీ కట్టగట్టుకొని అదును కోసం ఎదురుచూస్తుంటాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పిల్లలపై దాడి చేసి తీవ్ర అనారోగ్యానికి గురిచేస్తాయి. అపరిశుభ్రత వల్ల కొన్ని వ్యాధులు వస్తే.. అజాగ్రత్త వల్ల ఇంకొన్ని వస్తాయి.

ఎలాంటి వ్యాధులు?

డయేరియా, టైఫాయిడ్, కామెర్ల వంటి వ్యాధులు అపరి శుభ్రమైన నీటివల్ల సంక్రమిస్తాయి. డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటివి దోమకాటు వల్ల వస్తాయి. ఈ సీజన్ దోమల సంతతి పెరుగడానికి అనుకూలమైంది. నీటిని.. ఆహారాన్ని కలుషితం చేయడంలో, వ్యాధులను కలిపించడంలోనూ దోమ లది పెద్ద పాత్రే. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం, ఎండ తక్కువగా వస్తుండటంతో బ్యాక్టీరియా, వైరస్‌లు విజృంభిస్తుంటాయి. ఇవన్నీ కలిసి మూకుమ్మడిగా దాడి చేయడంతో

పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజురోజుకూ బాక్టీరియా, వైరస్‌ల వల్ల కలిగే వ్యాధులు పెరిగిపోతున్నాయి.

కారణమేంటి?

జలుబు వంటి చిన్నపాటి సమస్యతో ఈ వ్యాధులు ప్రారంభం అవుతాయి. తర్వాత అవి ముదిరి శ్వాస సంబంధ వ్యాధులకు దారితీస్తుంటాయి. కారణమేంటి? అంటే.. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటమే. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల్లో కనిపించే మరొక తీవ్రమైన ఆరోగ్య సమస్య డయేరియా. దీనినే విరేచనాల వ్యాధి అంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం ఐదేండ్లలోపు పిల్లలు 1,67,000 మంది విరేచనాల సమస్య వల్ల చనిపోతున్నారు. అంటే.. ఇది ఎంత తీవ్రమైన వ్యాధో అర్థం చేసుకోవచ్చు. అపరిశుభ్రత వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొన్నది.

> **ఆలస్యం చేయొద్దు**
>
> పిల్లల్లో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయొద్దు. తప్పనిసరిగా చిల్డ్రన్ స్పెషలిస్ట్ దగ్గరికి తీసుకెళ్లాలి. అది వ్యాధి అవునో లేదో తెలుసుకోవడం కోసం రక్తపరీక్షలు చేయించాలి. ఉదాహరణకు డెంగ్యూ వ్యాధే అనుకుందాం. రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా తగ్గిపోతుంది. ఎర్రరక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. అది డెంగ్యూ అని డాక్టర్ నిర్ధారించిన తర్వాత ఆలస్యం చేయొద్దు. పిల్లలు చురుకుగా ఉండి, సాధారణ స్థాయిలో తింటున్నా కూడా డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స జరిగితే ఏ వ్యాధి అయినా నయం అవుతుంది.

ఎలా గుర్తించాలి?

చిన్నపాటి ఆరోగ్య సమస్యలే అయినా లక్షణాలు ఎలా మారుతున్నాయో గుర్తించాలి. మార్పులకు అనుగుణంగా చికిత్స చేయిస్తే సమస్యను ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించవచ్చు. ఉదాహరణకు డెంగ్యూ వ్యాధి ప్రారంభ లక్షణాలు సాధారణ వైరల్ జ్వరాల లక్షణాల మాదిరిగానే కనిపిస్తాయి. అయితే మనం ఏమనుకుంటాం? మామూలుగా వచ్చే జ్వరమే అయి ఉండొచ్చు అనుకుంటాం. కానీ డెంగ్యూ వల్ల వచ్చిన జ్వరంతో శరీరమంతా కాలిపోతుంది. వణుకు కూడా పుడుతుంది. ఎముకలు, కీళ్లు, కళ్లు నొప్పిగా ఉంటాయి. కళ్లు, ముఖం ఎర్రబారుతాయి. శరీరంపై దద్దుర్లు కనిపిస్తాయి. ఆయాసంగా అనిపిస్తుంది. ఆకలిగా ఉండదు. మూత్రం తగ్గిపోతుంది. వాంతులవుతాయి. మలంలో రక్తం వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌కు చూపించాలి.

జాగ్రత్త ముఖ్యం

చికిత్స ఎలాగూ ఉంటుంది కదా అని దేనినీ నిర్లక్ష్యం చేయొద్దు. చికిత్స దాక ఎందుకు? అసలు సమస్య ఎందుకు తెచ్చుకోవాలి? అని ఆలోచిస్తే ఏ సమస్యా దరిచేరదు. ఈ సీజన్‌లో వాతావరణం అస్థిరంగా ఉంటుంది. కొన్ని రోజులు బురదగా.. మరికొన్ని రోజులు దుమ్ముగా ఉంటుంది. కాబట్టి పిల్లలను వేడి నీటితో స్నానం చేయించడం మంచిది. వాతావరణం బాగా చల్లగా ఉంటే వేడినీటిలో ముంచిన శుభ్రమైన బట్టతో శరీరమంతా తుడువాలి. మొత్తం మీద చర్మం శుభ్రంగా, పొడిగా ఉండేట్లు చూసుకోవాలి. పసిపిల్లలను దోమతెరలో పడుకోబెట్టాలి. పొగవల్ల పిల్లలు అలర్జీకి గురవుతారు కాబట్టి దానికి దూరంగా ఉండాలి.

వాక్సినేషన్

పసిపిల్లల ఆరోగ్యం కాపాడుకోవడంలో ముఖ్యమైనది వాక్సినేషన్. ముఖ్యంగా అంటువ్యాధుల నుంచి రక్షించుకోవడానికి వ్యాక్సిన్స్ చాలా ఉపయోగపడుతాయి. టైఫాయిడ్, ఇన్‌ఫ్లూయెంజా, రోటావైరస్ డయేరియా, హెపటైటిస్ –ఎ వంటివి వ్యాక్సిన్ ద్వారానే తగ్గిపోతాయి. డెంగ్యూ వ్యాధికి కూడా వ్యాక్సిన్ సిద్ధం చేస్తున్నారు. పిల్లల స్పెషలిస్ట్‌ను కలిస్తే ఏ సమయంలో.. ఏ వ్యాక్సిన్ ఇవ్వాలో సిఫార్సు చేయగలుగుతారు. వీటిని డాక్టర్ సలహామేరకు వాడాల్సి ఉంటుంది.

డాక్టర్ శ్రీనివాస్ మిడివెల్లి
సీనియర్ పీడియాట్రిషియన్
యశోద హాస్పిటల్స్
మలక్‌పేట్, హైదరాబాద్

చురుకుదనం తగ్గుతున్నదా?

కొందరు పిల్లలు.. చాలా డల్‌గా కనిపిస్తుంటారు. దేనిమీదా ఆసక్తి కనబర్చరు. మనసెక్కడో ఉన్నట్టు ప్రవర్తిస్తుంటారు. అప్పుడు వారిపై కసురుకోకుండా వారితో ప్రేమగా ఉండాలని అంటున్నారు నిపుణులు. ఎందుకంటే అదొక మానసిక సమస్య.

పిల్లల ఆలోచనా విధానంలో మార్పు రావడం.. ఆబ్సెంట్ మైండ్‌తో ఉండటాన్ని attention deficit hyperactivity disorder (ADHD) అంటారు. హార్మోన్లు, విటమిన్ల వల్ల కొందరికి ఈ సమస్య వస్తే.. మరికొందరికి జన్యుపరమైన సమస్యల వల్ల వస్తుంది. చాలామందికి మేనరికం వల్ల తమకు పుట్టిన బిడ్డల్లో ఏడీహెచ్‌డీ సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలను గమనిస్తే.. వారు తోటి పిల్లలతో ఎలా ఉంటున్నారో పరిశీలించాలి. మూడ్ ఆఫ్‌లో ఉండకుండా ఏదో ఒక ఆసక్తికర విషయంపై చర్చిస్తుండాలి. ప్రశాంత వాతావరణం కల్పించాలి. క్రియేటివిటీకి అవకాశం ఉన్న ఆటలవైపు దృష్టి మళ్లించాలి. సంగీతం.. పెయింటింగ్.. డ్యాన్స్ వంటివి అలవాటు చేస్తే మెదడులో ఆహ్లాదకర భావాలు ఏర్పడుతాయి. ఇవి మానసిక పరిస్థితిని అదుపుచేయడానికి, ఎదుగుదలకు తోడ్పడుతాయి.

మెగ్నీషియం లోపమా?

పోషకాలు సమపాళ్లలో ఉంటేనే ఆరోగ్యం. లేకపోతే ఏదో ఒక రూపంలో అనారోగ్యం బయటపడుతుంది. ముఖ్యంగా శరీరంలో మెగ్నీషియం తగ్గితే చాలా ప్రభావం చూపుతుంది. శరీరంలో జరిగే 300 రకాల రసాయనిక చర్యల్లో దీనిపాత్ర ఉంటుంది. గుండె కొట్టుకోవడం నుంచి కండరాలు, హార్మోన్ల పనితీరు వరకు మెగ్నీషియం క్రియాశీలకంగా పనిచేస్తుంది.

మెగ్నీషియం తగ్గితే ఆకలి ఉండదు. తల తిరుగుతుంది. ఒత్తిడి పెరుగుతుంది. తిమ్మిర్లు వస్తాయి. శరీరం మొద్దుబారుతుంది. నొప్పులు విపరీతంగా ఉంటాయి. అయితే ఇవన్నీ సాధారణంగా అన్ని ఆరోగ్య సమస్యల్లోనూ కనిపించడం వల్ల మెగ్నీషియం లోపం అనే సందేహం రాదు. అందుకే ఇలాంటి లక్షణాలు ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. మెగ్నీషియం సమపాళ్లలో తీసుకోవాలి. మితిమీరిన కాఫీ, ఆల్కహాల్, సోడా వంటివి తగ్గించాలి. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకుంటే అది డీ విటమిన్‌ను శోషించదు. దీనివల్ల మెగ్నీషియం కొరత ఏర్పడుతుంది. తీపి పదార్థాలను అతిగా తిన్నా కూడా కిడ్నీల ద్వారా మెగ్నీషియం బయటకు పోతుంది. ఆకుకూరలు, గింజలు, తృణ ధాన్యాలు, చేపలు, పెరుగు, అరటిపండ్లు, డార్క్ చాక్లెట్స్ తింటే మెగ్నీషియం అందుతుంది.

కాఫీతో పార్శ్వపునొప్పి



కాఫీ.. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నూతన ఉత్తేజం వస్తుంది. ఇలా రిఫ్రెష్‌మెంట్ కోసమనీ ఏం చేస్తుంటాం? రోజులో ఐదారు కాఫీలు తాగుతాం. ఇది కనిష్ఠంగానే. అయితే మూడుకంటే ఎక్కువసార్లు తాగితే దుష్ప్రభావాలు తప్పవని అంటున్నారు నిపుణులు.

తలనొప్పిస్తుంది అని కాఫీ తాగుతాం. కానీ అదే కాఫీ మరో రకం తలనొప్పిని కలిగిస్తుందనే నిజాన్ని తెలుసుకోవాలని అంటున్నారు అమెరికా శాస్త్రవేత్తలు. Beth Israel Deaconess Medical Center (BIDMC)కు చెందిన పరిశోధకులు తాజాగా ఓ అధ్యయనం చేశారు. మోతాదుకు మించి కాఫీ తాగడం వల్ల అది మెదడుపై ప్రభావం చూపిస్తుందట. రోజులో గరిష్ఠంగా మూడుసార్ల కంటే ఎక్కువ కాఫీలు తాగడం వల్ల ముఖ్యంగా పార్శ్వపునొప్పి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. సంతోషంగా ఉన్నా.. ఆందోళనలో ఉన్నా కాఫీ తాగే అలవాటు పెరిగిపోతుందని.. ఇది అంత మంచిది కాదని వారు సూచిస్తున్నారు. మూడుసార్లు మించకుండా తాగితే కాఫీతో రిఫ్రెష్‌మెంట్ కలుగుతుందని వెల్లడించారు.

బీపీ తెలిపే సెల్ఫీ!

బీపీ వల్ల మానసిక ఒత్తిడి, ఆందోళన, గుండెపోటు వంటి సమస్యలు వస్తున్నాయి. అందుకే అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. ప్రతీసారి డాక్టర్‌ను సంప్రదించలేం. ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా బీపీని గుర్తించి అప్రమత్తం కావచ్చు అని అంటున్నారు నిపుణులు.

వీడియో సెల్ఫీతో రక్తపోటు తెలుసుకోవచ్చునని అంటున్నారు కెనడా పరిశోధకులు. యూనివర్సిటీ ఆఫ్ టొరంటోకు చెందిన పరిశోధకులు దీనిని తయారుచేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ప్రయోగాలు చేసి ఓ నిర్ధారణకు వచ్చారు. చర్మం లోపల చిత్రాలు తీసే సాఫ్ట్‌వేర్‌తో పలువురు ముఖాలు వీడియో తీసి రక్తపోటు వివరాలను సేకరించారు. ఒక్కొక్కరిపై సుమారు రెండు నిమిషాలు ఈ పరీక్ష చేశారు. వీటిని భౌతికంగా సేకరించిన వివరాలతో సరిపోల్చి మెషీన్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా రక్తప్రసరణలోని మార్పులను గుర్తించారు. దీని ఆధారంగానే రక్తపోటును లెక్కగట్టారు. దీని ద్వారా 95% కచ్చితత్వంతో కాలిక్యులేషన్స్ ఉన్నట్లు టొరంటో యూనివర్సిటీ పరిశోధకులు స్పష్టం చేశారు. దీనిని మరింత డెవలప్ చేసి అర నిమిషంలో వీడియో సెల్ఫీ ద్వారా బీపీని లెక్కపెట్టగలిగే విధానాన్ని రూపొందించనున్నట్లు వారు వివరించారు.

సీ–విటమిన్ తీసుకోండి

ఏ సమస్యా రాకుండా శరీరాన్ని కాపాడేది రోగనిరోధక వ్యవస్థ. అయితే సీ–విటమిన్ లోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రోగాలు దాడి చేస్తాయి. గాయాలు త్వరగా మానవు. ఎముకలు విరిగితే త్వరగా అతుకవు. సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, ఉసిరి, జామ, టమాటా, ఆకు కూరల్లో పుష్కలంగా సీ–విటమిన్ ఉంటుంది. కాబట్టి వాటిని క్రమం తప్పకుండా తినాలి. సప్లిమెంట్స్ ద్వారా కూడా సీ–విటమిన్ అందకపోతే రక్తనాళాలు పెళుసుగా మారుతాయి. చిగుళ్లు చిట్లి రక్తస్రావం అవుతుంది. స్కర్వీ వ్యాధి సోకుతుంది.

ఆధునిక జీవనశైలి వల్ల విటమిన్ల లభ్యత సరిగా ఉండటం లేదు. అలాంటి వాటిలో సీ- విటమిన్ ముఖ్యమైంది. ఇది కణాంతరాల్లో కొల్లాజెన్ ఏర్పడటానికి దోహదం చేస్తుంది. దంతాలలో డెంటిన్ పదార్థం ఏర్పడటానికి కూడా సీ-విటమిన్ ఉపయోగపడుతుంది.



సుడోకు

డైలీ సుడోకు 120 సమాధానం

6	2	3	8	4	9	5	7	1
4	8	1	7	5	6	3	9	2
9	5	7	3	2	1	6	8	4
7	3	4	1	9	2	8	6	5
2	9	6	5	7	8	4	1	3
8	1	5	4	6	3	7	2	9
3	6	9	2	8	5	1	4	7
5	4	8	9	1	7	2	3	6
1	7	2	6	3	4	9	5	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -121

					4		1	7
	5		9	2	7		6	
	6		4					8
4		2				9		6
8					2		3	
	2		5	1	9		4	
5	8		6					

సాధారణ సమస్యలు కావు.. క్యాన్సర్ కారకాలు!

కొందరికి బాగా తలనొప్పి వస్తుంది. పని ఒత్తిడిలే అనుకుంటారు. ఆయాసం వస్తే.. తిన్నది జీర్ణంగాక కావచ్చు అనుకుంటారు. విపరీతమైన గొంతునొప్పి వస్తే.. వాతావరణంలో మార్పులనుకుంటారు. కానీ.. వీటిలో ఏది తీవ్రంగా ఉన్నా అది క్యాన్సర్‌కు దారితీస్తుందనే విషయం తెలుసుకోరు!

సలహా

జ్వరంగా ఉందనుకోండి.. ఏం చేస్తాం? డాక్టర్ దగ్గరకు గానీ.. మెడికల్ షాప్‌కు గానీ వెళ్లడానికి కుదరదు. కారణం బిజీలైఫ్. ఏవైనా గడ్డలైతే ఏం చేస్తాం? వేడి చేయడం వల్ల అలా అయుండొచ్చు.. గతంలో తగిలిన దెబ్బల చిహ్నాలై ఉండొచ్చు అనుకుంటాం. కానీ ఇవేంటి అని జాగ్రత్త పడని వాళ్లు చాలామంది ఉన్నారు. ఇలాంటి వాళ్లకు క్యాన్సర్ గురించి తెలియదు. పైగా వీటన్నింటినీ లైట్‌గా తీసుకుంటారు.

ఎందుకు?: నిరక్షరాస్యత.. గ్రామీణ నేపథ్యం.. ఆర్థిక పరిస్థితులు.. అమాయకత్వం వంటివి ఇలాంటి ఆరోగ్య సమస్యలకు ఒక కారణం అయితే బిజీలైఫ్ మరో కారణం. ఫోన్లోనో లేక ఇంటర్నెట్‌లోనో వైద్య సలహాలు పొందుతారు. వీటివల్ల తాత్కాలిక ఉపశమనం వస్తుండొచ్చు కానీ దీర్ఘకాలికంగా అలాగే ఉంటే మాత్రం క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లే.

అవగాహన అవసరం: క్యాన్సర్‌ను గుర్తించాలంటే ముందు ఆ వ్యాధిపట్ల అవగాహన కావాలి. ముందు దశలోనే దానిని గుర్తిస్తే ఆధునిక వైద్య చికిత్సలను అనుసరించి నయం చేసుకోవచ్చు. అందుకోసం అత్యాధునిక విధానంలో చికిత్స అందించేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ పని పడితే ఆరోగ్యంగా ఉండొచ్చు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాలంటే కొన్ని సర్వ సాధారణ లక్షణాలను గుర్తించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తలనొప్పి, గొంతునొప్పి, ఆయాసం, దగ్గు, కడుపు ఉబ్బరం, మూత్ర వ్యవస్థలో తేడాలు, మలవిసర్జన సమస్యలు గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు.

తలనొప్పి: మామూలుగా అందరికీ వస్తుంది. చికాకు, పనుల ఒత్తిడి, ఎండ, కొన్ని రకాల వాసనలు, ఆకలి వంటి కారణాలతో మైగ్రెయిన్ లేక అప్పుడప్పుడు తలనొప్పి రావటం సహజమే. తలనొప్పి లక్షణాలు కన్పించగానే సొంత వైద్యం చేసుకునేందుకు ఎడాపెడా ఇష్టమొచ్చిన మందులు వాడితే లివర్, కిడ్నీలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. కాబట్టి ముందుగా చేయాల్సింది తలనొప్పికి కారణం తెలుసుకోవాలి. నిర్దిష్టకాలం పాటు సరైన మందులు వాడాలి. ఇలా చేస్తేనే సమస్యను అధిగమించవచ్చు.

గొంతునొప్పి: చల్లటి పదార్థాలు తీసుకోవడం వల్ల.. వాతావరణంలో మార్పుల వల్ల.. ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు.. గొంతు సమస్యలు వస్తుంటాయి. ఈ సమస్యలు రెండు మూడు రోజుల్లో తగ్గకపోతే డాక్టర్ సలహా ప్రకారం కోర్సుగా మందులు వాడాల్సి ఉంటుంది. థైరాయిడ్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ లక్షణాలు తొలిదశలో ఇలాగే ఉంటాయి.

దగ్గు, ఆయాసం: సిగరెట్లు తాగేవారు తమకు ఇలాంటివి అలవాటే అనుకుంటారు కానీ వీరికి లంగ్ క్యాన్సర్‌తో పాటు అనేక రకాల ఇతర క్యాన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. గొంతులో నస, ఆగని దగ్గు, కళ్లెలో రక్తం, ఆయాసం టీబీ వంటివి లంగ్ క్యాన్సర్ లక్షణాలు.

కడుపు ఉబ్బరం, మంట: ఆహార వేళల్లో టైమ్ సెన్స్ లేకపోవడం, నోరూరించే అనారోగ్య ఆహారపదార్థాలు తినడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాల వల కడుపులో మంట, త్రేన్పులు, ఉబ్బరం, ఆకలి తగ్గటం, వికారం వంటి లక్షణాలు కనిస్తుంటాయి. ఇవి పిల్లలు, పెద్దలు అందరిలో ఉంటాయి. సరైన జీవనశైలి అలవర్చుకుంటే ఇలాంటి సమస్యలు రావు. నీరు ఎక్కువగా తాగాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఎండోస్కోపి, స్కానింగ్ లాంటి పరీక్షలతో జీర్ణాశయంకు సంబంధించిన క్యాన్సర్స్, లివర్, ప్యాంక్రియాజ్, గాల్ బ్లాడర్ క్యాన్సర్స్‌ను తొలిదశలోనే కనుక్కోవచ్చు.

మూత్ర వ్యవస్థలో తేడాలు: మూత్రంలో రక్తం పడటం, మూత్రం ఆగి రావడం, మంటగా ఉండటం మొదలైనవి చూస్తూ వేడి చేసిందనుకుంటారు. సాధారణంగా నీళ్లు తక్కువగా తాగటం, ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీస్టోన్స్ వంటి కారణాల వల్ల ఈ లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు తీవ్రంగా ఉండి చికిత్సలకు లొంగకపోతే యూరినరి బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్స్ కావచ్చు అని గమనించుకోవాలి. 50 ఏళ్ల పైబడిన పురుషులలో ప్రొస్టేట్ గ్రంధి సమస్యలు, క్యాన్సర్ లక్షణాలు ఈ విధంగానే ఉండవచ్చు. నెలసరి మధ్య రక్తస్రావం, పొట్ట భారంగా ఉండటం, ఆకలి మందగించటం స్త్రీలు నెలసరి ముందు ఉంటే సమస్యలుగా (PMS) పొరబడచ్చుకాని కొన్ని సందర్భాలలో ఒవేరియన్, యుటిరైన్ క్యాన్సర్స్ కావచ్చు.

మలవిసర్జనలో తేడాలు : అజీర్తి, విరోచనాలు, మలంలో రక్తం వంటి సింప్టమ్స్ ఆహారపు అలవాట్లు మారినప్పుడు పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా వంటి సమస్యలున్నప్పుడు కన్పించవచ్చు. కాని ఎప్పుడూ మలవిసర్జన సమయంలో పడే రక్తాన్ని ఫైల్స్ అనుకున్నట్లయితే పొరబడుతున్నట్లే. దక్షిణ భారతదేశంలో పురుషులలో ఎక్కువగా కన్పించే కోలన్ క్యాన్సర్ లక్షణాలు కూడా కావచ్చు.

పరీక్షలు: మామూలు గడ్డలే అని, పాలగడ్డలు అని రొమ్ములో దీర్ఘకాలంపాటు కన్పించే కణితులను అశ్రద్ధ చేస్తే కణితి ఇతర భాగాలకు పాకే ప్రమాదం పొంచిఉన్నట్లే, అలసట, రక్తహీనతతోపాటు చర్మం మీద ఊదారంగు మచ్చలు, తేలికగా కమిలిపోవటం బ్లడ్ క్యాన్సర్‌గా హెచ్చరించవచ్చు. గోళ్లలో మార్పులు, ముందుకు వంగినట్లు ఉండటం లివర్, లంగ్ క్యాన్సర్స్ కు సూచనలు కావచ్చు. సిగ్మాయిడోస్కోపి, కొలనోస్కోపి వంటి పరీక్షలతో సమస్య ఏమిటో తేలిపోతుంది. ఇలాంటి లక్షణాలు కన్పించే సరికే క్యాన్సర్ ఇతర భాగాలకూ వ్యాపించి చికిత్సకు లొంగకుండా తయారవుతుంది. చాలావరకు క్యాన్సర్ ముదిరిన దశలోనే ట్రీట్‌మెంట్ చేయించుకుంటారు. ఇలా చేయొద్దు. అంతకుముందే మీకు అనుమానం ఉంటే రెగ్యులర్ హెల్త్ చెకప్స్, స్క్రీనింగ్ టెస్టు, గైనిక్ చెకప్ చేయించుకోవాలి.

డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు మన్మోహన్!

- నేడు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయనున్న మాజీ ప్రధాని
- కాంగ్రెస్‌కు మెజార్టీ సభ్యులు ఉండటంతో గెలుపు సులువు

జైపూర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరోసారి రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి రాజస్థాన్ నుంచి ఎన్నుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ ఆయనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికకు తమ అభ్యర్థిగా మన్మోహన్‌సింగ్‌ను కాంగ్రెస్ ఎంపికచేసింది. ఆయన మంగళవారం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయనున్నారు' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సచిన్ పైలట్ చెప్పారు. రెండు నెలల క్రితం బీజేపీకి చెందిన సభ్యుడు మదన్‌లాల్ సైనీ మృతితో ఖాళీ అయిన స్థానానికి ఈ నెల 26న ఎన్నికలు జరుగనున్నాయి. మూడు దశాబ్దాలుగా అసోం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మన్మోహన్‌సింగ్‌కు.. ఈ దఫా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. 1991 నుంచి 2019 వరకు వరుసగా ఐదుసార్లు మన్మోహన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2004 నుంచి 2014 వరకు రెండుసార్లు వరుసగా ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 100 మంది సభ్యుల బలం ఉన్నది. అలాగే 12 మంది స్వతంత్ర్య సభ్యులు కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో మన్మోహన్‌సింగ్ గెలుపు నల్లేరుపై నడక కానున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. మదన్‌లాల్ సైనీ మృతితో ఖాళీ అయిన స్థానానికి నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం.. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా ఆగస్టు 14గా పేర్కొన్నది. 26వ తేదీన అవసరమైతే ఎన్నిక నిర్వహించి అదేరోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ చేపట్టనున్నారు.

పిల్లల సంరక్షణ కేంద్రంలో అగ్ని ప్రమాదం

- అమెరికాలో ఐదుగురు మృతి

ఏరీ, ఆగస్టు 12: పిల్లల సంరక్షణ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో నలుగురు పిల్లలు ఒకే కుటుంబానికి చెందినవారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఈ ఘటన జరిగింది. ఏరీ ప్రాంతంలో 24 గంటల పాటు నిర్వహించే హారిస్ ఫ్యామిలీ డే కేర్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున 1.30కి అగ్ని ప్రమాదం సంభవించింది. అందులోని ఐదుగురు చిన్నారులు మృతి చెందగా, కేంద్రం నిర్వాహకుడు గాయపడటంతో దవాఖానకు తరలించారు. చనిపోయిన పిల్లల వయసు 8 నెలల నుంచి ఏడు ఏండ్ల వరకు ఉంటుందని ఏరీ అగ్నిమాపక శాఖ చీఫ్ గై శాంటోన్ తెలిపారు. కేంద్రం నిర్వాహకుడు ఇంటిలోనే డే కేర్ సెంటర్ నిర్వహిస్తున్నాడని, దీనికి అన్ని అనుమతులు పొందినట్లు అగ్నిమాపక శాఖ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జాన్ విడోమ్‌స్కీ చెప్పారు. అగ్ని ప్రమాద కారణాలపై ఏరీ పోలీస్ డిటెక్టివ్‌లతో కలిసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక మీడియాకు ఆయన తెలిపారు. మరోవైపు ఈ దుర్ఘటనలో తమ నలుగురు చిన్నారులు చనిపోయారని వారి నానమ్మ వాలెరీ వాపోయారు. వారి తల్లిదండ్రులు రాత్రి విధులకు వెళ్లాల్సి ఉండటంతో గత ఏడాదిగా ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను పిల్లల సంరక్షణ కేంద్రంలో ఉంచుతున్నట్లు ఆమె చెప్పారు. ఈ అగ్నిప్రమాదంలో వారందరినీ కోల్పోయామని వాలెరీ ఆవేదన వ్యక్తం చేశారు.



అంతర్జాతీయ రెజ్లర్ బబిత ఫోగట్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా. చిత్రంలో బబిత తండ్రి మహావీర్ ఫోగట్, కేంద్రమంత్రి కిరెన్ రిజిజు

బీజేపీలోకి బబిత, మహావీర్ ఫోగట్

ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించిన తండ్రీకూతురు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: కామన్వెల్త్ క్రీడల్లో పసిడి పతకం సాధించిన అంతర్జాతీయ రెజ్లర్ (మల్లయోధురాలు) బబితా ఫోగట్ (29), ఆమె తండ్రి మహావీర్ ఫొగట్ సోమవారం బీజేపీలో చేరారు. మల్లవిద్యలో తన కుమార్తెలకు శిక్షణ ఇచ్చి వారిని విజయపథంలో నడిపిన మహావీర్ ఫొగట్ ప్రముఖ బాలీవుడ్ చిత్రం 'దంగల్'కు స్ఫూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ హర్యానా శాఖ ఇంచార్జి అనిల్ జైన్, ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా సమక్షంలో బీజేపీలో చేరిన బబిత, మహావీర్.. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దుచేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. హర్యానాకు చెందిన వీరిద్దరూ తమ పార్టీలో చేరడం త్వరలో ఎన్నికలు జరుగనున్న ఆ రాష్ట్రంలో తమకు లాభిస్తుందని బీజేపీ భావిస్తున్నది. హర్యానా శాసనసభకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరుగనున్నాయి. రెజ్లింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి 'అర్జున' అవార్డును గెలుచుకున్న బబిత బీజేపీలో చేరిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి మోదీ చరిత్ర సృష్టించారని, ఆయనకు తాను వీరాభిమానినని చెప్పారు. కశ్మీరీ వధువుల గురించి వ్యాఖ్యలుచేసి వివాదంలో చిక్కుకున్న హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ఆమె బాసటగా నిలిచారు. 'మహిళల గురించి మనోహర్‌లాల్ ఖట్టర్ జీ ఎలాంటి తప్పుడు ప్రకటన చేయలేదు. ఆయన ప్రకటనను వక్రీకరించవద్దని మీడియాను కోరుతున్నా' అని బబిత అన్నారు. 'ద్రోణాచార్య' అవార్డు గ్రహీత మహావీర్ ఫోగట్ మాట్లాడుతూ.. పుల్వామాలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ప్రాణాలను బలిగొన్న పాకిస్థాన్ ఉగ్రమూకలపై ప్రతీకారం తీర్చుకోవడం లేదా ఆర్టికల్ 370ని రద్దుచేయడం లాంటి పెద్ద నిర్ణయాలు తీసుకోవడం కేవలం మోదీకి మాత్రమే సాధ్యమవుతుందని కితాబిచ్చారు. అనేక అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో దేశానికి పతకాలను అందించిన బబిత యువతకు స్ఫూర్తిగా నిలిచారని, మల్లవిద్యలో కుమార్తెలకు శిక్షణ ఇచ్చి వారిని అంతర్జాతీయ రెజ్లర్లుగా తీర్చిదిద్దిన మహావీర్ కూడా ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కొనియాడారు.

కశ్మీర్‌లో ప్రశాంతంగా బక్రీద్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆంక్షల నేపథ్యంలో కళతప్పిన పండుగ
- సరిహద్దుల్లో స్వీట్లు స్వీకరించని పాక్

శ్రీనగర్/జమ్ము, ఆగస్టు 12: చెదురుమదురు ఘటనలు మినహా, జమ్ముకశ్మీర్‌లో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయమే ప్రజలు మసీదులకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా కర్ఫ్యూ తరహా ఆంక్షల నేపథ్యంలో పండుగ కళ తప్పింది. జమ్ముకశ్మీర్ గవర్నర్ అధికార ప్రతినిధి, ప్రధాన కార్యదర్శి రోహిత్ కన్సల్ మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్ల మాత్రం ఆందోళనలు చోటుచేసుకున్నాయి. అయితే ఎవరూ గాయపడలేదు' అని వివరించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన మార్కెట్లలో తగిన సంఖ్యలో గొర్రెలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. శ్రీనగర్, షోపియాన్‌లోని ప్రముఖ మసీదుల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారని కేంద్ర హోం శాఖ తెలిపింది. బారాముల్లాలోని జామియా మసీదులో 10,000 మంది, జమ్ములోని ఈద్గాలో 4500 మంది ప్రార్థనలు నిర్వహించినట్లు ట్విట్టర్‌లో పేర్కొంది. కశ్మీర్ లోయలోని వివిధ ప్రాంతాల్లో బక్రీద్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పోలీసులు తెలిపారు. జమ్ములో ప్రార్థనల అనంతరం పెద్ద సంఖ్యలో హిందువులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారని, మిఠాయిలు పంచుకున్నారని పేర్కొన్నారు. పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ఆంక్షలను సడలించినట్లు కిస్త్వార్ జిల్లా డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

కశ్మీర్‌లోయలో ఉన్న ఆంక్షల నేపథ్యంలో సొంత ఇళ్లకు వెళ్లలేని కశ్మీరీ విద్యార్థులకు సోమవారం ఢిల్లీలో బక్రీద్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కశ్మీరీ విద్యార్థిని భావోద్వేగం.

బక్రీద్ సందర్భంగా శ్రీనగర్‌లో సోమవారం ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

14 జిల్లాల్లో ఆంక్షలు ఎత్తివేత

ఉగ్రదాడులు, అల్లర్లు జరిగే అవకాశమున్నదన్న హెచ్చరికల నేపథ్యంలో శ్రీనగర్‌లో అధికారులు నిషేధాజ్ఞలు అమలు చేశారు. సున్నిత ప్రదేశాల్లో ఎక్కువ మంది గుమిగూడకుండా నిషేధం విధించారు. స్థానిక మసీదులకు పెద్ద యెత్తున ప్రజలు చేరుకొని ప్రార్థనలు జరిపారని, ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారని అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో సాధారణంగా జరిగే చిన్న చిన్న ఘర్షణలు తప్ప, పెద్దగా ఏం జరుగలేదని, భద్రతా సిబ్బంది ఒక్క బుల్లెట్ కూడా పేల్చలేదని పోలీసులు తెలిపారు. బక్రీద్ సందర్భంగా శ్రీనగర్‌లో ఆదివారం 50 శాతానికి పైగా దుకాణాలు తెరుచుకున్నాయని, ప్రజలు పెద్దయెత్తున పండుగ కొనుగోళ్లు జరిపారని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని అధికారులు తెలిపారు. పండుగ సందర్భంగా శ్రీనగర్, కశ్మీర్ లోయల్లో 2.5 లక్షల మేకలు, గొర్రెల విక్రయాలు జరిగినట్టు అధికారులు తెలిపారు. జమ్ములో ఐదు జిల్లాల్లో, కశ్మీర్‌లోని తొమ్మిది జిల్లాల్లో ఆంక్షలను ఎత్తివేసినట్టు పోలీసులు తెలిపారు. 'ప్రజలు తమ వాళ్లతో మాట్లాడుకోవడానికి కశ్మీర్ డివిజన్‌లో 300 పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లను ఏర్పాటు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ద్వారా మీడియా ప్రతినిధులకు ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాం' అని అధికారులు తెలిపారు.

బోసిపోయిన మాజీ సీఎంల నివాసాలు

బక్రీద్ పండుగ సందర్భంగా మద్దతుదారులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో సందడిగా ఉండే మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ నివాసాలు ఈసారి బోసిపోయాయి. కేవలం ఒక భద్రత వాహనం మాత్రమే వారి నివాసాల వెలుపల ఉన్నది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఈ ముగ్గురు నేతలనూ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లాను గృహ నిర్బంధంలో ఉంచగా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లాను హరినివాస్ ప్యాలెస్‌లో ఉంచారు. పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీని చెష్మా సాహీ హట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇతర రాజకీయ నేతలు సెంటౌర్ హోటెల్‌లో ప్రార్థనలు నిర్వహించినట్లు చెప్పారు.

అజిత్ దోవల్ ఏరియల్ సర్వే

కశ్మీర్ విభజన, 370 అధికరణ రద్దు నేపథ్యంలో కశ్మీర్‌లో శాంతి భద్రతల పరిస్థితులపై జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ సోమవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా శ్రీనగర్‌తో పాటు, దక్షిణ కశ్మీర్ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను సమీక్షించారు. పోలీసు ఉన్నతాధికారి దిల్‌బాగ్ సింగ్‌తో పాటు ఆర్మీ కమాండర్లు కూడా కశ్మీర్ లోయలో విడివిడిగా ఏరియల్ సర్వేలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.

మిఠాయిలు పంచుకునేందుకు నిరాకరించిన పాక్

బక్రీద్, హోలీ, దీపావళి వంటి ప్రధాన పండుగలు, జాతీయ దినోత్సవాల సందర్భంగా భారత్, పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్, పాకిస్థాన్ రేంజర్లు పరస్పరం మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు చెప్పుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే సోమవారం బక్రీద్ సందర్భంగా ఈ కార్యక్రమం జరుగలేదు. ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగా పాకిస్థాన్ భారత్‌తో సంబంధాలను ఏకపక్షంగా తెంచుకోవడమే ఇందుకు కారణమని సమాచారం. బక్రీద్ నేపథ్యంలో జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వెంబడి అంతర్జాతీయ సరిహద్దుల్లో స్వీట్లు పంచుకుని, శుభాకాంక్షలు తెలుపడానికి బీఎస్ఎఫ్ అధికారులు పాక్‌కు సమాచారమిచ్చారు. అయితే ఇందుకు పాక్ నిరాకరించిందని అధికారులు తెలిపారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భారత్, బంగ్లాదేశ్ భద్రతా సిబ్బంది స్వీట్లు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వంగరకు హరితశోభ

- ఆదర్శంగా నిలిచిన దివంగత పీవీ సొంతూరు
- స్మృతివనం, గురుకులం చుట్టూ పచ్చదనం

వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని పీవీ నరసింహారావు స్మృతివనం

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: దేశంలో ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరొందిన దివంగత ప్రధాని వీపీ నరసింహారావు సొంతూరైన వంగరకు హరితహారం కొత్త శోభ తెచ్చిపెట్టింది. మహోన్నత వ్యక్తి నడయాడిన నేలను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో చేపట్టిన హరితహారం గ్రామానికి పచ్చలహారంగా మారింది. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో జిల్లా యంత్రాంగం నాటిన నాలుగు వేల పైచిలుకు మొక్కలు బతికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వంగరలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నేతృత్వంలో దాదాపు రెండున్నరేండ్ల కిందట హరితహారం చేపట్టారు. ఐదెకరాల కమ్యూనిటీ ప్లాంటేషన్ పేరిట 2,200 నీడనిచ్చే మొక్కలు నాటారు. అక్కడున్న తెలంగాణ గురుకుల పాఠశాల ఆవరణలో మరో మూడు నుంచి నాలుగు ఎకరాల మేర మొక్కలు నాటారు. అవన్నీ ఏపుగా పెరిగాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మొక్కలు నాటడంతోపాటు హరితరక్షకుడిని(వాచర్) నియమించింది. కమ్యూనిటీ ప్లాంటేషన్ చుట్టూ కందకం తవ్వి జంతువులు, పశువులు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గురుకుల పాఠశాల (ఇనిస్టిట్యూషన్ ప్లాంటేషన్)లో భాగంగా నాటిన మొక్కలను విద్యార్థులు, అధ్యాపకులు కలిసి సంరక్షించారు. రెండేండ్ల కిందట నాటిన హరితహారం మొక్కలు బాగా పెంచినందుకు, ఆ పాఠశాలకు హరితమిత్ర అవార్డు కూడా దక్కింది. అవార్డు కింద పారితోషికంగా వచ్చిన నగదుతో గురుకుల పాఠశాల ప్రాంగణంలో బోరు వేయించారు. దీంతో మొక్కలను బతికించుకొనేందుకు నీటి కొరత సమస్య లేకుండాపోయింది. చిత్తశుద్ధితో సమూహ భాగస్వామ్యంతో విజయవంతమై వంగర హరితహారం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నది.

ప్రతి మొక్కను బతికించే ప్రయత్నం

తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మరింత బాధ్యతాయుతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అందులో భాగంగానే ప్రతి వెయ్యి మొక్కలకు ఒక వాచర్‌ను నియమిస్తున్నాం. ఇటీవల సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాం. వంగర విజయగాథను వివరించాం. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతిగ్రామానికి హరితరక్షక కమిటీలు వేశాం. నాటిన ప్రతి మొక్కను బతికించాలన్న పట్టుదలతో కలెక్టర్ మార్గదర్శకాలు రూపొందించారు.

–రాము, పీడీ(డీఆర్‌డీఏ), వరంగల్ అర్బన్ జిల్లా

మేడిపల్లి మండలం చెంగిచెర్ల రిజర్వు ఫారెస్ట్‌లో విత్తనాలు వెదజల్లేందుకు గాల్లోకి డ్రోన్‌ను పంపిస్తున్న రాష్ట్ర ఫారెస్టు కార్పొరేషన్ ఎండీ రఘువీర్

రిజర్వు ఫారెస్ట్‌లో డ్రోన్‌తో విత్తనాలు

- చెంగిచెర్లలో ప్రయోగాత్మకం
- విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ రఘువీర్

ఘట్‌కేసర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల రిజర్వు ఫారెస్ట్‌లో సోమవారం అటవీఅధికారులు డ్రోన్‌సాయంతో విత్తనాలు వెదజల్లారు. రాష్ట్రంలో తొలిసారి ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టినట్టు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ రఘువీర్ తెలిపారు. చెంగిచెర్ల ఫారెస్ట్‌లో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతామని చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఉమేశ్‌చౌదరి ఈ విధానాన్ని రూపొందించారన్నారు. డ్రోన్ సాయంతో దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం మేరకు 500 నుంచి 700 గ్రాముల విత్తనాలను వెదజల్లవచ్చని చెప్పారు. డ్రోన్‌కు ప్రత్యేకంగా తయారుచేసిన బాక్సులో విత్తనాలు వేసిన తర్వాత గాల్లోకి పంపించిన తర్వాత విత్తనాలు ఉన్న బాక్సు తెరుచుకొనే విధంగా రూపొందించారు. గాల్లోకి డ్రోన్ వెళ్లిన తర్వాత అనుకున్న చోటకు వెళ్లగానే విత్తనాల బాక్సు తెరుచుకుంటుందని తెలిపారు. సంకల్ప తరు సంస్థ ద్వారా మొక్కలను పెంచడం, మొక్కలను రక్షించడం, విత్తనాలు నాటడం, అడవిలో ఫైర్‌ను నివారించడం వంటివి సేవలందిస్తున్నట్టు ఉమేశ్‌చౌదరి చెప్పారు. చెంగిచెర్ల అడవిలో రావి, మర్రి, చింత తదితర విత్తనాలు చల్లారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రిసెర్చ్ పర్సన్ వెంకటేశం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అటవీ అధికారి డీ సుధాకర్‌రెడ్డి, ఫారెస్ట్ రిసెర్చ్ పర్సన్ వెంకటేశం, డీఎం శిరీష ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కాస్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రీతిపూజ పాల్గొన్నారు.

జెండా ఎగురవేస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అశోక్‌స్టాలిన్

ఏఐఎస్ఎఫ్ 84వ ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అశోక్‌స్టాలిన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 84వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఎందరో రాజకీయవేత్తలను, మేధావులను అందించిన చరిత్ర ఈ సంఘానికి ఉందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎన్ శంకర్, ఉపాధ్యక్షులు పుట్ట లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీమన్, ప్రధానకార్యదర్శి గ్యార నరేశ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు కాంపల్లి శ్రీను, కాసోజు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భారీవర్షాలతో దక్షిణమధ్యరైల్వేకు 3.88 కోట్లు నష్టం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారీవర్షాలు, వాతావరణ సమస్యల కారణంగా దక్షిణమధ్యరైల్వే రూ.3.88 కోట్ల నష్టపోయినట్టు తెలుస్తున్నది. పలురైళ్ల రద్దు, పాక్షికరద్దు, దారి మళ్లింపు చర్యలతో ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆగస్టు2 నుంచి 12 వరకు మొత్తంగా 380 రైళ్లను పూర్తిరద్దు, పాక్షికరద్దు, దారిమళ్లించినట్టు అధికారులు చెప్పారు. రైలుసర్వీసుల అంతరాయం వల్ల 88 వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు అంచనా వేశారు. సోమవారం సైతం పలురైళ్లను రద్దుచేస్తున్నట్టు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ముంబైలో కురుస్తున్న వర్షాలు తీవ్ర ప్రభావాన్ని కల్గించాయని, వాతావరణ ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైల్వేసేవలు నిరాటంకంగా సాగేందుకు రైల్వే శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైల్వేసంఘాల నేతలు కోరుతున్నారు.

సాగు తక్కువ.. వినియోగం ఎక్కువ

రోజుకు 1,240 టన్నుల ఉల్లి వినియోగం

- మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి ఉల్లి దిగుమతి
- అవగాహనాలోపంతో దృష్టిసారించని రైతులు
- మరో 5వేల ఎకరాల్లో సాగు అవసరాన్ని గుర్తించిన ఉద్యానశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వినియోగానికి సరిపడ ఉల్లి ఉత్పత్తి జరుగడం లేదు. మన రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా తాండూరు, మెదక్ జిల్లా నారాయణఖేడ్, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్, అలంపూర్‌తోపాటు నల్లగొండలో ఉల్లి సాగు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో సాగు తక్కువగా ఉండటం, వినియోగం ఎక్కువగా ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. నవంబర్ నుంచి మార్చి వరకు ఉల్లి దిగుమతి అవుతున్నది. దేశంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన నాసిక్‌లోని లాసల్స్ నుంచి నిత్యం హైదరాబాద్ మార్కెట్‌కు ఉల్లిగడ్డ దిగుమతి అవుతున్నది. రోజువారీగా మలక్‌పేట గంజ్‌కు 60వేల నుంచి 70వేల క్వింటాళ్ల ఉల్లిగడ్డ దిగుమతి అవుతున్నది. వీటిలో 10వేల క్వింటాళ్లు నగర అవసరాలకే వినియోగిస్తున్నారు. 2018-19లో మలక్‌పేట మార్కెట్‌కు 28,66,702 క్వింటాళ్ల ఉల్లిగడ్డ వచ్చింది. ఇక్కడ దాదాపు రూ.203 కోట్ల 25 లక్షల వ్యాపారం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఉల్లిసాగుకు అనుకూలమైన వాతావరణ ఉన్నది. అయితే సరైన అవగాహన లేకపోవడం వల్ల రైతులు ఉల్లి పంట సాగు వైపు దృష్టి సారించడం లేదు. ఉల్లి నిల్వకు సరైన కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడం వల్ల నష్టపోతుండటం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. గతంలో నిజామాబాద్ జిల్లాలో ఉల్లి నిల్వకు ఏర్పాటుచేసిన గోదాములు ప్రస్తుతం పనిచేయడం లేదు. ఈ ఏడాది కొల్లాపూర్, అలంపూర్ ప్రాంతాలతోపాటు రాష్ట్రంలో ఉల్లిసాగు అనుకొన్న స్థాయిలో లేకపోవడంతో ఉల్లిగడ్డ ధరలు పెరిగే అవకాశాలు ఉంటున్నాయి.



మరో 55వేల టన్నులు కావాలి

దేశీయ ఉల్లిలో ఘాటు ఎక్కువగా ఉండటం వల్ల గ్రామాల్లో ఎక్కువగా ఇష్టపడతారు. యూరప్‌లో పెద్దసైజు, తక్కువ ఘాటున్న ఉల్లికి డిమాండ్ ఉన్నది. స్టార్ హోటళ్లలో ఘాటు తక్కువగా ఉండే రకాలను ఎక్కువగా కోరుకొంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పూణెలోని రాజ్‌గురునగర్ పరిశోధన కేంద్రం ఘాటు తక్కువగా ఉన్న ఉల్లిని రూపొందించింది. రాష్ట్రంలో తలసరి ఉల్లిగడ్డ వాడకం రోజుకు 36 గ్రాములు ఉండగా.. రోజుకు 1,240 టన్నులు వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 38,940 ఎకరాల్లో 4,02,373 మెట్రిక్ టన్నుల ఉల్లిసాగు జరుగుతున్నట్టు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర అవసరాలు తీరాలంటే మరో 5,500 ఎకరాల్లో 55,427 మెట్రిక్ టన్నుల మేర సాగుచేయాల్సిన అవసరం ఉన్నదని గుర్తించారు. తక్కువ నీటి అవసరమున్న ఈ పంట సాగును మరింతగా ప్రోత్సహిస్తే యాసంగి, వానాకాలంలో కూడా సాగుచేయవచ్చు. ఉల్లి ఉత్పత్తిలో మహారాష్ట్ర 30.48 శాతంతో మొదటిస్థానంలో ఉండగా.. త

రెబల్స్ కలయికలో..

పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ, ఛార్మి

తెరపై హీరోయిజం కంటే రియల్ లైఫ్‌లో లక్ష్యశుద్ధి కలిగిన ధిక్కార స్వభావిగా (రెబల్ విత్ ఏ కాజ్) యువతరంలో రౌడీ ఇమేజ్‌ను సంపాదించుకున్నారు విజయ్ దేవరకొండ. ఇక దర్శకుడు పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ మాస్, యాక్షన్ కథాంశాలతో డాషింగ్ డైరెక్టర్ అనే పేరు తెచ్చుకున్నారు. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం పూరి నైజం. ఆటిట్యూడ్ విషయంలో ఎన్నో సారూప్యతులున్న వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమాకు రంగం సిద్ధమైంది. విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాను పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మించబోతున్నారు. 'ఇస్మార్ట్ శంకర్'తో ఇటీవలే పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్న పూరి జగన్నాథ్ తాజాగా విజయ్ దేవరకొండతో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సమర్పణ: లావణ్య, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

ఫొటోజెనిక్

'బోల్డ్, క్లీన్, వల్గారిటీ మధ్య హద్దులు ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆ హద్దులు దాటినప్పుడు సమస్యలు ఉత్పన్నమవుతాయి' అని చెప్పింది రెజీనా. జయాపజయాలకు అతీతంగా విలక్షణ పాత్రల్ని ఎంచుకుంటూ సినీ ప్రయాణాన్ని సాగిస్తున్నదామె. రెజీనా కథానాయికగా నటించిన తాజా చిత్రం 'ఎవరు'. వెంకట్ రామ్‌జీ దర్శకుడు. ఈ నెల 15న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో రెజీనా పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి..

చిత్రసీమలోని రూల్స్, ప్రొటోకాల్స్ నేను ఫాలో కాలేదు!

ఈ సినిమాను అంగీకరించడానికి కారణం ఏమిటి?

• ఈ కథ విన్న వెంటనే ఎలాంటి ప్రశ్నలు, సంశయాలు లేకుండా వెంటనే సినిమా చేస్తానని చెప్పాను. తొలిరోజు షూటింగ్‌లో నన్ను దృష్టిలో పెట్టుకొనే ఈ కథను సిద్ధం చేసుకున్నానని దర్శకుడు చెప్పింది వినగానే సంతోషం కలిగింది.

ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

• సమీర అనే యువతిగా నా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. ముఖంలో ఎక్కువ హావభావాలు కనిపించవు. తక్కువగా మాట్లాడుతూ షార్ట్ హెయిర్‌తో వినూత్నంగా ఉంటుంది. కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్న సమీర జీవితాన్ని ఓ అనూహ్య సంఘటన మలుపుతిప్పుతుంది? అదేమిటి? ఆమె జీవితంలోని శేషప్రశ్నలకు విక్రమ్ వాసుదేవ్ అనే పరిశోధన అధికారి ఎలా సమాధానం చెప్పాడన్నది ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో తీవ్రమైన ఉద్వేగాలతో కూడిన క్యారెక్టర్ ఇది. అన్ని రకాల ఎమోషన్స్‌తో విందుభోజనంలా ఉంటుంది. సినిమా మొత్తంలో 80 శాతానికిపైగా నేనే కనిపిస్తాను. ఇలాంటి పాత్ర దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను.

బాలీవుడ్ చిత్రం 'బద్లా'తో ఈ సినిమాకు పోలికలు ఉన్నాయనే విమర్శలువినిపిస్తున్నాయి?

• ఆ వార్తలు నేను విన్నాను. ట్రైలర్ చూసిన తర్వాత చాలా మంది నన్ను ఆ ప్రశ్న అడిగారు. విడుదల తర్వాత రెండు సినిమాలకు మధ్య ఉన్న సంబంధం ఏమిటో ప్రేక్షకులే గ్రహిస్తారు

పెద్ద సినిమాలు చేయలేకపోయానే అసంతృప్తి ఉందా?

• తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఏడేళ్లు అవుతోంది. తొలి సినిమా సమయంలో చిత్ర పరిశ్రమ గురించి ఎలాంటి అవగాహన లేదు. మా కుటుంబానికి సంబంధించిన వారు, స్నేహితులు ఇండస్ట్రీలో ఎవరూ లేరు. అందువల్లే ఇండస్ట్రీ తీరు తెన్నులను అర్థం చేసుకోవడానికి సమయం పట్టింది. చిత్రసీమలో చాలా రూల్స్, ప్రొటోకాల్స్ ఉంటాయి. అందరూ వాటినే ఫాలో అవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ నేను మాత్రం నా స్వీయ నిర్ణయాలకే కట్టుబడి ప్రయాణం సాగించాను. నా మనసుకు నచ్చిన విధంగా సొంత అడుగులు వేయడానికే ప్రయత్నించాను. పెద్ద సినిమాలు అవకాశాలు రాకపోవడానికి కారణలేమిటో తెలియదు. తప్పొప్పుల గురించి ఆలోచించడం లేదు. నా కెరీర్ ఇంకా ముగిసిపోలేదు. ఎంతో భవిష్యత్తు ఉంది.

హిందీలో మీరు అరంగేట్రం చేసిన 'ఏక్ లడ్‌కీకో దేఖాతో ఐసా లగా' ఎలాంటి సంతృప్తిని మిగిల్చింది?

• కథ విన్న తర్వాత అలాంటి మంచి పాత్ర మళ్లీ దొరకదనిపించింది. వినూత్నమైన కథల్ని చెప్పాల్సిన అవసరం ఉందనే ఆలోచనతో అంగీకరించాను. లెస్బియన్‌గా నా పాత్ర చాలా మందిని మెప్పించింది. కమర్షియల్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న నేను పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేశానని ప్రశంసించారు.

తదుపరి సినిమా విశేషాలేమిటి?

• తమిళంలో 'కసడతబర' సినిమా చేస్తున్నాను. సందీప్‌కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. చింబుదేవన్ దర్శకుడు. దీనితో పాటు 'పార్టీ' సినిమా చేస్తున్నాను. రానాతో చేసిన '1945' సినిమా చిత్రీకరణ పూర్తయింది. అయితే నిర్మాణపరమైన కారణాల వల్ల ఆ సినిమా ఆగిపోయింది.

కీర్తిసురేష్‌కు జాతీయ అవార్డు రావడం ఏమనిపించింది?

• మహానటి లాంటి సినిమాలో నటించే అవకాశం అందరికి రాదు. సావిత్రి పాత్రలో కీర్తి జీవించింది. వందశాతం న్యాయం చేసింది. ఆమెకు జాతీయ అవార్డు రావడం సంతోషాన్నిచ్చింది.

కథలున్నాయి.. దర్శకత్వం చేస్తా!

కల్యాణి ప్రియదర్శన్

'హలో' 'చిత్రలహరి' చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మలయాళీ సోయగం కల్యాణి ప్రియదర్శన్. చూడచక్కనిరూపం, అభినయంతో యువతరాన్ని మెప్పించింది. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'రణరంగం'. శర్వానంద్ కథానాయకుడు. సుధీర్‌వర్మ దర్శకుడు. ఈ నెల 30 విడుదలకానుంది. ఈ సందర్భంగా కల్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ 'ఈ కథ వింటున్నప్పుడే స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా అనిపించింది. గతాన్ని, వర్తమానాన్ని స్పృశిస్తూ కథాగమనం అనేక మలుపులతో ఆసక్తిని రేకెత్తించింది. ఓ వ్యక్తి జీవితానికి దర్పణంలా ఈ చిత్ర కథ తీవ్రమైన భావోద్వేగాల కలబోతగా సాగుతుంది. సినిమాలో నా పాత్ర పేరు గీత. పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. కథానాయకుడు జీవితంలోకి గీత ఎలా ప్రవేశించింది? ఎంత బలంగా అతన్ని ప్రభావితం చేసిందనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. 90వ దశకంలో కథలో కొంతభాగం జరుగుతుంది. అలనాటి కథానాయికల సినిమాలను పరిశీలించి నా పాత్ర విషయంలో పరిపూర్ణత ప్రదర్శించడానికి ప్రయత్నించాను. ఈ సినిమా కోసం నా జీవితంలో తొలిసారి వోణి కట్టాల్సివచ్చింది. హాఫ్‌సారీలో నేను చాలా అందంగా ఉన్నానని అమ్మనాన్న మెచ్చుకున్నారు. ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్స్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో పాటు అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. . నాకు స్వతహాగా గ్యాంగ్‌స్టర్ సినిమాలంటే ఇష్టం. అందుకే ఈ కథతో బాగా కనెక్ట్ అయ్యాను. నా గత చిత్రాలతో పోల్చితే ఈ సినిమాలో నేను పరిణితి కలిగిన అమ్మాయి పాత్రను పోషించాను. అయితే వ్యక్తిత్వపరంగా ఇప్పటికీ నేను చిన్నపిల్లనే (నవ్వుతూ). సినిమాల విషయంలో నేను సెలెక్టివ్‌గా ఉంటాను. కథలో కొత్తదనం ఉంటేనే అంగీకరిస్తాను. మనసులో కొన్ని కథలు అనుకున్నా. అవకాశం వస్తే భవిష్యత్తులో దర్శకత్వం చేసే ఆలోచన ఉంది' అని చెప్పింది.

ప్రేక్షకులు నిర్ణయిస్తే 'ఏదైనా జరగొచ్చు'

రమాకాంత్, శివాజీరాజా, విజయ్, సాషా, సుదర్శన్, పూజా

'దర్శకుడు రమాకాంత్ ఈ సినిమాకు అసలైన హీరో. రమాకాంత్ చెప్పిన కథను నమ్మే ఈ సినిమాతో మా అబ్బాయిని హీరోగా పరిచయం చేసే బాధ్యతను అతడికి అప్పగించాను. సినిమా విజయవంతమైతే నాకంటే ఎక్కువ సంతోషించేవారు ఎవరూ ఉండరు' అని అన్నారు శివాజీరాజా. ఆయన తనయుడు విజయ్ రాజా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. కె. రమాకాంత్ దర్శకుడు. వెట్ బ్రెయిన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సుధర్మ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. సాషాసింగ్, పూజా సోలంకీ కథానాయికలు. ఈ నెల 23న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో నటుడు శివాజీ రాజా విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నన్ను ఆదరించినట్లుగానే మా అబ్బాయిని తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి. సినిమా అద్భుతంగా, గొప్పగా ఉంటుందని, నటీనటులు ఇరగదీశారని నేను చెప్పను. 23 తర్వాత ప్రేక్షకులే బాగుందో లేదో నిర్ణయిస్తారు. విజయ్‌రాజా పాత్ర ప్రత్యేకతలేమీ లేకుండా కథలో అంతర్భాగంగా సాధారణంగా ఉంటుంది' అని అన్నారు. 'డార్క్ కామెడీ కథాంశంతో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ చిత్రమిది. ఏప్రిల్ ఒకటిన పుట్టిన ముగ్గురు యువకులు చేసిన సరదా పనులు వారిని ఎలా ఇబ్బందుల్లోకి నెట్టాయన్నది ఆసక్తిని పంచుతుంది. తొలి సినిమా అయినా ఎలాంటి భయం లేకుండా విజయ్‌రాజా అద్భుతమైన అభినయాన్ని కనబరిచాడు' అని దర్శకుడు చెప్పారు. అమ్మనాన్నల ప్రోత్సాహం వల్లే తాను నటుడిని కాగలిగానని విజయ్‌రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, జగన్, రాఘవ, రవి తదితరులు పాల్గొన్నారు.